PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 1 | విజయవాడ, గురువారం 1 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 1 August 2024 | Rs



నాలుగున్నర దశాబ్దాల ప్రజాపాత్రికేయం

నాలుగో పేజీలో..



పతకాలకు చేరువలో స్వప్నిల్, లౌవ్లీనా

- ప్రి క్వార్టర్స్‌కు లక్ష్యసేన్, సింధు

8

రైతు సాయం ఇప్పట్లో లేనట్లేనా!

కర్షకుల ఆశలపై నీళ్లు చల్లిన 'ఓటాన్ అకౌంట్'

అసలు ఈ ఏడాది ఉంటుందా అనేదీ సందేహమే

ఖరీఫ్ పెట్టుబడుల కోసం అన్నదాతల వెతుకులాట



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

మరో నాలుగు నెలలకు పభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ఆర్డినెన్స్ తెచ్చిన నేపథ్యంలో రైతులకు ప్రతిఏటా రూ.20 వేలు సాయం చేస్తామన్న టిడిపి కూటమి ఎన్నికల హామీ సందిగ్ధంలో పడింది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మాసాలకు నిధుల ఖర్చు నిమిత్తం సర్కారు ఆర్డినెన్స్ ద్వారా ఆమోదం తీసుకున్నందున నవంబర్ లోపు రైతులకు చేస్తామన్న సాయం అందే అవకాశం లేదని తెలుస్తోంది. పోనీ పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాకనైనా ఈ ఏడాదిలో రైతులకు సాయం చేస్తారా లేదా అనే సందేహాలూ కలుగుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత ప్రభుత్వం వెల్లడించిన సర్కారు, ఒకటీఅరా స్కీంలు మినహా ఈ సంవత్సరం ఇక పెద్ద పెద్ద ఖర్చులతో కూడుకున్న కొత్త పథకాలేమీ ఉండబోవని పరోక్ష సంకేతాలు వదిలింది. మంత్రివర్గ సమావేశంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటువంటి వ్యాఖ్యలే చేశారని బయటికొచ్చింది. ఇవన్నీ చూస్తుంటే అన్నదాతలకు సాయం ఇప్పుడప్పుడే కాదని అర్థమవుతోందని ప్రభుత్వంలో చర్చ జరుగుతోంది.

సాగు సాగేదెలా?

ఖరీఫ్ సీజన్ మధ్యలోకొచ్చింది. సెప్టెంబర్ నెలాఖరుతో పంటల సాగుకు సమయం ముగుస్తుంది. వర్షాలు బానే కురుస్తున్నప్పటికీ పంటల సేద్యంలో పెద్దగా పురోగతి లేదు. రాయలసీమలో వేరుశనగ సాగుపై ఆశలు సన్నగిల్లాయి. వాణిజ్యపంట పత్తి సైతం ఆశించిన మేరకు పడలేదు. మరోవైపు ప్రాజెక్టుల్లో నీరు లేక కృష్ణా డెల్టాలో, నాగార్జునసాగర్ ఆయకట్టులో వరి సాగు ఇబ్బందుల్లో పడింది. మరో వైపు భారీ వర్షాలు, వరదల వలన సాగైన పంటలు నీటిపాలయ్యాయి. సుమారు లక్ష ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అసెంబ్లీలో సిఎం ప్రకటించారు. నష్టపరిహారంపై (ఇన్‌పుట్ సబ్సిడీ) ఇంకా ప్రభుత్వంలో కదలిక లేదు. మరోవైపు 2022-23 రబీ, 2023 ఖరీఫ్, 2023-24 రబీ పంటల బీమా క్లెయిములు పెండింగ్‌లో ఉన్నాయి. పంట రుణాలపై 'సున్నా వడ్డీ' రీయింబర్స్‌మెంట్ అలాగే ఉంది. బ్యాంకులు రైతులకు రుణాలివ్వట్లేదు. కౌలు రైతులకైతే ఆ వసతులు అసలే లేవు. దాంతో రైతులు ఖరీఫ్ పెట్టుబడుల కోసం వెతుకులాటలో ఉన్నారు. ప్రభుత్వం అందిస్తామన్న సాయం రూ.20 వేల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

చర్చ లేదు

రైతులకు చేస్తామన్న సాయంపై ఇప్పటి వరకు ప్రభుత్వంలో కనీసమాత్రపు చర్చ లేదు. కేంద్రం ఇచ్చే పిఎం కిసాన్‌తో కలిపా, కలపకుండానా, కౌలు రైతులకు ఇస్తారా లేదా అనేదానిపై ప్రభుత్వం విధి విధానాలు రూపొందిస్తేనే స్పష్టత వస్తుంది. ఈ సందేహాలు ఇలా ఉండగానే ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు నిర్వహించినప్పటికీ పూర్తి స్థాయి బడ్జెట్ పెట్టలేదు. ఆ పని చేస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో రైతు సాయం ఉంటుందా లేదా అనే విషయంపై ఒక మేరకు స్పష్టత వచ్చేది. అసెంబ్లీ సమావేశాలు ముగిశాక మంత్రిమండలి మరో నాలుగు మాసాలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను తేవడంతో రైతుల ఆశలపై నీళ్లుచల్లినట్లయింది. త్వరలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడతారని చెబుతున్నందున, ఆప్పుడైనా రైతు సాయం ప్రతిపాదన ఉంటుందా, లేదంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలోనేనా అనే ప్రశ్నలు బయలుదేరాయి. అన్నీ చూసుకొని రానున్న జనవరిలో, సంక్రాంతికి కొంచెం అటూ ఇటూగా రైతు సాయం విడుదల చేస్తారన్న ఊహాగానాలూ వినిపిస్తున్నాయి.

ఉదారంగా విరాళాలివ్వండి

- కేరళకు సంఘీభావం తెలపండి
- సిపిఎం పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి

ఇండియా న్యూస్ నెట్‌వర్క్-న్యూఢిల్లీ

కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో బాధిత కుటుంబాలకు ఈ విపత్కర సమయంలో సంఘీభావం తెలియచేయడం, సహాయక చర్యలకు మద్దతు అందించడం అత్యంతావశ్యకమని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఉదారంగా విరాళం ఇవ్వడం ద్వారా సంఘీభావాన్ని తెలియచేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడడం వల్ల 250 మంది ప్రాణాలు కోల్పోయారని, 200 మంది గాయపడ్డారని తెలిపింది. సహాయక చర్యలను వేగవంతం చేయడానికి, బాధిత కుటుంబాలకు పునరావాస, సహాయక చర్యలు చేపట్టడం కోసం కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తోందని పొలిట్‌బ్యూరో తెలిపింది. ఈ సహాయక చర్యల్లో సిపిఎం, ప్రజాసంఘాలు కూడా విరివిగా పాల్గొంటున్నాయని తెలిపింది.

బాధితులను ఆదుకునేందుకు వయనాడ్ రిలీఫ్ ఫండ్ పేరుతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సిపిఎం కేంద్ర కమిటీ కార్యాలయం (ఎ.కె. గోపాలన్ భవన్, 27-29 భాయి వీర్ సింగ్ మార్గ్, న్యూఢిల్లీ-110 001) వద్ద ఈ నిధి ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ నిధికి ఉదారంగా విరాళాలు ఇవ్వాలని సిపిఎం కేంద్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

ఈ నిధికి సంబంధించిన బ్యాంక్ ఖాతా వివరాలను త్వరలో తెలియజేస్తామని పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో పేర్కొంది.



చూరల్‌మలలో సహాయక చర్యలు కొనసాగిస్తున్న భద్రతా బలగాలు, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

వయనాడ్ మృతులు 250

ముమ్మరంగా సహాయక చర్యలు

తిరువనంతపురం : కేరళలోని వయనాడ్ జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో మృతుల సంఖ్య బుధవారానికి 250కు చేరుకుంది. దాదాపు 200 మంది గాయపడ్డారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. సుమారు 5,500 మందిని సహాయక బృందాలు రక్షించాయి. మంగళవారం సంభవించిన ఈ విపత్తుకు సంబంధించి బుధవారం కూడా సహాయక చర్యలు కొనసాగాయి. ప్రమాదకర ప్రాంతాల్లో ఉన్న వారిని రక్షించడంతో పాటు, శిథిలాల కింద పడి ఉన్న మృతదేహాలను వెలికితీసేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా కృషి చేస్తున్నాయి. సజీవంగా బయటపడిన వారిని పునరావాస కేంద్రాలకు, క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించేందుకు హెలికాప్టర్లను వినియోగిస్తున్నారు. జిల్లాలో 45 సహాయ శిబిరాలను ఏర్పాటు చేసి 3,069 మందికి వసతి కల్పించారు. మిగిలిన ప్రజలు కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని వయనాడ్ కలెక్టర్ డి ఆర్ మేఘశ్రీ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాలు, గతంలో ఇలాంటి సంఘటనలు జరిగిన ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని కోరారు. బుధవారం వరకూ జిల్లా ఆసుపత్రికి 96 మృతదేహాలను తరలించారు. ఇందులో 49 మృతదేహాలకు పోస్ట్‌మార్టం పూర్తయిందని, 75 మృతదేహాలను బంధువులకు అప్పగించినట్లు జిల్లా అధికారులు తెలిపారు. వయనాడ్ ప్రమాదం నేపథ్యంలో కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి తమిళనాడు కాంగ్రెస్ రూ కోటి విరాళాన్ని ప్రకటించింది. తమిళనాడు పిసిసి అధ్యక్షులు కె సెల్వపెరుంతగై తెలిపారు. అలాగే ఈ దుర్ఘటనపై దలైలామా విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు లేఖ రాసారు. అదేవిధంగా మృతుల కుటుంబాలకు చైనా సంతాపం తెలిపింది. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. ఈ విషయాన్ని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ బీజింగ్‌లో ఒక మీడియా సమావేశంలో తెలిపారు. కాగా, వయనాడ్‌లో గురువారం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నాయకులు ప్రియాంక గాంధీ వాద్రా సందర్శించనున్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించిన విజయన్

భారీ వర్షాల కారణంగా వయనాడ్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉందని జూలై 23నే కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని

మిగతా 2లో



నవీముంబయిలో పర్యటిస్తున్న మంత్రి నారాయణ, అధికారులు

అమరావతి ఆర్థికాభివృద్ధి కోసం సిడ్కో ప్లాన్ పరిశీలన

- నవీ ముంబయిలో మంత్రి నారాయణ బృందం పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని నగరంలో ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా నవీ ముంబయి పరిధిలోని సిటీ అండ్ ఇండ్రస్టియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సిడ్కో) ప్లానును పరిశీలిస్తోంది. మహారాష్ట్ర ప్రభుత్వ సంస్థగా ఉన్న సిడ్కో ఇచ్చే ప్లాను ప్రకారం నవీ ముంబయి పరిధిలో పరిశ్రమలు, పట్టణాభివృద్ధి వంటి పనులు జరుగుతున్నాయి. అక్కడ మెరుగైన ఫలితాలు రావడంతో వాటిని అమరావతిలో అమలు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. నగర విస్తరణ, పరిశ్రమలు ఏలా ఏర్పాటు చేశారు. రోడ్ల ప్లాను ఎలా ఉంది. పరిశ్రమల వల్ల నగరానికి ఇబ్బంది రాకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే అంశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. దీనిలో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ, సిఆర్‌డిఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఇతర ఉన్నతాధికారులు బుధవారం నవీ ముంబయి పరిధిలోని పారిశ్రామిక

మిగతా 7లో

యుపిఎస్‌సి చైర్‌పర్సన్‌గా ప్రీతి సుదాన్




న్యూఢిల్లీ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) చైర్ పర్సన్‌గా ప్రీతీ సుదాన్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఈ కమిషన్‌లో ఒక మెంబర్‌గా ఉన్న సుదాన్ గతంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. యుపిఎస్‌సి చైర్మన్ పదవికి కొన్ని రోజుల క్రితం వ్యక్తిగత కారణాలతో మనోజ్ సోని రాజీనామా చేశారు. దీంతో చైర్‌పర్సన్‌గా ప్రతీ సుదాన్ బాధ్యతలు స్వీకరిస్తున్నారు. ఈ పదవిలో సుదాన్ 2025 ఏప్రిల్ వరకూ కొనసాగుతారు. తన పదవీ కాలం ఇంకా ఐదేళ్లు ఉండగానే మనోజ్ సోని రాజీనామా చేయడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. యుపిఎస్‌సి పరీక్షల్లో కొంతమంది అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగాలను దక్కించుకున్నారనే వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో సోని రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

5 పాలసీలు 4 క్లస్టర్లు

- పారిశ్రామికాభివృద్ధి.. ప్రభుత్వ ప్రతిపాదన సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధే లక్ష్యంగా ఐదు కొత్త పాలసీలను రూపొందించడంతో పాటు, నాలుగు క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం పరిశ్రమలశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానంతో పాటు, ఎంఎస్‌ఎంఇ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, ఐటి అండ్ క్లౌడ్, టెక్స్‌టైల్ రంగాల్లో కొత్త పాలసీలు తీసుకురానున్నట్లు తెలిపారు. అలాగే కొత్తగా నాలుగు పారిశ్రామిక క్లస్టర్ల ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర అనుమతులు పొందాలని ఆదేశించారు. కుప్పం, మూలపేట, చిలమత్తూరు, దొనకొండ లేదా పామూరులో కొత్త క్లస్టర్లు ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ఈ క్లస్టర్లలో ఎలక్ట్రానిక్స్, ఫార్మా ఫుడ్ ప్రాసెసింగ్, హార్డ్‌వేర్ సంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న 15 రోజుల్లో దీనికి సంబంధించి ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైతే దీనిపై స్టేక్ హోల్డర్లతో సంప్రదింపులు జరపాలని సూచించారు. 2019కు ముందు ప్రభుత్వంతో పారిశ్రామికవేత్తలు చేసుకున్న ఒప్పందాలపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. వారితో తిరిగి సంప్రదింపులు చేయాలని సూచించారు. కృష్ణపట్నం, నక్కపల్లి, ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్స్‌లలో పనులు జరుగుతున్న తీరును సమీక్షించారు. నక్కపల్లిలో రూ.11,542 కోట్లతో ఏర్పాటు చేసే బల్క్ డ్రగ్‌పార్కు, రూ.60 వేల కోట్లతో ఏర్పాటు చేసే ఎన్‌టిపిసి గ్రీన్ హైడ్రోజన్ హబ్, ప్రస్తుతం చర్చలు జరుపుతున్న బిపిసిఎల్ ప్రాజెక్టు స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రాన్ని పెట్టుబడుల ఆకర్షణకు అనువైన ప్రాంతంగా మార్చాలని అధికారులను ఆదేశించారు. తెలుగుదేశం ప్రభుత్వం హయంలో 16 లక్షల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకోగా అనంతరం వచ్చిన ప్రభుత్వం రాజకీయ వేధింపులకు గురిచేయడంలో చాలా కంపెనీలు ఇక్కడ నుండి వెళ్లిపోయాయని పేర్కొన్నారు. కొత్త కంపెనీలు కూడా రాలేదని తెలిపారు. వారికి రాష్ట్రంపై నమ్మకం కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వివిధ ప్రాంతాల్లో పారిశ్రామిక అవసరాల కోసం తీసుకున్న 1382 ఎకరాల్లో ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చారని వివరించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పారిశ్రామివేత్తలకు 60 శాతం ప్రోత్సాహకాలు చెల్లిస్తే వైసిపి ప్రభుత్వ హయాంలో 34 శాతమే చెల్లించారని చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లా మల్లవల్లిలోని పారిశ్రామిక వాడలో భూముల రేట్లు తగ్గించి పెట్టుబడులకు ఊతం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.. సమీక్ష అనంతరం పారిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్ మీడియాతో మాట్లాడి వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యువరాజ్ కూడా ఉన్నారు.

ఓటాన్ అకౌంట్‌కు గెజిట్ జారీ


- నవంబరు 30 వరకూ అమల్లో

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అత్యవసర పరిస్థితుల్లో ఓటాన్ అకౌంట్‌ను రెండోసారి పొడిగించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రూపొందించిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదముద్ర వేయడంతో ప్రభుత్వం బుధవారం గెజిట్ విడుదల చేసింది. ఎన్నికల నేపథ్యంలో గత ప్రభుత్వం చేసిన నిర్ణయం జులై 31తో ముగియనున్న నేపథ్యంలో ప్రభుత్వం చేసే ఖర్చుల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు గెజిట్లో పేర్కొన్నారు. ఇటీవల కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఆర్థికశాఖ, ఇతర శాఖలతో సమన్వయ పరుచుకుంటూ, ఆదాయ ఆర్జన శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాల్సి ఉన్నందున బడ్జెట్ ప్రవేశపెట్టడానికి కొంత సమయం అవసరమౌతోందని పేర్కొన్నారు. గెజి తొలి ఓటాన్ అకౌంట్ 1,07,545 కోట్లకు ఆమోదం తెలపగా, దానికి ఈ నాలుగు నెలలకుగాను రూ.22,427 కోట్లను కలిపి మొత్తంగా రూ.1,29,972 కోట్లకు ఆమోదం తెలిపారు.

హమాస్ అగ్రనేత హనియే హత్య

- టెహ్రాన్ నివాసంపై క్షిపణి దాడి...
- ప్రతీకారం తీర్చుకుంటామన్న హమాస్
- ఇరాన్, రష్యా తదితర దేశాల ఖండన



ఇస్మాయిల్ హనియే

టెహ్రాన్: స్వతంత్ర పాలస్తీనా కోసం పోరాడుతున్న హమాస్ రాజకీయ విభాగం అధిపతి ఇస్మాయిల్ హనియే (62) హత్యకు గురయ్యారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఆయన ఉంటున్న భవనంపై బుధవారం తెల్లవారు జామున జరిగిన క్షిపణి దాడిలో హనియేతో బాటు ఆయన అంగరక్షకుల్లో ఒకరు చనిపోయారు. సాధారణంగా ఖతార్‌లో నివసించే హనియే ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇరాన్ వచ్చారు. ఇది ఇజ్రాయిల్ పనేనని హమాస్ ఆరోపించింది. యూదుల రాజ్య స్థాపన కోరుకుంటున్న జియోనిస్టుల ద్రోహపూరిత దాడి, పిరికి పంద చర్య అని హమాస్ వ్యాఖ్యానించింది. ఇందుకు ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. హనియే ముగ్గురు కుమారులు ఏప్రిల్‌లో గాజాలో ఇజ్రాయిల్ జరిపిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. 2006లో పాలస్తీనా అథారిటీ ప్రభుత్వంలో కొంత కాలం పాటు హమాస్ నేత హత్యను ఇరాన్, రష్యా తదితర దేశాలు తీవ్రంగా ఖండించాయి. హనియే హత్యతో తమకు ఎలాంటి ప్రమేయం ఉందనడాన్ని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ తోసిపుచ్చారు. ఇజ్రాయిల్ దీనిపై అధికారికంగా ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. ఇటువంటి చర్యలు పశ్చిమాసియా ప్రాంతంలో ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతలను మరింత పెంచుతాయని క్రెమ్లిన్ ప్రతినిధి డిమిట్రో పెస్కోవ్ అన్నారు.

'కనీస' బాదుడు రూ.2,331 కోట్లు

- కనీస నిల్వలు లేని ఖాతాలపై వసూళ్లు

న్యూఢిల్లీ : కనీస నిల్వలు పాటించని ఖాతాదారుల పై బ్యాంక్‌లు జరిమానా పేరుతో భారీగా వసూళ్లు చేశాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మినహా 11 ప్రభుత్వ రంగ బ్యాంకులు 2023-24 ఆర్థిక సంవత్సరంలో పొదుపు ఖాతాల్లో కనీస నిల్వను నిర్వహించడంలో విఫలమైనందుకు ఖాతాదారుల నుండి రూ.2,331 కోట్లు వసూలు చేశాయి. 2022-23లోని రూ.1,855.43 కోట్లతో పోల్చితే.. ఈ ఛార్జీల వసూళ్లలో 25.63 శాతం పెరిగింది. ఈ బ్యాంకులు గత మూడేళ్లలో కనీస నిల్వను నిర్వహించనందున ఖాతాదారుల నుండి రూ.5,614 కోట్లు వసూలు చేశాయి. ఎస్‌బిఐ మాత్రం 2019-20 నుంచి కనీస బ్యాలెన్స్ నిర్వహించని ఖాతాదారులపై జరిమానా విధించడాన్ని నిలిపివేసింది. 2022-23లో పిఎన్‌బి గరిష్టంగా రూ.633.4 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.386.51 కోట్లు, ఇండియన్ బ్యాంక్ రూ.369.16 కోట్లు చొప్పున వసూలు చేశాయి. ప్రయివేటు రంగ బ్యాంకులు విధించే ఛార్జీలను పరిగణనలోకి తీసుకుంటే కనీస నిల్వల్లో తగ్గుదలపై జరిమానాలు ఎక్కువగా ఉంటాయి. అన్ని ప్రయివేటు బ్యాంకులు తమ ఖాతాల్లో కనీస నిల్వలు ఉంచడంలో విఫలమైతే ఖాతాదారుల నుంచి వసూలు చేస్తున్నాయి.

విశాఖ స్టీల్‌కు సొంతగనులు కేటాయించండి

- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీలుప్లాంటుకు సహాయ పడతామని ఒకవైపు చెబుతూనే నిజాయితీగా అటువంటి ప్రయత్నమేమీ చేయకపోవడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ స్టీలు ప్లాంటుకు సొంత గనులు లేకపోవడమే ప్రధాన సమస్యని పేర్కొన్నారు. దీనివల్ల ప్రతి సంవత్సరం మిగిలిన స్టీలు ప్లాంట్ల కంటే అదనంగా మూడువేల కోట్ల రూపాయలు విశాఖ ప్లాంటు ఖర్చు పెడుతోందని తెలిపారు. సొంత గనుల కోసం అక్కడ యూనియన్లు సంవత్సరాల నుండి పోరాడుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై జులై 30వ తేదీన జనసేన పార్లమెంటు సభ్యులు వి.బాలశౌరి స్టీలుశాఖ మంత్రిని ప్రశ్నించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఒడిస్సా ప్రభుత్వాన్ని విశాఖ స్టీలుకు గనులు ఇవ్వాలని కోరిన అంశంపై ఒడిస్సా నుండి ఎటువంటి సమాధానమూ రాలేదని పార్లమెంటు సాక్షిగా మంత్రి సమాధానం ఇచ్చారని పేర్కొన్నారు. ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘర్ రాష్ట్రాలను కూడా కోరినా ఇంతవరకూ ఏ ప్రభుత్వమూ స్టీలు ప్లాంటుకు సొంత గనులు కేటాయించలేదని కేంద్ర ఉక్కు, గనులశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సమాధానం ఇచ్చారని తెలిపారు. ఒడిస్సాలోనూ బిజెపి ప్రభుత్వమే అధికారంలో ఉందని, కేంద్రం తలుచుకుంటే ఒడిస్సాను ఒప్పించి విశాఖ స్టీలుకు సొంత గనులు కేటాయించడం పెద్ద సమస్య కాదని వివరించారు. స్టీలుప్లాంటుపై బిజెపికి ఏ మాత్రమూ చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే ఒడిస్సా ప్రభుత్వం గనులు కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై రాష్ట్రానికి చెందిన బిజెపి పార్లమెంటు సభ్యులు పెదవి విప్పకపోవడం అన్యాయమని తెలిపారు. ఇప్పటికైనా బిజెపి కేంద్ర ప్రభుత్వంపై టిడిపి, జనసేన పార్టీల పార్లమెంటు సభ్యులు ఒత్తిడి తీసుకువచ్చి ఒడిస్సా ప్రభుత్వం విశాఖ స్టీలు ప్లాంటుకు సొంత గనులు కేటాయించేలా చూడాలని కోరారు.

మూగజీవాలకు మందులేవీ? 2

మూగజీవాలకు మందులేవీ?

- ఏడాదిగా నిలిచిన సరఫరా
- సరైన చికిత్స అందక మృత్యువాత పడుతున్న పశువులు


పశువులకు వైద్యం చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా ఏడాది కాలంగా మూగజీవాలకు మందుల సరఫరా నిలిచిపోయింది. దీంతో, పశువుల ఆస్పత్రుల్లో మందుల నిల్వలు నిండుకున్నాయి. యాంటిబయాటిక్స్ మినహా ఇతర చికిత్సలకు అవసరమైన మందులు అందుబాటులోలేవు. బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు మందులు కొనుక్కోవాల్సి వస్తుండడంతో పెంపకందార్లకు పశువుల పెంపకం భారంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా 40.60 లక్షల ఆవులు, 60.22 లక్షల గేదెలు, 1.76 కోట్ల గొర్రెలు, 50.52 లక్షల మేకలు ఉన్నాయి. వీటికి అవసర చికిత్స, వైద్య సేవల కోసం ప్రభుత్వం ఏటా పశువుల ఆస్పత్రులకు మందులను సరఫరా చేసేది. 2023-24కు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 451 వెటర్నరీ ఆస్పత్రులకు సుమారు రూ.20 కోట్ల విలువైన మందులను అందించింది. పాడి రైతుల అవసరాలు, పశువులకు సంక్రమించే వ్యాధులను బట్టి మొత్తం 108 రకాల మందులను పంపింది. మందులు ఏటా రెండు పర్యాయాలు రావాల్సి ఉండగా, గతేడాది ఆగస్టు రెండో తేదీన సరఫరా చేసిన తర్వాత ఇప్పటివరకు ఆస్పత్రులకు మందులు రాలేదు. గతేడాది వర్షాకాలంలో పెద్ద పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకింది. గొర్రెల్లో నీలి కాలుక, గిరక వాపు వ్యాధులు వచ్చాయి. మేకలను జలుబు, దగ్గు వ్యాధులు సంభవిస్తున్నాయి. బ్యాక్టీరియా వల్లే ఇవి ఎక్కువగా వస్తాయని వైద్యులు చెప్తున్నారు. మందులు, చికిత్స సరిగా అందకపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్న ఘటనలూ నమోదవుతున్నాయి.

బహిరంగ మార్కెట్లో అధిక ధరకు కొనుగోలు

లివర్ టానిక్, కాల్షియం సస్పెన్షన్, విటమిన్ ఎ, మిల్క్ ప్లస్ బోలస్, పి డిపోట్, గ్నానరిచ్, ట్రిబివెట్ వంటి మందులకు అధిక డిమాండ్ ఉంటుంది. ఆస్పత్రుల్లో మందులు లేకపోవడంతో పాడి రైతులు బయట మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవడంతో బహిరంగ మార్కెట్లో వాటి ధరలను డీలర్లు పెంచేశారు. దీంతో, పాడి రైతులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది.

నిలిచిన సంచార పశు వైద్య సేవలు

పశువుల ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలందించేందుకు ఉద్దేశించిన మొబైల్ అంబులేటరీ క్లినిక్ (సంచార పశుఆస్పత్రుల) సేవలూ నిలిచిపోయాయి. సంచార పశు వైద్య సేవలు పొందడానికి గత ప్రభుత్వం 1962 టోల్ ఫ్రీ నంబరుతో క్లినిక్‌లను అందుబాటులోకి తెచ్చింది.

మొబైల్ వాహనంలోనే ల్యాబ్, అవసరమైన పరీక్షలకు ఏర్పాట్లు ఉండేవి. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు ఎక్కువగా సోకే అవకాశం ఉన్నందున ఆస్పత్రులకు మందులను వెంటనే సరఫరా చేయాలని, సంచార పశు ఆస్పత్రి సేవలను కొనసాగించాలని పెంపకందార్లు కోరుతున్నారు.

రెండు పశువులు చనిపోయాయి



ఆస్పత్రిలో మందులు లేవని చీటి రాసి బయట కొనుక్కోమని చెప్పారు. ఆస్పత్రిలో కేవలం ఎదకు సంబంధించి మందులు మాత్రమే ఇస్తున్నారు. సరియైన మందులు లేకపోవడంతో ఈ మధ్య రెండు ఆవులు చనిపోయాయి.

- కొంచాడ అప్పలనాయుడు, రాపాక (శ్రీకాకుళం జిల్లా)

ఇన్ఫెక్షన్ మందుల్లేవు



నేను పెంచుతున్న మూడు ఆవులకు ఇన్ఫెక్షన్ వచ్చింది. లివర్ టానిక్ వాడాలని డాక్టర్లు చెప్తున్నారు. ఆస్పత్రుల్లో లేకపోవడంతో బయట కొన్నాను.

- ముల్లు ఆనందరావు, పొందూరు (శ్రీకాకుళం జిల్లా)

భారీగా డిఎస్‌పిల బదిలీ

- 96 మందికి స్థానభ్రంశం
- 49 మంది పోస్టింగుకు దూరం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భారీగా డిఎస్‌పిల బదిలీ జరిగింది. రాష్ట్ర పోలీస్‌శాఖలో కొత్త ప్రభుత్వం వచ్చాక రెండు పర్యాయాలు ఐపిఎస్‌ల బదిలీలను చేపట్టిన కొత్త ప్రభుత్వం.. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి 96 మంది డిఎస్‌పిలకు స్థానభ్రంశం కల్పిస్తూ డిజిపి ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పాటై దాదాపు రెండు నెలలు కావస్తున్నా.. పోలీస్‌శాఖలో డిఎస్‌పిలు వైసిపి ప్రభుత్వం నియమించిన అధికారులే వుండటం వల్ల తమ మాట చెల్లుబాటు కావడం లేదని టిడిపి నేతల ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో ఒకేసారి 96 మందిని బదిలీ చేస్తూ అందులో 57 మందికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా రాష్ట్ర డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం చర్చనీయాంశమైంది. 39 మంది డిఎస్‌పిలను వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు.

అందుబాటులో జనసేన ఎంపి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మంగళగిరిలోని జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు ఆగస్టు ఒకటి నుంచి అందుబాటులో ఉండే ఎంపి, ఎమ్మెల్యేల జాబితాను ఆ పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ బుధవారం ప్రకటించారు. ఎమ్మెల్యేలు ప్రతినెలా రెండు రోజులపాటు పార్టీ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎంపిలకు పలు సూచనలు చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

కెజిబివిలో ఇంటర్ బాలిక ప్రసవం

- మృతి చెందిన శిశువు

ప్రజాశక్తి-కొత్తపట్నం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మోటుమాల కెజిబివిలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలిక ప్రసవించింది. శిశువు మరణించింది. పోలీసుల వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం, భద్రాచలంకు చెందిన ఓ మహిళ తన కుటుంబసభ్యులతో కలిసి ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెం వద్ద నివాసం ఉంటున్నారు. ఆమె కుమార్తె కొత్తపట్నం మండలం మోటుమాల కెజిబివిలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. బుధవారం ఉదయం 10.30 సమయంలో బాత్రూంకు వెళ్లిన విద్యార్థిని ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో సిబ్బందికి అనుమానం వచ్చి ప్రిన్సిపల్‌కు సమాచారం ఇచ్చారు. బాత్రూంలో మగశిశువు మృతి చెంది ఉండడాన్ని గమనించి ప్రిన్సిపల్ వెంటనే సమగ్ర శిక్ష జిసిడిఒకు సమాచారమిచ్చారు. ఆమె జిల్లా విద్యాశాఖ అధికారికి తెలపడంతో సదరు డిఇఒ జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించారు. స్పందించిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా... జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, ఐసిడిఎస్ పిడిలను నివేదిక అందించాలని ఆదేశించారు. బాలికను కొత్తపట్నం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జిజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న బాలికను పోలీసులు ప్రాథమికంగా విచారించారు. చీమకుర్తి మండలం మర్రిచెట్టుపాలెం వద్ద నివసిస్తున్న ముగ్గురు వ్యక్తులు అత్యాచారం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. బాల్ బ్యాడ్మింటన్, డిస్క్ త్రోలో విద్యార్థిని రాష్ట్రస్థాయి అవార్డులు పొందినట్లు సమాచారం.

వయనాడ్ మృతులు 250

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం ఖండించారు. వయనాడ్ జిల్లాకు భారత వాతావరణ శాఖ (ఐఎండి) కేవలం ఆరెంజ్ అలర్ట్ మాత్రమే జారీ చేసిందని విజయన్ తెలిపారు. అయితే, జిల్లాలో 24 గంటల్లో 500 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైందని, ఇది ఐఎండి అంచనా వేసిన దానికంటే చాలా అధికమని ముఖ్యమంత్రి తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడిన తర్వాత మాత్రమే జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేశారని విజయన్ తిరువనంతపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఇది "బ్లేమ్ గేమ్"కు తగిన సమయం కాదని, షా వ్యాఖ్యలను తాను వ్యతిరేక ధోరణిలో తీసుకోవడం లేదని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ప్రమాదంలో మరణించిన కన్నడ కుటుంబాలకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య రూ. 5 లక్షల పరిహారం ప్రకటించారు. ఈ విపత్తులో కనీసం ఆరుగురు కన్నడిగులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు



- వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గురువారం నుంచి తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు వెల్లడించారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయని చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టరును సచివాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లులు, కుటుంబ సభ్యులతో కూడిన ప్రాంతాలు, కమ్యూనిటీ స్థాయిలో రాష్ట్రంలో తల్లిపాల వారోత్సవాలు జరుపుకుంటామని చెప్పారు. పుట్టిన గంటలోపు తల్లిపాలను ఆ బిడ్డకు అందించాలని చెప్పారు. పిల్లలకు రెండేళ్లు వచ్చే వరకు తల్లిపాలను కొనసాగించడంతోపాటు సురక్షితమైన పోషకాహారాన్ని పరిచయం చేయడంపై అవగాహన కల్పించడానికి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి మంజుల, డి హోస్‌మని, కమిషనర్ సి హరికిరణ్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ అట్టాడ సిరి, ఎపిఎంఎస్ఐడిసి ఎమ్‌డి జి లక్ష్మీశా, డిఎంఇ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

టిబి రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దాలి : హరికిరణ్

టిబి రహిత రాష్ట్రంగా రాష్ట్రాన్ని 2025 నాటికి తీర్చి దిద్దేందుకు అన్ని విధాలా కృషి చేయాలని అధికారులను వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు సి హరికిరణ్ సూచించారు. పెద్దలకు టిబిబిసిజి వేయడంలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ టీకాలు వేసే సమయంలో ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ గుర్తింపు సంఖ్యను కూడా ఎఎన్ఎంలు రూపొందించాలని చెప్పారు. మంగళగిరిలోని వైద్యారోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో జాతీయ టిబి నిర్మూలన కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. 50 లక్షల మందికి టీకాలు వేయాలనే లక్ష్యాన్ని చేరుకునేందుకు మరింతగా కృషి చేయాలని, ఇప్పటి వరకు 17.78 లక్షల మందికే అయ్యాయని వివరించారు. టిబి రోగులకు అదనపు పోషాకాహారాన్ని పంపిణీ లచేసేందుకు పలు పారిశ్రామిక వేత్తల్ని సంప్రదించాలని తెలిపారు. సబ్ సెంటర్లలో కూడా టిబి శాంపిళ్లను సేకరించాలని తెలిపారు. టిబి పరీక్షలు కోసం ఉన్న ల్యాబ్‌లతో పాటు ఇంకా అవసరమైన ల్యాబ్‌ల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

ప్రక్షాళన దిశగా వాలంటీర్ వ్యవస్థ

- సమగ్ర ప్రణాళికలు తయారీకి సిఎం ఆదేశం
- వివరాలు సేకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ వాలంటీర్ల వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా ప్రభుత్వం కసరత్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా వారి సేవలను ఇంకొంచెం మెరుగ్గా ఎలా వినియోగించుకోవాలనే అంశంపై ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు తయారు చేయాలని సిఎం చంద్రబాబునాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా వాలంటీర్లకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో కెపాసిటీ బిల్డప్ చేయాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. వాలంటీర్ల విద్యార్హతలు, వయస్సులను సేకరిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ లెక్కల్లో రాజీనామ చేసిన వాలంటీర్లు 1.09లక్షలకు పైగా ఉండగా, విధుల్లో ఉండే వాలంటీర్లు 1.53లక్షల మంది వరకు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. వాలంటీర్లకు పెంచిన గౌరవ వేతనం అమలు చేయాలంటే సుమారుగా రూ.1,848కోట్లు ఏడాదికి ఖర్చవుతుందని ఓ ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రభుత్వ వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు పిజి చేసిన వారు 5 శాతం, డిగ్రీ చేసిన వారు 32శాతం, డిప్లమో చేసిన వాళ్లు 2శాతం, ఇంటర్ పూర్తి చేసిన వారు 48శాతం, పదవతరగతి పాసైన వారు 13శాతం ఉన్నట్లు గుర్తించారు. వాంటీర్లను వయస్సుల వారీగా లెక్కలు తీయడంతో పాటు ఇతర ప్రాంతాలు, గ్రామాలకు వెళ్లే వారు ఎంతమంది ఉండొచ్చనే అంశంపై కూడా వాలంటీర్ల అభిప్రాయాలను అధికారయంత్రాంగం సేకరించనున్నట్లు సమాచారం.

'స్కిల్' కేసులో ప్రభుత్వానికి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

స్కిల్ డెవలప్‌మెంటు కేసు గురించి మీడియా సమావేశంలో గత ప్రభుత్వంలో అదనపు ఎజిగా చేసిన పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, అప్పటి సిఐడి చీఫ్ సంజయ్ చెప్పడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌లో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శితోపాటు పొన్నవోలు, సంజయ్‌కు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది. పొన్నవోలు, సంజయ్ మీడియా సమావేశాల్లో స్కిల్ కేసు వివరాలు వెల్లడించకుండా ఉత్తర్వులు ఇవ్వాలంటూ ఎపి యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టిఐ క్యాంపెయిన్ అధ్యక్షులు ఎన్ సత్యనారాయణ పిల్‌పై విచారణను సెప్టెంబరు 25కు వాయిదా వేసింది.

రమణ దీక్షితుల పిటిషన్‌పై విచారణ వాయిదా

తిరుమల శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి ఎవి రమణ దీక్షితులను తప్పిస్తూ టిటిడి ఇఒ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను ఆయన సవాల్ చేసిన కేసులో ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, టిటిడి ఇఒలను ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తూ జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించారని పిటిషనర్ వాదించారు.

అభ్యర్థులందరినీ ప్రతివాదులుగా చేయండి : హైకోర్టు

పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నిక చెల్లదంటూ దాఖలైన ఎలక్షన్ పిటిషన్‌లో ఆయనపై ఓడిపోయిన అభ్యర్థులందరినీ ప్రతివాదులుగా చేయాలని పిటిషనర్ రామచంద్ర యాదవ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను ప్రతివాదులుగా చేర్చకుండా పిటిషన్‌ను విచారణ చేయడం కష్టమని జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దిరెడ్డి సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో భార్య పేరు మీద ఉన్న 142 ఆస్తుల వివరాలు వెల్లడించలేదని, ఆయన ఎన్నికను రద్దు చేయాలని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఆగస్టు ఐదుకు వాయిదా పడింది.

మైనింగ్ అక్రమాలపై నిగ్గు తేల్చాల్సిందే

- రీచ్‌ల నుండే ప్రజలు ఇసుక తీసుకెళ్లేలా చర్యలు
- ప్రైవేట్ ఏజెన్సీల నుంచి బకాయి రూ.1,025 కోట్లను రాబట్టాలి
- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

2014-19 మధ్య మైనింగ్‌లో 24 శాతం వున్న వృద్ధి, వైసిపి ప్రభుత్వ హయాంలో కేవలం 7 శాతం వుందని, పెద్ద యెత్తున అక్రమాలు చోటుచేసుకోవడం వల్లే వృద్ధిరేటు గణనీయంగా తగ్గిపోయిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మైనింగ్‌లో అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిగ్గుతేల్చాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో మైనింగ్‌శాఖపై సిఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గత ప్రభుత్వ హయాంలో మైనింగ్ విధానాన్ని, వృద్ధి రేటును వివరించారు. అలాగే కొత్త ప్రభుత్వం వచ్చాక ఇసుక ధరల్లో వచ్చిన మార్పులపైనా ముఖ్యమంత్రికి వివరించారు. ఉచిత ఇసుక విధానం అమలు, వివిధ ప్రాంతాల్లో ఇసుక లభ్యత, ధరలపై వివరించారు. రవాణా ఖర్చుల కారణంగా కొన్నిచోట్ల అనుకున్నంత తక్కువ మొత్తానికి ఇసుక దొరకని అంశంపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. తవ్వకం, రవాణా ఖర్చులు భారం కాకుండా కొత్తగా ఏయే విధానాలు అవలంభించే అవకాశం ఉందన్న అంశంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రీచ్‌ల నుంచి నేరుగా అవసరం వున్నవారు ఇసుక తీసుకెళ్లగలిగితే భారం ఉండబోదన్నారు. తమ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానానికి కట్టుబడి ఉందని, వినియోగదారులకు భారం కాకుండా చూడాలని అన్నారు. మైనింగ్‌లో జరిగిన అక్రమాలతో ప్రభుత్వానికి రూ.9,750 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వానికి ప్రైవేటు ఏజెన్సీల నుంచి రూ.1,025 కోట్లు రావాల్సి వుందని, ఆ మొత్తాన్ని రాబట్టాలన్నారు. అలాగే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జరిగిన సిలికాశాండ్, క్వార్ట్జ్ అక్రమాలపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, మైనింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తదితరులు పాల్గొన్నారు.

మరో కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)


నాగరాజు (ఫైల్)

అప్పుల బాధతో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలో మరో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. చిన్నకోండ్రు పాడుకు చెందిన పుట్ట నాగరాజు (40) గతేడాది ఆరు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని మూడెకరాల్లో మిర్చి, రెండెకరాల్లో పత్తి, ఎకరంలో కూరగాయలు సాగు చేశారు. పెట్టుబడి కోసం తన ఇంటిని తనఖా పెట్టి రూ.13 లక్షల అప్పు చేశారు. పంటలు సరిగా పండలేదు. అప్పులకు వడ్డీల భారం అధికమైంది. సాగుపై మమకారం వదులుకోలేక ఈ ఏడాది రెండు ఎకరాలను కౌలుకు తీసుకున్నారు. సాగు చేసేందుకు సిద్ధమై పొలం వద్దకు వెళ్లారు. రుణదాతల ఒత్తిడితో మానసిన వేదనకు గురై పొలంలోనే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అప్పుల బాధతతోనే మూడు రోజుల కిందట ప్రత్తిపాడు మండలం తూర్పుపాలేనికి చెందిన కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నారు.

అమరావతిలో ఎన్‌సిసి అకాడమి ఏర్పాటు

- డైరెక్టర్ జనరల్ మాధవరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అమరావతిలో ఎన్‌సిసి అకాడమి ఏర్పాటుకు యోచిస్తున్నామని ఎన్‌సిసి రాష్ట్ర డైరెక్టర్ జనరల్ వి.మాధుసూధనరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ భూమి కేటాయిస్తే అక్కడ అకాడమిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గుంటూరులోని రాష్ట్ర ఎన్‌సిసి కేంద్ర కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి మీడియాతో మాట్లాడారు. గతంలో రెండు రాష్ట్రాలకు కలిపి ఒక్కటే అకాడమి ఉండేదని, ఇప్పుడు వేర్వేరు అకాడమీల ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో లక్షా 40 వేల మంది విద్యార్థులు ఎన్‌సిసిలో చేరి పలు సేవలందిస్తున్నారని, వీరికి ఆర్మీ, బిఎస్ఎఫ్ వంటి పారామిలటరీ ఉద్యోగాలకు కూడా ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు అకాడమి అవసరమన్నారు. త్వరలో సిఎం చంద్రబాబును కలిసి ఎన్‌సిసి విశిష్టతను తెలియచేస్తామని, తమ విద్యార్థులు అందిస్తున్న సేవలను వివరిస్తామని తెలిపారు. ఇటీవల నర్సరావుపేటలో ఎన్‌సిసి విద్యార్థులు ర్యాగింగ్ పాల్పడినట్టు వచ్చిన ఆరోపణలపై పోలీసులు విచారణ చేస్తున్నారని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేరం రుజువు అయితే వారిని శిక్షణ నుంచి తప్పించి సర్టిఫికెట్లు రద్దు చేస్తామని తెలిపారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలి

- స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను వెంటనే సెయిల్‌లో విలీనం చేసి పరిరక్షించాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1266వ రోజుకు చేరాయి. దీక్షల్లో యూనియన్ నాయకులు, కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు మూడు సంవత్సరాల ట్యాక్స్ హాలీడే ప్రకటించాలని, లెటర్ ఆఫ్ కంఫర్ట్ ఇవ్వాలని, ఐరన్ ఓర్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే వేగన్లు కేటాయించాలని, రూ.3100 కోట్ల ప్రిఫరెన్షియల్ షేర్లు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి, పోలవరం ప్రాజెక్టులతోపాటు మిగతా ప్రాజెక్టుల్లోనూ విశాఖ ఉక్కునే ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. దీక్షల్లో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి, నాయకులు ఎన్.రామారావు, కృష్ణారావు, టివికె.రాజు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయిన సిపిఐ నేతలు నారాయణ, రామకృష్ణ తదితరులు

ముఖ్యమంత్రితో సిపిఐ నేతల భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కుంభకోణాలపై సమగ్ర విచారణ చేయించాలని ప్రభుత్వానికి సిపిఐ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నేతృత్వంలోని బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సచివాలయంలో బుధవారం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా ఒక్క కడప జిల్లాలోనే వేలాది ఎకరాలు కబ్జాకు గురయ్యాయని సిఎం దృష్టికి తీసుకొచ్చారు. మదనపల్లి సబ్‌కలెక్టరు కార్యాలయంలో ఫైళ్ల దహనంపై విచారణ చేయాలన్నారు. మూడు రాజధానుల పేరుతో విశాఖపట్నం, విజయనగరం, ప్రకాశం జిల్లాల్లోనూ వేలాది ఎకరాలు అన్యాక్రాంతం చేశారని వివరించారు. పేద, సామాన్య తరగతుల ప్రజలను బెదిరించి గత పాలకులు భూములు కాజేశారని ఫిర్యాదు చేశారు. భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని, భూ కుంభకోణానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు, విద్యుత్తు, ఆర్‌టిసి ఛార్జీల భారాలు, విభజన హామీల అమలు వంటి అంశాలపై సిపిఐ నాయకులు జరిపిన పోరాటాల సందర్భంగా గత ప్రభుత్వం కేసులు బనాయించిందని, వాటిని ఎత్తివేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టును సాధ్యమైనంత వరకు త్వరగా పూర్తి చేయాలని, నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పోలవరం మొదటి దశ వరకు మాత్రమే పరిమితం చేయాలనే నిర్ణయాన్ని గత ప్రభుత్వం సమర్థించడం విచారకరమని, 45.72 మీటర్ల ఎత్తులోనే నిర్మాణం జరగాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా చూడాలని కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో సిపిఐ నేతలు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ, జల్లి విల్సన్, జెవిఎస్ఎన్ మూర్తి, ఓబులేశుఉన్నారు.

టిడిపి 'గ్రీవెన్స్' మంత్రుల జాబితా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన మంత్రుల జాబితా ఈ నెల 14వ తేదీ వరకు విడుదలైంది. ప్రజలు నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించేందుకు మంత్రులతోపాటు పార్టీ సీనియర్ నేతల జాబితాను టిడిపి కార్యాలయం బుధవారం విడుదల చేసింది. ఈ నెల మొదటి రెండు శనివారాలు 3, 10 తేదీల్లో టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌తో కలిసి పార్టీ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఆగస్టు ఒకటిన ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గ్రీవెన్స్ నిర్వహిస్తారు.

తేదీ	మంత్రి	పార్టీ నేత
ఆగస్టు 2	గొట్టిపాటి రవికుమార్	పల్లా శ్రీనివాస్ (రాష్ట్ర అధ్యక్షులు)
ఆగస్టు 5	కె అచ్చెన్నాయుడు	బొల్లినేని రామారావు (జాతీయ ఉపాధ్యక్షులు)
ఆగస్టు 6	వంగలపూడి అనిత	బీదా రవిచంద్ర (జాతీయ ప్రధాన కార్యదర్శి)
ఆగస్టు 7	పొంగూరు నారాయణ	కెఎస్ జవహర్ (జాతీయ ప్రధాన కార్యదర్శి)
ఆగస్టు 8	బిసి జనార్ధన్ రెడ్డి	కొట్ల సూర్యప్రకాష్ (జాతీయ ఉపాధ్యక్షులు)
ఆగస్టు 9	నిమ్మల రామానాయుడు	పల్లా శ్రీనివాస్ (రాష్ట్ర అధ్యక్షులు)
ఆగస్టు 12	ఆనం రామానారాయణ రెడ్డి	వర్ల రామయ్య (జాతీయ ప్రధాన కార్యదర్శి)
ఆగస్టు 13	టిజి భరత్	వైకుంఠం ప్రభాకర్ చౌదరి (జాతీయ ప్రధాన కార్యదర్శి)
ఆగస్టు 14	డోలా బాలవీరాంజనేయ స్వామి	కిషోర్ కుమార్ రెడ్డి (జాతీయ ప్రధాన కార్యదర్శి)

వినతులు స్వీకరించిన పార్థసారధి, సీతారామలక్ష్మి

టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో సమాచార, పౌరసంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు తోట సీతారామలక్ష్మి.. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి వెంటనే సంబంధిత అధికారులు, నాయకులకు మంత్రి ఫోన్లు చేశారు. భూ సమస్యలు, పింఛన్, రోడ్లు, నిరుద్యోగ, అక్రమ కేసులు సమస్యలతో బాధపడుతున్న వారు అర్జీలు ఇచ్చారు.

ఆరోగ్యశ్రీ అమలుపై స్పష్టతివ్వాలి

- మాజీ మంత్రి విడదల రజిని డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమలుపై టిడిపి ప్రభుత్వ వైఖరిని వెల్లడించాలని మాజీ మంత్రి విడదల రజిని డిమాండ్ చేశారు. గుంటూరులోని తన నివాసంలో ఆమె బుధవారం మీడియాతో మాట్లాడారు. వైసిపి హయాంలో ఏటా రూ.3 వేల కోట్లకుపైగా నిధులను ఖర్చు చేసి రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అద్భుతంగా అమలు చేశామన్నారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసి ఆయుష్మాన్ భారత్ పథకానికే ఈ సేవలను పరిమితం చేయాలని రాష్ట్ర మంత్రులు చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కేవలం 60 లక్షల మందికే పరిమితమని, ఆరోగ్యశ్రీ కోటీ 42 లక్షల కుటుంబాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించేది గరిష్టంగా రూ.300 కోట్లు కాగా.. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.3 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. చికిత్స తర్వాత కూడా మంచాన ఉండి విశ్రాంతి తీసుకునే వారికి ఆరోగ్య ఆసరా పథకం కింద మరో రూ.300 కోట్లు ఖర్చు చేశామన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతి పొందామని, గతేడాదికే ఐదు కళాశాలలు ప్రారంభించారని చెప్పారు. ఈ ఏడాది మరో ఐదు కళాశాలలకు అడ్మిషన్లు జరగాల్సి ఉండగా... ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. నిర్మాణంలో ఉన్న కళాశాలలను ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. వైద్య రంగానికి అధిక ప్రాధాన్యమిచ్చి ఎప్పటికప్పుడు ఖాళీలు భర్తీ చేసి 45 వేల మందిని నియమించామని, నాడు-నేడు కింద ఆస్పత్రుల అభివృద్ధికి రూ.17 వేల కోట్లు ఖర్చు చేశామని రజిని చెప్పారు.

తగ్గింపు ధరలతో బియ్యం, కందిపప్పు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిత్యావసర వస్తువులైన బియ్యం, కందిపప్పు, స్టీమ్డ్ బియ్యం ధరలను మరో దఫా తగ్గించాలని నిర్ణయించినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. రైతు బజార్లలో ఏర్పాటుచేసిన కౌంటర్లలో కందిపప్పు కిలో రూ.160 నుంచి రూ.150కు, బియ్యం కిలో రూ.48 నుంచి రూ.46కు, స్టీమ్డ్ బియ్యం రూ.49 నుంచి రూ.47కు తగ్గించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. రైతు బజార్లలో ఉన్న ప్రత్యేక కౌంటర్లలో గురువారం నుంచి తగ్గింపు ధరల్లో విక్రయించనున్నట్లు తెలిపారు. ఇందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్లను మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు.

యువతిపై హోంగార్డు అత్యాచారం

ప్రజాశక్తి-నెల్లిమర్ల (విజయనగరం జిల్లా)

యువతిపై హోంగార్డు అత్యాచారానికి పాల్పడిన సంఘటన విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్ల మండలానికి చెందిన ఓ యువతి తన ప్రియుడితో కలిసి సమీపంలోని కొండ వెలగాడ రియల్ ఎస్టేట్‌లో మాట్లాడుతుండగా బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న చంద్రంపేటకు చెందిన సురేష్ అటుగా వెళ్తూ వీరిని చూశాడు. తాను ఎస్ఐను అని చెప్పి యువతిని బెదిరించాడు. నెల్లిమర్లలో దిగబెడతానని చెప్పి బైక్‌పై బలవంతంగా ఎక్కించుకున్నాడు. చంపావతి నది పరివాహక ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. హోంగార్డు ఘాతుకంపై బాధితురాలు నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తామని చెప్పారు.

ముంపు నుంచి బయటపడుతున్న లంక గ్రామాలు

- గోదావరి తగ్గుముఖం
- ధవళేశ్వరం, భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికలు
- సముద్రంలోకి 10.41 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల



వరద సాయం కోసం పేర్లు నమోదు చేసుకునేందుకు ఎటపాక మండలం నందిగామ సచివాలయం ఎదుట బారులు తీరిన బాధితులు

ప్రజాశక్తి- యంత్రాంగం

గోదావరి తగ్గుముఖం పట్టడంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని లంక గ్రామాలు వరద ముంపు నుంచి బయటపడుతున్నాయి. బాధితులు పునరావాస కేంద్రాల నుంచి తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. బురదతో నిండిపోయిన ఇళ్లను శుభ్రం చేసుకునే పనిలో పడ్డారు. పలుచోట్ల కాజ్‌వేలపై నీటి ఉధృతి తగ్గడంతో రాకపోకలు సాగిస్తున్నారు. విలీన మండలాలైన విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాకల్లోని పలు గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఏలూరు జిల్లాలోని కౌండిన్యముక్తి గ్రామానికి చెందిన బాధితులు మద్రిపాడు పునరావాస కాలనీ నుంచి తమ గ్రామాలకు చేరుకున్నారు. దాచారం-కుక్కునూరు మధ్య ఉన్న 15 గ్రామాలు, ముత్యాలంపాడు-వింజరం మధ్య ఉన్న నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వశిష్ట గోదావరి శాంతించడంతో పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పుచ్చల్లంక, మద్రిమూల, అయోధ్యలంక, భీమలాపురం, కాపులపాలెం, కోడేరు పల్లిపాలెం, పెదమల్లం, అనగార్లంకలు ముంపు నుంచి తేరుకుంటున్నాయి. యలమంచిలి మండలంలోని కనకాయలంక, పెదలంక గ్రామాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పర్యటించి, గ్రామస్తులతో మాట్లాడారు. పంట నష్టంపై ఆరా తీశారు.

తూర్పు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలు క్రమంగా బయటపడుతున్నాయి. గోదావరి వరదల వల్ల 25,000 కుటుంబాలు ముంపుబారిన పడ్డాయి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 12 మండలాల్లో 47 ఆవాసాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. పి.గన్నవరం, అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లో కాజ్‌వేలు నీటి నుంచి బయటపడటంతో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన రెండు పునరావాస కేంద్రాల్లో మాత్రమే నిర్వాసితులు ఉన్నారు.

ముంపులోనే విలీన మండలాలు

అల్లూరి జిల్లాలోని విలీన మండలాలైన విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాకల్లోని పలు గ్రామాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఎటపాక పరిధిలోకి వచ్చే మురుమూరు వద్ద కూనవరం - భద్రాచలం ప్రధాన రహదారిపై వరద నీరు ఇంకా నిలిచి ఉండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. కూనవరం వెళ్లాల్సిన వాహనదారులు ప్రత్యామ్నాయంగా మురుమూరు - పోలిపాక గ్రామాల మీదుగా ప్రయాణాలు సాగిస్తున్నారు. నెల్లిపాక - వీరాయిగూడెం గ్రామాల మధ్య వరద నీరు నిలిచి ఉండడంతో వీరాయగూడెం గ్రామస్తులు నరసింగపేట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. విఆర్.పురం మండలంలోని రేఖపల్లిలో తలదాచు కుంటున్న వరద బాధితులు తమ గ్రామాలకు వెళ్లి ఇళ్లను శుభ్రం చేసుకుని తిరిగి రేఖపల్లికి చేరుకుంటున్నారు. కూనవరం మండలంలోని కూనవరం, టేకులబోరు ప్రజలు ఇంకా పునరావాస కేంద్రాల్లోనే ఉంటున్నారు. చింతూరులో వరద తగ్గడంతో అధికారులు పారిశుధ్య పనులు చేపడుతున్నారు.

వరద సాయం కోసం క్యూలైన్లు

ప్రభుత్వం ప్రకటించిన రూ.మూడు వేలు వరద సాయం కోసం ఎటపాక మండలంలో గంటల తరబడి బాధితులు క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. నందిగామ గ్రామంలో వరద సాయం పొందేందుకు రేషన్ కార్డుదారులంతా పేర్లు నమోదు చేయించుకోవాలని విఆర్ఒ తెలపడంతో గ్రామస్తులు సచివాలయం ఎదుట బారులుతీరారు. తీరా డబ్బులను ఈ రోజు పంపిణీ చేయడం లేదని చెప్పడంతో పలువురు నిరాశతో వెనుదిరిగారు.

ధవళేశ్వరం వద్ద స్థిరంగా వరద

మంగళవారం రాత్రి నుంచి భద్రాచలం వద్ద స్వల్పంగా పెరిగిన వరద బుధవారం సాయంత్రం నుంచి మళ్లీ తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. ప్రస్తుతం కాటన్ బ్యారేజీ వద్ద 12.10 అడుగుల నీటిమట్టం నమోదైంది. భద్రాచలం వద్ద 44.90 అడుగులకు చేరుకుంది. రెండు చోట్లా మొదటి ప్రమాద హెచ్చరికలు కొనసాగతున్నాయి. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 10,41,489 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు.



శిరోమణి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర నాయకులు, ప్రముఖులు

శిరోమణికి కన్నీటి వీడ్కోలు

- పాల్గొన్న సిపిఎం రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

సిపిఎం సానుభూతి పరులు, సిపిఎం రాష్ట్ర నాయకులు పరుచూరి నాగేశ్వరరావు భార్య శిరోమణి అంత్యక్రియలు బుధవారం ముగిశాయి. ముందుగా గుంటూరు జిల్లా తెనాలిలోని ఆమె స్వగృహం నుంచి అంతిమ యాత్ర సాగింది. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు ఆమె నివాసం వద్ద శిరోమణి భౌతికకాయాన్ని సందర్శించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి, సిహెచ్ బాబూరావు, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, పలువురు పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయినిగా, గృహిణిగా ఆదర్శభావాలతో ఆమె నడిచారని అన్నారు. శిరోమణి భర్త నాగేశ్వరరావు సిపిఎం రాష్ట్ర నాయకులుగా పనిచేశారని, ఆ ఉద్యమ భావాలను గౌరవిస్తూ ఆమె వెన్నంటి నడిపించారని చెప్పారు. విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐ ఉద్యమాల్లో పాల్గొనేలా కుమారుడు డాక్టర్ అజయ్‌కుమార్‌ను ప్రోత్సహించారని, ఆయనను నెల్లూరు రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలలో వైద్యవృత్తికి అంకితం చేశారని కొనియాడారు. శిరోమణి కుటుంబ సభ్యులకు పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నళినీకాంత్, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం, జన విజ్ఞానవేదిక నాయకులు డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, డాక్టర్ కాటా ప్రమీల, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి, సిఐటియు రాష్ట్ర కార్యద.ర్శులు ఉమామహేశ్వరరావు, కె ధనలక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పాల్గొన్నారు.

జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి

- మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలకు చేసిన మేలేంటో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సమా చార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. అసెంబ్లీకి రాకుండా గ్లోబెల్స్ ప్రచారం చేయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌తో కలిసి టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని రూ.11 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టి ఆరోగ్యశ్రీకి డబ్బులు చెల్లించలేదని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీలోనూ రూ.1,500 కోట్లు గత ప్రభుత్వం ఎగ్గొట్టిందని అన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. క్రమం తప్పకుండా ఆగస్టు ఒకటినే పింఛను అందిస్తామన్నారు. గత నెలలో జరిగిన చిన్నచిన్న తప్పులు కూడా పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

మారుతి సుజుకి లాభాల్లో 47 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2024-25 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 47 శాతం వృద్ధితో రూ.3,650 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ. 2,485.1 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.32,326.7 కోట్లుగా ఉన్న ఆదాయం.. గడిచిన క్యూ1లో 9.9 శాతం పెరిగి రూ.35,531 కోట్లకు చేరింది.



గరిష్టస్థాయికి శ్రీశైలం నీటి మట్టం

- ఎనిమిది గేట్ల ద్వారా దిగువకు విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది. మంగళవారం రాత్రి తొమ్మిది గంటల నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు పదిగేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. ఉదయం 12 గంటల నుంచి ఎనిమిది గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువకు 2,23,768 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు బుధవారం విడుదల చేశారు. మూడు గంటల సమయానికి ఎగువ జూరాల నుంచి 2,77,285 లక్షల క్యూసెక్కులు, తుంగభద్ర నుంచి 16,256 వేల క్యూసెక్కులు కలిపి 2,93,813 లక్షల క్యూసెక్కుకుల నీరు శ్రీశైలానికి చేరింది. అదే సమయానికి జలాశయ నీటిమట్టం గరిష్ట స్థాయికి అంటే 885 అడుగులకు గాను ప్రస్తుతం 884.50 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను 212.9198 టిఎంసిలుగా నమోదైంది. కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో గడిచిన 24 గంటల్లో 24,917 వేల క్యూసెక్కుల నీటితో 14.586 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తిని, ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రంలో 35,315 వేల క్యూసెక్కుల నీటితో 17.667 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తిని చేస్తూ దిగువ నాగార్జున సాగర్‌కు 60,232 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 24,083 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ 1600 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. దిగువ సాగర్‌కు 2,84,000 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. జలాశయం నుంచి మొత్తం 3,09,683లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

ప్రాధాన్యతా పనులుగా రోడ్లు, కాలువలు

మెటీరియల్ కాంపొనెంట్ వినియోగంలో మారిన రేగా నిబంధనలు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి రేగా) మెటీరియల్ కాంపొనెంట్ నిధుల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు స్వల్పంగా మారాయి. ఈ నిధుల వినియోగం విషయంలో గత వైసిపి ప్రభుత్వం భవనాలు, గ్రామ సచివాలయాలు వంటి వాటి నిర్మాణాలను ప్రాధాన్యత ఇచ్చింది. రోడ్లు, కాలువల నిర్మాణాలను అప్రాధాన్యత జాబితాలో ఉంచింది. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం రోడ్లు, కాలువల నిర్మాణాలను కూడా ప్రాధ్యానతా జాబితాలో చేర్చింది. దీంతో, వీటి నిర్మాణానికి మెటీరియల్ కాంపొనెంట్ నిధులను ఎప్పటికప్పుడు వినియోగించుకునేందుకు అవకాశం ఏర్పడింది. గతంలో మాదిరిగా పరిమితమైన కాలవ్యవధిలో పనిచేసుకోలేక మిగిలిన నిధులు వెనక్కిపోయే పరిస్థితి కొంత వరకు తగ్గనుంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడేందుకు అవకాశం ఏర్పడనుంది. ఎంజి రేగా కింద చేపట్టిన పనులకు వేతన రూపంలో చెల్లించిన మొత్తంపై 2/3వ వంతు మెటీరియల్ కాంపొనెంట్ నిధులు మంజూరవుతాయి. ఈ నిధులను గ్రామీణ రోడ్లు, భవనాలు, కాలువలు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగించుకోవచ్చు. గత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయాలు, ఆర్‌బికెలు, వెల్‌నెస్ సెంటర్లు, బల్కుమిల్క్‌సెంటర్లు వంటి భవన నిర్మాణాలను ప్రాధాన్యత పనులుగాను, రోడ్లు, కాలువలు వంటివాటిని అప్రాధాన్యతగాను గుర్తించింది. బిల్లు



అధ్వానంగా తయారైన రోడ్డు

చెల్లింపుల మాట అటుంచితే... భవన నిర్మాణాలకు ఎప్పటికప్పుడు అనుమతులిచ్చేవారు. రోడ్లు, కాలువల నిర్మాణాలకు మాత్రం ఆర్థిక సంవత్సరం ముగియడానికి మూడు నెలల ముందు, అంటే ఏటా జనవరిలో అనుమతులు ఇచ్చేవారు. వాటిని మార్చి నెలాఖరునాటికి పూర్తి చేయాలి. ఆ నిర్దిష్టమైన కాల వ్యవధిలో పూర్తి చేయకపోతే బిల్లులు అందే పరిస్థితి ఉండేది కాదు. పెండింగ్ పనుల బిల్లులకుగానీ, కొత్త పనుల అనుమతికిగానీ తిరిగి వచ్చే జనవరి వరకు నిరీక్షించాల్సి వచ్చేది. దీంతో, చాలా గ్రామాల్లో ఈ పనులు చేసేందుకు సాహసించలేని పరిస్థితి ఏర్పడింది. చాలా గ్రామాలు విస్తరించినప్పటికీ ఆయా చోట్ల రోడ్లు, కాలువలు నిర్మాణానికి నోచుకోలేదు. ఏటా మెటీరియల్ కాంపొనెంట్ నిధులు వెనక్కివెళ్లిపోయేవి. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయకపోవడం వంటి కారణాల వల్ల కూడా గ్రామాల అభివృద్ధి కుంటుపడింది.

గత ఐదేళ్లలో విజయనగరం జిల్లాలో రూ.1,112.16 కోట్లు వెనక్కి

గత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి చట్టం కింద విజయనగరం జిల్లాలో 2.18 కోట్ల పనిదినాలు కల్పించగా రూ.502.36 కోట్ల మేర వేతనాలు చెల్లించారు. ఈ మొత్తంపై మెటీరియల్ కాంపొనెంట్ రూపంలో జిల్లాకు రూ.336.58 కోట్లు సమకూరినప్పటికీ అప్పట్లో ప్రాధాన్యత, అప్రాధాన్యత అనే నిబంధనల వల్ల రూ.129.05 కోట్ల విలువైన పనులు మాత్రమే జరిగాయి. మిగిలిన రూ.207.53 వెనక్కి వెళ్లిపోయాయి. ఈ విధంగా 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 వరకు రూ.1,112.16 కోట్లు వెనక్కి వెళ్లిపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్ నుంచి జులై వరకు) 1.35 కోట్ల పనిదినాలు కల్పించగా, రూ.311.79 కోట్ల మేర వేతనాలు చెల్లించారు. దీనిపై రూ.208.90 కోట్లు కోట్ల మేర మెటీరియల్ కాంపొనెంట్ నిధులు సమకూరగా, ఇప్పటివరకు పాత నిబంధనల ప్రకారం కేవలం భవనాల నిర్మాణ పనులకు రూ.34.83 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన రూ.174.07 కోట్లు మారిన నిబంధనల ప్రకారం భవనాలతోపాటు రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు కూడా ఖర్చు చేయనున్నారు.

బీమా పథకాలపై జిఎస్‌టి వద్దు

- 18 శాతం పన్ను సమంజసం కాదు
- వైద్య బీమా విస్తృతికి పన్ను అడ్డంకి
- మంత్రి సీతారామన్‌కు మరో మంత్రి గడ్కరీ లేఖ



నాగ్‌పూర్ : జీవిత, వైద్య బీమా పథకాలపై వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)ను రద్దు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు మంత్రి నితిన్ గడ్కరీ కోరారు. బీమా ప్రీమియంలపై వసూలు చేస్తున్న జిఎస్‌టిని తొలగించాలని ఆయన లేఖలో సూచించారు. నాగ్‌పూర్ డివిజనల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నుంచి వచ్చిన మెమోరాండం ప్రకారం లేఖ రాస్తున్నట్లు గడ్కరీ తెలిపారు. కుటుంబానికి రక్షణ కల్పించడానికి, ప్రమాదాల సమయంలో సహాయంగా నిలిచే బీమాపై పన్నును యూనియన్ వ్యతిరేకిస్తోందని గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారు. బీమా ప్రీమియంలపై 18 శాతం జిఎస్‌టి అనేది సమంజసం కాదన్నారు. బీమా అనేది సామాజిక అవసరం అని తెలిపారు. కాబట్టి జీవిత, వైద్య బీమా పథకాల ప్రీమియంలపై పన్నును ఉపసంహరించుకోవాలని కోరారు. "జీవిత, ఆరోగ్య బీమా ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జిఎస్‌టిని తొలగించాలని ఉద్యోగ సంఘాలు అభ్యర్థిస్తున్నాయి. వాటిపై 18 శాతం జిఎస్‌టి ఉంది. జీవిత బీమాపై ప్రీమియంపై పన్ను విధించడమనేది జీవితంలోని అనిశ్చితిపై పన్ను వేయడమే. కుటుంబానికి రక్షణ ఇచ్చేందుకు తీసుకునే ఈ బీమాపై పన్ను ఉండకూడదని భావన. అంతేకాదు సామాజికంగా ఎంతో అవసరమైన వైద్య బీమా ప్రీమియంపై 18 శాతం జిఎస్‌టి ఆ రంగం వృద్ధికి అడ్డంకి. ఈ నేపథ్యంలోనే యూనియన్లు జిఎస్‌టిని ఉపసంహరించుకోవాలని కోరుతు న్నాయి." అని గడ్కరీ తన లేఖలో పేర్కొన్నారు.

జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు ప్రస్తుతం ఒక తప్పనిసరి అవసరంగా మారిపోయాయి. మరోవైపు కరోనా తర్వాత ఆరోగ్య బీమా ప్రీమియం ఏటా 10-15 శాతం వరకూ పెరిగిపోతోంది. ఈ పరిస్థితుల్లో చాలామంది వాటి భారాన్ని మోయలేక పాలసీలను పునరుద్ధరించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో బీమాపై విధిస్తున్న 18 శాతం జిఎస్‌టిని తగ్గించాలని అటు పాలసీదారులు, ఇటు పరిశ్రమ వర్గాలూ ఎప్పటి నుంచో ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. దీన్ని 5 శాతానికి కుదించాలని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుదాస్ లిల్లాధర్ ఇక పిఎల్ కాపిటల్

ముంబయి : ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ప్రభుదాస్ లిల్లాధర్ గ్రూపు తన 80వ వార్షికోత్సవం సందర్భంగా తన బ్రాండ్ పేరును పిఎల్ కాపిటల్‌గా మార్చుకుంది. ఈ కొత్త బ్రాండ్‌ను కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పిఎల్ గ్రూప్ విలువలైన సమగ్రత, విశ్వాసం, ప్రామాణిక స్వదేశీ స్ఫూర్తిని, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించాలన్నారు. భవిష్యత్తు దిశగా ఇప్పుడు 3.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ నుండి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు మారడంపై దృష్టి పెట్టాలన్నారు.



కీలక రంగాల మందగింపు

న్యూఢిల్లీ : పారిశ్రామికోత్పత్తిలో అత్యంత కీలకమైన ఎనిమిది కీలక రంగాల ఉత్పత్తి మందగించింది. ప్రస్తుత ఏడాది జూన్‌లో 4శాతానికి పరిమితమై 20 నెలల కనిష్టానికి పడిపోయింది. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ రంగాలు 2023 జూన్‌లో 8.4 శాతం వృద్ధిని కనబర్చాయి. ఈ కీలక రంగాలు గడిచిన జూన్ నెలలో భారీగా తగ్గడంతో 2022 అక్టోబర్ నాటి 0.7 శాతం కనిష్ట స్థాయికి పడిపోయాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన సమయంలో కీలక రంగాల ఉత్పత్తి 5.7 శాతానికి పరిమితమయ్యింది. గతేడాది ఇదే సమయంలో 6 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ఈ ఎనిమిది రంగాలు మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 40.27 శాతం వాటాను కలిగి ఉన్నాయి. గడిచిన జూన్‌లో ముడి చమురు, రిఫైనరీ ఉత్పత్తుల ఉత్పత్తి వరుసగా ఏకంగా మైనస్ 2.6 శాతం, మైనస్ 1.5 శాతానికి పడిపోయాయి. సహజ వాయువు, ఎరువులు, స్టీల్ రంగాలు వరుసగా 3.3 శాతం, 2.4 శాతం, 2.7 శాతం, 1.9 శాతం చొప్పున మందగించాయి. కేవలం బొగ్గు, విద్యుత్ ఉత్పత్తి రంగాలు మాత్రమే 14.8 శాతం, 7.7 శాతం చొప్పున సానుకూల వృద్ధిని నమోదు చేశాయి.

ఇంటెల్‌లో ఉద్యోగులకు ఉద్వాసన..!

న్యూయార్క్ : ప్రముఖ టెక్ కంపెనీ ఇంటెల్ తమ ఉద్యోగులపై వేటు వేసే యోచనలో ఉంది. దీనికి సంబంధించి ప్రస్తుత వారంలోనే ప్రకటన వెలుపడే అవకాశాలున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. వ్యయాలు తగ్గించుకోవడంతో పాటు మార్కెట్ వాటాను పెంచుకొనే చర్యల్లో భాగంగా పెద్ద మొత్తంలో ఉద్యోగులను తొలగించనుందని సమాచారం. ఇంటెల్ సాంకేతికతను మరింత మెరుగుపరచడానికి, సెమీ కండక్టర్ పరిశ్రమలో కంపెనీని అగ్రగామిగా నిలిపేందుకు చేయాల్సిన ఆర్అండ్‌డిపై భారీగా ఖర్చు చేయాలని ఆ కంపెనీ నిర్ణయించింది. ఈ క్రమంలో ఖర్చులు తగ్గించుకోవడం కోసం సిబ్బందిపై వేటు వేయనుందని తెలుస్తోంది. 2023లో 5 శాతం మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. ఈ కంపెనీకి ఇండియాలోని హైదరాబాద్, బెంగళూరులో 13 వేల మంది ఉద్యోగులు ఉన్నారు.

సెన్సెక్స్ 286 పాయింట్ల పెరుగుదల

ముంబయి : కొనుగోళ్ల మద్దతుతో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 286 పాయింట్లు పెరిగి 81,741కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 94 పాయింట్లు రాణించి 24,951 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 81,828 గరిష్ట స్థాయిని తాకింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలూ మార్కెట్లకు ప్రధాన మద్దతును అందించాయి. సెన్సెక్స్ 30 సూచీలో జెఎస్‌డబ్ల్యు స్టీల్, ఏషియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, ఎన్‌టిపిసి, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. రిలయన్స్, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.



విజయ్ ప్రతాప్‌వి ఉత్తుత్తి తనిఖీలే

- టిడిపి అధికార ప్రతినిధి విజయ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డివి ఉత్తుత్తి తనిఖీలేనని టిడిపి అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ అన్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయ్ ప్రతాప్ రెడ్డి తనిఖీల పేరుతో హడావుడి తప్ప ఏమీ లేదన్నారు. ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు పక్కా ఆధారాలు, ఫొటోలు ఉన్నాయని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తులు కమిషన్ ఛైర్మన్‌గా ఉంటే పారదర్శకత ఉంటుందా? అని ప్రశ్నించారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ కమిషన్‌ను ఛైర్మన్, సభ్యులు నిర్వీర్యం చేశారని విమర్శించారు. కాకినాడ పోర్టు నుంచి మూడేళ్లలో రూ.750 కోట్లు విలువ చేసే రేషన్ బియ్యం ఆఫ్రికాకు తరలిపోయిందని, ఆహార కమిషన్ దృష్టికి ఈ అక్రమ రవాణా ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

ప్రభుత్వ పథకాలకు మహనీయుల పేర్లు

- కెవిపిఎస్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం పలు పథకాలకు పెట్టిన పేర్లను మార్చి వాటి స్థానంలో టిడిపి కూటమి ప్రభుత్వం కొత్త పేర్లు పెట్టడాన్ని స్వాగతిస్తున్నా మని, అయితే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరు ఎక్కడా లేదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సిఎంఒ ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్రకు వినతిపత్రం అందజేశారు. మిగిలిన పథకాలకు పేర్లు పెట్టే సమయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతి బాపూలే, గుర్రం జాషువా, పుచ్చలపల్లి సుందరయ్య, ఎస్ఆర్ శంకరన్ వంటి మహనీయుల పేర్లు పెట్టాలని కెవిపిఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. దళిత, గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు రూపకల్పన చేసి, ఎందరో ఐఎఎస్‌లకు మార్గదర్శి అయిన దళిత, గిరిజన, బలహీనవర్గాల సంక్షేమం కోసం చివరి వరకు నిలిచిన మహనీయులు ఎస్ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

విద్యా వ్యవస్థ ధ్వంసం : ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పటిష్టంగా వున్న విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం 50 రోజుల్లోనే ధ్వంసం చేసిందని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టడంతోపాటు అంతర్జాతీయంగా పేరెన్నికగన్న టోఫెల్‌తో తమ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి రాగానే టోఫెల్ శిక్షణను రద్దు చేశారని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు లబ్ది చేకూర్చే లక్ష్యంతోనే ఇంగ్లీష్ మీడియం పట్ల ఇన్నాళ్లు విషం కక్కిన టిడిపి ఇప్పుడు ఏకంగా టోఫెల్‌ను రద్దు చేయించిందన్నారు. అమ్మఒడి పథకానికి తల్లివందనం అని పేరు మార్చి ఈ ఏడాది ఎగ్గొట్టారని విమర్శించారు. 2014-19 మధ్య కాలంలో టిడిపి ప్రభుత్వం 1,785 పాఠశాలలను మూసివేసిందని విమర్శించారు.

సంపాదకీయం

హృదయ విదారకం

కేరళలోని వయనాడ్ జిల్లాలో చోటుచేసుకున్న ప్రకృతి విలయం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత సంభవించిన ఈ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్యపై ఇంకా అస్పష్టత కొనసాగుతూనే ఉంది. బుధవారం రాత్రికి సుమారు 250 వరకూ మృతదేహాలను వెలికితీశారు. మరణించిన వారి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందంటూ వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. కుండపోత వర్షం కారణంగా ఒకటికి, రెండు సార్లు భారీ కొండచరియలు విరిగిపడటంతో వయనాడ్ జిల్లా మొత్తం పెను విపత్తులో చిక్కుకుంది. మెప్పాడి పంచాయతీ పరిధిలోని ముండక్కై, అట్టామల, నూల్‌పూజా గ్రామాలతో పాటు, చూరాలమల పట్టణంలోనూ బీభత్స దృశ్యాలు చోటుచేసుకున్నాయి. నివాస స్థలాలు ఉండాల్సిన చోట బురదమట్టి దిబ్బలు కనపడుతున్నాయి. ముండక్కై గ్రామం స్థానంలో మట్టి, బురద, రాళ్లు నేలకూలిన చెట్లతో నిండిన నది ప్రవహిస్తోందంటూ వస్తున్న వార్తలు పరిస్థితి తీవ్రతను తెలియచేస్తాయి. ఇక్కడ యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టడానికి వచ్చిన రెస్క్యూ టీమ్ బుధవారం మధ్యాహ్నం వరకు ఆ గ్రామంలో అడుగు పెట్టలేకపోయింది. మరోవైపు సంఘటన స్థలానికి కిలోమీటరు దూరంలో ఉన్న చలియార్ నదిలో ఛిద్రమైన మృత దేహాలు కొట్టుకువస్తూనే ఉన్నాయి. సంఘటన స్థలంలో కన్నా, ఈ నదిలోనే ఎక్కువ మృత దేహాలను రక్షణ సిబ్బంది వెలికి తీస్తున్నారు.

కేరళకు ప్రకృతి విపత్తులు కొత్తేమీ కాదు. కానీ, వయనాడ్‌లో చోటుచేసుకున్నది ఆ రాష్ట్ర చరిత్రలోనే అతి పెద్ద విపత్తులలో ఒకటి. కొండచరియలు విరిగి నదిలో పడటంతో రెండింతలైన బురద మట్టి ప్రవాహం ఊళ్లకి ఉళ్లు ముంచెత్తింది. కిలోమీటర్ల పొడవునా, కొన్ని అడుగుల మేర ఎక్కడ చూసినా బురద మట్టే కనపడుతోంది. ఇళ్లు, ఆస్పత్రులు, బడులు, ప్రార్థనాలయాలు అన్నీ ఆ మట్టి కిందే. దీంతో సహాయ చర్యలు ఎక్కడి నుండి ప్రారంభించాలో కూడా రెస్క్యూ సిబ్బందికి అర్థం కాని పరిస్థితి ఏర్పడిందంటే ఏ స్థాయిలో విపత్తు చోటుచేసుకుందో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాంతానికి సమీపంలోనే ఉన్న పుత్తమలలో 2019లో కొండచరియలు విరిగిపడి 17 మంది మరణించారు. 60 మంది మృతి చెందిన కవలపర కూడా దగ్గరలోనే ఉంది. 2020లో కూడా ఈ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. తాజాగా ఈ అన్ని ప్రాంతాల్లోనూ గత ఆదివారం నుండి భారీ వర్షం కురుస్తోంది. 2019 ఆగస్టు 8న నమోదైన వర్షపాతానికి దగ్గరగా ఈ వర్షం ఉంది. మృత్యు రక్కసి విరుచుకుపడిన ప్రాంతంలో 48 గంటల్లో 572 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ స్థాయి వర్షపాతం వయనాడ్ జిల్లా కనీవిని ఎరుగదు. భారత వాతావరణ పరిశోధన సంస్థ (ఐఎండి) కూడా ఈ వర్ష బీభత్సాన్ని అంచనా వేయలేకపోయింది. అరేబియా సముద్రపు ఉష్ణోగ్రతలు భారీగా పెరగడం కూడా ఉత్పాతానికి కారణంగా చెబుతున్నారు.

ఇంత భయానక పరిస్థితుల్లోనూ స్థానిక ప్రజానీకం కదులుతోంది. ముండక్కై గ్రామంలో తొలివిడత విధ్వంసం తరువాత పరిసర ప్రాంతాల్లోని ప్రజానీకం పెద్ద ఎత్తున సహాయ చర్యలు చేపట్టారు. ఆ పనులు జరుగుతుండగానే, రెండవసారి కొండ చరియలు విరుచుకుపడి సర్వస్వాన్ని భూ స్థాపితం చేశాయి. అయినా, స్థానికులు వెరవలేదు. రెస్క్యూ బృందాలకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సహాయ చర్యలను ముమ్మరం చేసింది. దాదాపు 50 సహాయ శిబిరాలను ఏర్పాటు చేసింది. పలువురు మంత్రులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం తెల్లవారు జాము నుండి నిరంతరంగా సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. 2018 వరదలు, కోవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కొన్న అనుభవంతో యంత్రాంగానికి దిశా నిర్దేశం చేస్తున్నారు. ఈ ప్రమాదాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి ఉదారంగా ఆదుకోవాలని ఆయన కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ దిశలో తక్షణం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కేంద్రం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలనైతే పంపింది కానీ, కేరళ ప్రభుత్వంపై హోంమంత్రి నిందా పూర్వక వ్యాఖ్యలు చేయడం తగని పని. బాధిత ప్రజానీకాన్ని ఆదుకోవడంపైనే అందరూ సర్వశక్తులను ఒడ్డి, సహకారం సమకూర్చి, ప్రకృతి విలయంలో చిక్కుకున్న వారిని ఒడ్డున పడేయాలి.

మహనీయుల మాట



ఒక వ్యక్తి మరో వ్యక్తిని దోపిడీ చేయడం అన్నది ఏ మేరకు అంతమౌతుందో ఒక జాతి మరో జాతిని దోపిడీ చెయ్యడం కూడా అదే మేరకు అంతమవుతుంది. ఒక జాతిలో వర్గ శత్రుత్వం ఏ మేరకు మాయవమవుతుందో ఒక జాతికీ మరో జాతికీ మధ్య శత్రుత్వం కూడా ఆ మేరకు అంతమవుతుంది.

- కారల్ మార్క్స్, ఏంగెల్స్,
కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక .


నాలుగున్నర దశాబ్దాల ప్రజాపాత్రికేయం

సందర్భం

తెలకపల్లి రవి

ప్రజాశక్తి దిపపత్రిక దాదాపు నాలుగున్నర దశాబ్దాలు పూర్తి చేసుకుని 44వ వార్షికోత్సవ ఘట్టంలోకి ప్రవేశిస్తున్నది. అక్షరాక్షర దీక్షగా / ఆశయాలే రక్షగా / నడచి వచ్చిన దారులు / గడిచి పోయిన రోజులు...ఈ సందర్భంలో కళ్ల ముందు కదలాడతాయి. దానితో సన్నిహిత సంబంధం భాగస్వామ్యం ఉన్న వారికి పత్రిక చరిత్ర, పెరుగుదల కళ్ల ముందు కదలాడతాయి.

తెలుగులో పత్రికలు ప్రధానంగా సంఘ సంస్కరణలు, స్వాతంత్ర్య పోరాటం, వామపక్ష ఉద్యమాలు అన్న మూడు నేపథ్యాలలో తొలి అడుగులు వేశాయి. 1942లో ప్రజాశక్తి వారపత్రికగా ప్రారంభమైంది. ఆ విధంగా చూస్తే ఇది 82వ వార్షికోత్సవం కూడా. ఫాసిస్టు యుద్ధాన్ని ఖండించడంలోను, ప్రగతిశీల భావాలను వ్యాపింప చేయడంలోనూ నాటి ప్రజాశక్తి కీలక పాత్ర వహించింది. 1945లో దినపత్రికగా మారింది. సుందరయ్య, కంభంపాటి, మద్దుకూరి వంటి వారి కృషి ఇందులో ఉంది. శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, ఉప్పల లక్ష్మణరావు వంటి సుప్రసిద్ధుల రచనలు దానిలో వచ్చేవి. గ్రాంథికం, వ్యవహారం, వాదోపవాదాల మధ్య పత్రికా భాష ఇంకా పూర్తిగా స్థిరపడని ఆ కాలంలో జన సామాన్యానికి అర్థమయ్యే విధంగా రాయడంలో ప్రజాశక్తి భాషకు ఒరవడి, భావాలకు వరిపిడి అయింది. ఇది నచ్చని ఛాందసులు పెద్ద బాలశిక్ష ఫెయిల్-ప్రజాశక్తి పాస్' అని అపహాస్యం చేశారు కూడా! 1946లో ప్రారంభమైన సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రజాశక్తి వాణిగా పనిచేసింది. ప్రభుత్వం 1948లో విజయవాడలోని ప్రజాశక్తి నగర్‌పై దాడి చేసి, విధ్వంసానికి పాల్పడింది. నిజాం నవాబు కూడా హైదరాబాద్ సంస్థానంలో నిషేధించాడు. నూతన స్వాతంత్ర్యం, రాష్ట్రాల ఏర్పాటు, ఎన్నికలు తదితర పరిణామాల మధ్య మళ్లీ 1951లో వారపత్రికగా పున:ప్రారంభమైంది. కొన్నాళ్ళ తర్వాత దినపత్రికగా మారి విశాలాంధ్ర పేరుతో పున:ప్రారంభమైంది. మద్దుకూరి చంద్రం, మోటూరు హనుమంతరావు తదితరులు దాని సంపాదకులుగా ప్రసిద్ధులు. ప్రజాశక్తి 1968లో వారపత్రికగా 1981 ఆగస్టు ఒకటవ తేదీన దినపత్రికగా అవతరించింది. మోటూరు హనుమంతరావు అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య సమక్షంలో నాటి సిపిఎం ప్రధాన కార్యదర్శి ఇఎంఎస్ నంబూద్రిపాద్ దాన్ని ఆవిష్కరించడం ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నట్టుంది. చాలా మంది ఈ పత్రిక నడవటం కష్టమని అనేవారు. కాని సందేహాలను పటాపంచలు చేస్తూ అక్షరాయుధంగా పదునెక్కుతూ ప్రజాశక్తి ప్రస్థానం నడిచింది. అంకిత భావం గల నాయకత్వం సంపాదకులు, కార్మికులు, ఉద్యోగ సిబ్బంది సేవలు, ఉద్యమాభిమానులు పత్రిక శ్రేయోభిలాషుల అండదండలు దాన్ని నిలబెట్టాయి.



విజయవాడలో ప్రజాశక్తి దినపత్రిను ప్రారంభిస్తున్న ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్‌తో పుచ్చలపల్లి సుందరయ్య (1981)

> **ఇటీవలి ఎన్నికలలో లౌకిక శక్తుల బలం పెరగడం, కేంద్రంలో మోడీ దూకుడుకు ప్రజలు పగ్గాలు వేయడం ప్రజాశక్తి వంటి పత్రికల కృషికి ఉత్సాహమిచ్చే పరిణామం. అయితే మతతత్వ శక్తుల ప్రమాదాన్ని గానీ, కార్పొరేట్ ఆధిపత్య వ్యూహాలను గానీ ఏ మాత్రం తక్కువ అంచనా వేయడానికి లేదు. మీడియాపై ఇవే ప్రత్యేకంగా పిడికిలి బిగిస్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో గూగుల్ ట్రంప్‌ను బలపరుస్తున్నట్టు ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆరోపించడం చూస్తున్నాం. ఇక అభ్యుదయ ఉద్యమాలు, సామాజిక న్యాయం కోరే శక్తుల సవాళ్లు మరెంత తీవ్రంగా వుంటాయో వేరే చెప్పాలా? అందులోనూ తెలుగు నాట ప్రాంతీయ పార్టీలు కేంద్రంలోని మతతత్వ బిజెపితో ప్రత్యక్ష పరోక్ష స్నేహానికి అర్రులు చాస్తున్న దృష్ట్యా ప్రజాస్వామ్య హక్కులను స్వేచ్ఛను కాపాడుకోవడం మరింత కీలకమవుతుంది. ఇలాంటి తరుణంలో ప్రజాశక్తి మార్గం ప్రజాస్వామ్య ఉద్యమాలకు ప్రజల శ్రేయస్సుకు మరింత ఆలంబనం అవశ్యం అవుతాయి.**

అన్ని దశల్లోనూ కీలక పాత్ర

ఈ నలభయ్యేళ్లలో అంతర్జాతీయంగానూ, దేశంలోనూ లౌకిక ప్రగతిశీల శక్తులు అనేక పోరాటాలు ఉద్యమాలు చేశాయి. అనేక ఎదురుదెబ్బలూ తగిలాయి. 1981 అఖిలపక్ష ఉద్యమం, 1982లో సిపిఎం అఖిల భారత మహాసభల మహా సమీకరణ తర్వాత 83 ఎన్నికల్లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చారు. 1984లో సానుభూతి పవనాలతో రాజీవ్ గాంధీ గద్దెనెక్కారు. 1990లలో సోషలిస్టు శిబిరంలో కల్లోలం చెలరేగి చివరకు 1991లో సోవియట్ యూనియన్ కూడా విచ్ఛిన్నమైంది. దేశంలో సరికొత్త ఆర్థిక విధానాలు, వాటి వెంటనంటి రాజకీయాలలో మితవాద, మతవాద దాడి మొదలైనాయి. చివరకు 1998లో బిజెపి అధికారం చేపట్టింది. రాష్ట్రంలో తెలుగుదేశం దానితో జతకట్టి మరోసారి అధికారంలోకి వచ్చి ప్రపంచబ్యాంకు విధానాలను అమలు చేయడంలో ప్రథమ పీఠిన నిలిచింది. పత్రికల మైండ్‌సెట్ మారాలని అప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతుండేవారు. ఆ సమయంలో సాగిన విద్యుత్ ఉద్యమానికి ప్రజాశక్తి ప్రాణవాయువులా సేవచేసింది. ఆ ప్రభుత్వం మారి 2004లో వైఎస్‌ఆర్ ప్రభుత్వం వచ్చాక భూపోరాటం వంటివి జరిగాయి. తర్వాత తెలంగాణ ఏర్పాటుకు ఉద్యమం మొదలైంది. 2014 ఎన్నికల తర్వాత రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ప్రజాశక్తి ఒరవడిలో ఉద్యమాల స్ఫూర్తితో నవ తెలంగాణ ఆవిర్భవించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ పత్రికలు తమ తమ పరిస్థితులకు అనుగుణంగా ప్రజా ఉద్యమాలకు అండగా వుంటూ ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడుతున్నాయి. రాజకీయ పరిస్థితులు ఎన్ని విధాలుగా మారి ఎన్ని సవాళ్లు వచ్చినా కర్తవ్య నిర్వహణకు చైతన్య ప్రేరణకూ అంకింతం కావడంలోనే ప్రజాశక్తి విశిష్టత వుంది. కేంద్రంలోనేమో కరుడుగట్టిన మతతత్వం, కార్పొరేట్ తత్వం సామ్రాజ్యవాద అనుకూలతల కలయికగా మోడీ ప్రభుత్వం కొలువుతీరింది. ఈ దశలన్నిటా ప్రజాశక్తి ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం వేదికగా నిలిచింది. నిలుస్తోంది. ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతిరూపమైంది.

సోవియట్ విచ్ఛిన్నంతో చరిత్రాంతాన్ని గురించిన సిద్ధాంతాలు చెలరేగుతున్నప్పుడు ప్రజాశక్తి సోషలిజం భావన అజేయమని చెప్పగలిగింది. ప్రపంచీకరణ వేదమంత్రంలా మార్మోగుతున్నప్పుడు ప్రత్యామ్నాయ పోరాటాలను ముందుకు తెచ్చింది. 1990ల తర్వాత నుంచి మతోన్మాదం మంటలు పెడుతున్నప్పుడు లౌకిక పతాకం ఎగరేయడంలో నిర్భయంగా నిలబడింది. ఇవి చిన్న విషయాలు కాదు. ఆశయ బలమే ప్రజాశక్తికి ఆ శక్తినిచ్చింది. మోయలేని భారంగా మారిన పత్రికా నిర్వహణలో కొన్ని ప్రముఖ పత్రికలే ఆగిపోయాయి. ఆగిన వాటిలో ఒక పత్రిక తప్ప వాటిలో మళ్లీ గట్టిగా బతికి బట్టకట్టినవి లేవు. నిన్నటి పెద్ద పత్రికలు కొన్ని ఇప్పుడు నామమాత్రంగా నడుస్తున్నాయి. ఈ సవాళ్ల కారణంగా ఒక దశలో నాలుగు పేజీలకే పరిమితమైన ప్రజాశక్తి ప్రజల సహకారంతోనే మళ్లీ పురోగమన మార్గం చేపట్టింది. క్రమేణా విస్తరించి 1994లో హైదరాబాదులో రెండవ ఎడిషన్ ప్రారంభించింది. అప్పట్లో అది నడవదనీ అవాస్తవికమని చాలా మంది జోస్యాలు, జాగ్రత్తలు చెప్పారు. కానీ ఇప్పుడు ప్రజాశక్తి ఎనిమిది ఎడిషన్లతో విస్తృతమైన యంత్రాంగంతో, రంగుల యంత్రాలతో ముందుకుపోవడం ఫలప్రదమైన ప్రయోగం. సమస్యలు లేవని కాదు, వనరుల కొరత లేదనీ కాదు. తీవ్రమైన కరోనా తాకిడితో సహా చాలా సంక్లిష్ట సమస్యలే ఎదురైనాయి. అంకితభావం గల సిబ్బంది రాజకీయ నైశిత్యం, ఉద్యమాల ఆలంబన, శ్రేయోభిలాషుల అండదండలు ఉంటే సంక్లిష్టమైన సవాళ్లను అధిగమించడం సాధ్యమని పత్రిక పురోగమనం నిరూపిస్తుంది.

మార్పులకు అన్వయించుకుంటూ...

సామాజిక మార్పులను, సాంకేతిక ప్రగతిని పరిగణనలోకి తీసుకుని ముందుకు పోవడంలోనే ఈ పురోగమన రహస్యం వుంది. రష్యన్ సోషలిజం ప్లస్ అమెరికన్ మేనేజ్‌మెంటు అని స్టాలిన్ అన్న మాటలు సుప్రసిద్ధం. సంస్కరణలు వాటికవే చెడ్డవి కావు. చెడ్డ సంస్కరణలే ప్రమాదకరమైనవి. సామాజిక మార్పులను సాంకేతిక ప్రగతిని పరిగణనలోకి తీసుకుని ముందుకు పోవడంలోనే ఈ పురోగమన రహస్యం వుంది. ప్రజాశక్తి ఆ సూత్రాన్ని అన్వయించుకోవడం వల్లనే ప్రగతిశీల వాదులకు వేదిక కాగలిగింది. తమ మౌలిక అభిప్రాయాలకు కట్టుబడి ఉంటూనే లోగోతో సహా అనేక మార్పులు చేసుకుంది.

ఈ నలభయ్యేళ్లలో మీడియా ముఖచిత్రం ఎంతగానో మారింది. ఆధిపత్య శక్తులకు అంగీకార సృష్టి నేటి ప్రపంచాధిపత్య వ్యూహంలో ప్రధానాంశం. ఇందులో పెద్ద పాత్ర మీడియాది. అందుకే ప్రజానుకూల శక్తులు ప్రత్యామ్నాయ మీడియా కోసం పెద్ద కృషి చేస్తున్నాయి. అమెరికా వంటి చోట్ల కూడా ప్రత్యామ్నాయ భావజాల కృషి ఉధృతమవుతున్నది. తెలుగు మీడియా ముఖ్యులలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రగతిశీల భావాల ప్రేరణ లేనివారు చాలా తక్కువ. కాని ఇప్పుడు భారతీయ మీడియాలో ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ సోషల్ మీడియాలోనూ కార్పొరేట్ శాసనం ప్రబలిపోయింది. ఆంక్షల అంకుశాలు, నిరంకుశ పాలకుల శాసనాలు మీడియాను వేటాడుతుంటే ఆ విలువలు వెలవెలబోతున్నాయి. మరీ ముఖ్యంగా తెలుగునాట ప్రధాన పత్రికలు, ఛానళ్లు రెండు ప్రాంతీయ పాలక పార్టీల మధ్య విభజింపబడి వివాదాలలో మునిగి తేలుతున్నాయి. దేశం నెత్తిన కూర్చున్న మోడీ అప్రజాస్వామిక పోకడలను బహిర్గతం చేయడం వీటి ఎజెండాలోనే వుండదు. అంతర్జాతీయంగా అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిఘటించడమూ వుండదు. పెగాసస్, కాశ్మీర్, రైతాంగ ఆందోళన, యూరప్‌లో మితవాద విజృంభణ ఏదైనా సరే వీటికి అవసరం లేని పని. స్థానిక పాలక పార్టీల ప్రయోజనాలకూ, ఢిల్లీ పెద్దల దృక్పథానికి విరుద్ధమైన విశ్లేషణలూ, పరిశీలనలూ వీటిలో అసలు కనిపించవు. ఈ సోషల్ మీడియా యుగంలో ఇందుకు సంబంధించిన విస్తారమైన సమాచారం ప్రజాస్వామిక మేధావులు, పాత్రికేయులు, రచయితలు తవ్వితీస్తున్నా వీరికి అక్కర్లేదు. ఈ రాష్ట్రంలో తాము బలపర్చే పక్షాన్ని తలకెత్తుకోడం, అవతలి పక్షంపై దాడి చేయడం అవసరమైతే అందుకు అవాస్తవాలూ అతిశయోక్తులైనా ప్రధానంగా ప్రచారంలో పెట్టడం నిత్యకృత్యమైంది. ఒకరు అధికారంలో వుంటే మరో వైపు మీడియాపై దాడి చేయడం పరిపాటిగా మారింది. ఇతర వాణిజ్య పోకడలు, సంచలనాలు, సెలబ్రిటీ ముచ్చట్లు సరేసరి. ప్రజాశక్తి వీటికి అతీతంగా ప్రజల ప్రయోజనాలే పరమావధిగా 'ప్రతి అక్షరం ప్రజల పక్షం' అంటూ ప్రస్థానం సాగిస్తున్నది.

ప్రత్యామ్నాయ మార్గంలో...

ఒకప్పుడు మిగిలిన వాటిని మెయిన్‌స్ట్రీమ్ పత్రికలనీ, ప్రజాశక్తి, విశాలాంధ్ర వంటి వాటిని వామపక్ష పత్రికలనీ అనేవారు. అయితే ఇప్పుడు ప్రజాశక్తి వంటివి మెయిన్ స్ట్రీమ్ కాగా చాలా పత్రికలు ఆ యా పాలక పార్టీల స్ట్రీమ్‌లుగా మారాయి. విశ్వసనీయత, స్వతంత్రత, నిస్పాక్షికతలకు కట్టుబడి ప్రజల పక్షంగా యథార్థాన్ని ఆవిష్కరించే బాధ్యత పూర్తిగా మోస్తున్నవి ఇవే. అందుకే ప్రజలు వాటిని ఆదరిస్తారు, గౌరవిస్తారు. అయితే రానురాను ఈ సవాళ్లు తీవ్రమవుతాయే గాని తగ్గవు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మీడియా అనేది పాలకులకు సింహస్వప్నంగా వుంటుంది. ఉదాహరణకు మోడీ అధికారంలోకి రావడానికి ఉపయోగించుకున్న సోషల్ మీడియానే ప్రజాస్వామిక వాదులు ఉపయోగించుకుంటే అపరాధమైపోతున్నది. సుప్రీంకోర్టు ముందు మీడియాకు సంబంధించిన కేసులు ఎన్ని వున్నాయో చెప్పడం కష్టం. ఇలాంటి సమయంలో కాలపరీక్షకు నిలిచిన ప్రజాశక్తి వంటి పత్రికలను పటిష్టం చేసుకోవడం, మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎంతైనా అవసరం. ఎంతో జటిలమైన గత సవాళ్లను అధిగమిస్తూ నాలుగు దశాబ్దాలు నడిచిన ప్రజాశక్తి చరిత్రకు తోడు ఇప్పుడు ఎందరో కొత్త శక్తుల చేరిక, చైతన్యవంతమైన ఉద్యమాల కదలిక అందుకు విశ్వాసమిస్తుంది. ఇటీవలి ఎన్నికలలో లౌకిక శక్తుల బలం పెరగడం, కేంద్రంలో మోడీ దూకుడుకు ప్రజలు పగ్గాలు వేయడం ప్రజాశక్తి వంటి పత్రికల కృషికి ఉత్సాహమిచ్చే పరిణామం. అయితే మతతత్వ శక్తుల ప్రమాదాన్ని గానీ, కార్పొరేట్ ఆధిపత్య వ్యూహాలను గానీ ఏ మాత్రం తక్కువ అంచనా వేయడానికి లేదు. మీడియాపై ఇవే ప్రత్యేకంగా పిడికిలి బిగిస్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో గూగుల్ ట్రంప్‌ను బలపరుస్తున్నట్టు ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆరోపించడం చూస్తున్నాం. ఇక అభ్యుదయ ఉద్యమాలు, సామాజిక న్యాయం కోరే శక్తుల సవాళ్లు మరెంత తీవ్రంగా వుంటాయో వేరే చెప్పాలా? అందులోనూ తెలుగు నాట ప్రాంతీయ పార్టీలు కేంద్రంలోని మతతత్వ బిజెపితో ప్రత్యక్ష పరోక్ష స్నేహానికి అర్రులు చాస్తున్న దృష్ట్యా ప్రజాస్వామ్య హక్కులను స్వేచ్ఛను కాపాడుకోవడం మరింత కీలకమవుతుంది. ఇలాంటి తరుణంలో ప్రజాశక్తి మార్గం ప్రజాస్వామ్య ఉద్యమాలకు ప్రజల శ్రేయస్సుకు మరింత ఆలంబనం అవశ్యం అవుతాయి.

స్తంభించిన మైక్రోసాఫ్ట్ - గ్లోబల్ పాఠాలు

న్యూస్

బప్పా సిన్హా

జులై 19న ప్రపంచ వ్యాప్తంగా ఐ.టి సర్వీసులు హఠాత్తుగా ఆగిపోయాయి. ప్రపంచవ్యాప్తంగా 85 లక్షల మైక్రోసాఫ్ట్ కంప్యూటర్లు పనిచేయడం మానేశాయి. విమానాలు, బ్యాంకులు, రైళ్లు, ప్రభుత్వ వ్యవహారాలు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. గ్రౌండ్ స్ట్రైక్ అనే సైబర్ సెక్యూరిటీ ప్రొవైడర్ విడుదల చేసిన తప్పుడు అప్‌డేట్ వల్ల, మైక్రోసాఫ్ట్ విండోలు క్రాష్ అయి 'బ్లూ స్క్రీన్ డెత్' అనే ఒక సాంకేతిక సమస్యలో ఇరుక్కుపోయాయి. అయితే ఇవేవీ శత్రు హ్యాకర్లు చేసిన దాడులు కావు. ఏ సంస్థ అయితే సైబర్ సెక్యూరిటీ ఇవ్వాలో... ఆ సంస్థ సృష్టించిన పరిస్థితే ఇది.

2010లో కూడా ఇలాగే జరిగింది. ఈ గ్రౌండ్ స్ట్రైక్ కంపెనీకి ఇప్పుడు సీఈఓ గా ఉన్న జార్జ్ కర్ట్జ్, అప్పుడు యాంటీ వైరస్ కంపెనీ 'మెకాఫే' సీటీవో గా ఉన్నాడు. మెకాఫే విడుదల చేసిన ఒక అప్‌డేట్ వల్ల మిలియన్ల సంఖ్యలో మైక్రోసాఫ్ట్ విండోలు ప్రపంచ వ్యాప్తంగా క్రాష్ అయ్యాయి. చివరికి మెకాఫే ని అమ్మేయాల్సి వచ్చింది. అప్పుడు జార్జ్ కర్ట్జ్ రాజీనామా చేసి, ప్రారంభించిన మరో సైబర్ సెక్యూరిటీ కంపెనీనే ఈ క్రౌడ్ స్ట్రైక్. 2010 వైఫల్యాల నుండి ఈ కర్ట్జ్ గాని, మైక్రోసాఫ్ట్ కానీ, నియంత్రణ సంస్థలు గాని ఏమీ నేర్చుకున్నట్టు లేదు. తప్పులు చేసుకుంటూ పోయి నేటి సంక్షోభానికి కారణమయ్యారు.

క్లౌడ్ స్ట్రైక్‌కు రాజకీయ వర్గాల్లో, ఇంటెలిజెన్స్ వ్యవస్థలలో శక్తివంతులైన స్నేహితులు ఉన్నారు. రష్యా తమ ఈ మెయిళ్లను హ్యాక్ చేసి, అమెరికన్ ఎన్నికలలో జోక్యం చేసుకున్నదని...2016లో అమెరికా ఎన్నికల్లో పోటీ చేసిన హిల్లరీ క్లింటన్ ఆరోపించగా అందుకు తమ దగ్గర రుజువులు ఉన్నాయని 'క్లౌడ్ స్ట్రైక్' ప్రకటించింది. కానీ ఈ ఆరోపణలు పూర్తిగా తప్పని తేలింది. అంతేకాక హిల్లరీ క్లింటన్ ఎన్నిక ప్రచార ధోరణులు, లిబియా ఆక్రమణలో ఆమె పాత్ర, వికీలీక్స్ ద్వారా బయటకు వచ్చి అపఖ్యాతి పాలైంది. క్లౌడ్ స్ట్రైక్ సీఈవో చైనా మీద కూడా హ్యాకింగ్ ఆరోపణలు చేశాడు. ఇజ్రాయిలీ సైబర్ సెక్యూరిటీ సంస్థలతో క్లౌడ్ స్ట్రైక్‌కు బలమైన సంబంధాలే ఉన్నాయని గమనించాలి. క్లౌడ్ స్ట్రైక్ నిర్లక్ష్యాన్ని, తప్పులను నియంత్రణ అధికారులు సహించి, రక్షించడానికి ఇటువంటి రాజకీయ, ఇంటెలిజెన్స్ వ్యవస్థలతో వున్న సంబంధాలే కారణం కావొచ్చు. ఇంతటి విపత్తు జరిగినా, ఒప్పందం ప్రకారం, తీసుకున్న ఫీజులను వెనక్కి చెల్లిస్తే చాలు. 'జులై 19 సంఘటన వల్ల చేయాల్సి వచ్చే అదనపు పనికి" ఉద్యోగులకు పది డాలర్ల ఉబర్ ఆహారపు గిఫ్ట్ కార్డులను ప్రకటించేంత తేలికగా దీన్ని తీసుకున్నారు.



> **సాఫ్ట్‌వేర్ క్లౌడ్ సర్వీసుల కోసం మనం అమెరికా గుత్తాధిపత్య కంపెనీలైన మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్, అమెజాన్, ఫేస్‌బుక్ లపై దాదాపు పూర్తిగా ఆధారపడుతున్నాం. ఒకే ఒక తప్పుడు అప్‌డేట్ మొత్తం ప్రపంచాన్నే కుదిపివేసిన పరిస్థితుల్లో ఉన్నాం. ప్రభుత్వ సేవలు, బ్యాంకింగ్, టెలి కమ్యూనికేషన్లు, ఆరోగ్యం, విద్యుత్ సరఫరా, విమానాలు, రైళ్లు ... లాంటి కీలక రంగాలన్నీ కూడా ఈ కంపెనీలపై ఆధారపడి ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. పూర్తిగా అమెరికా నియంత్రణలో ఉన్న ఈ కంపెనీలు, దేశ సార్వభౌమత్వానికి కూడా ముప్పుగా మారగలవు.**

తన సాఫ్ట్‌వేర్‌తో పునరావృతమవుతున్న ఈ సంఘటనలకు మైక్రోసాఫ్ట్ కూడా బాధ్యత నుంచి తప్పించుకోలేదు. ఈ క్రౌడ్ స్ట్రైక్ అప్‌డేట్ అనేది లైనెక్స్ సర్వర్లను దెబ్బ తీయలేకపోయింది. వ్యక్తిగత కంప్యూటర్లపై గుత్తాధిపత్యం కలిగిన ఖరీదైన మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ కంటే, ఉచితంగా లభించే లైనెక్స్ ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ సుస్థిరంగా, సురక్షితంగా ఉందని రుజువైంది. మైక్రోసాఫ్ట్‌లా కాకుండా, లైనెక్స్ ఎప్పటికప్పుడు బహిరంగంగా పరీక్షింపబడే ఓపెన్ సోర్స్‌గా ఉండటం వల్లే ఇది సాధ్యమైంది.

సాఫ్ట్‌వేర్ క్లౌడ్ సర్వీసుల కోసం మనం అమెరికా గుత్తాధిపత్య కంపెనీలైన మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్, అమెజాన్, ఫేస్‌బుక్ లపై దాదాపు పూర్తిగా ఆధారపడుతున్నాం. ఒకే ఒక తప్పుడు అప్‌డేట్ మొత్తం ప్రపంచాన్నే కుదిపివేసిన పరిస్థితుల్లో ఉన్నాం. ప్రభుత్వ సేవలు, బ్యాంకింగ్, టెలి కమ్యూనికేషన్లు, ఆరోగ్యం, విద్యుత్ సరఫరా, విమానాలు, రైళ్లు ... లాంటి కీలక రంగాలన్నీ కూడా ఈ కంపెనీలపై ఆధారపడి ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. పూర్తిగా అమెరికా నియంత్రణలో ఉన్న ఈ కంపెనీలు, దేశ సార్వభౌమత్వానికి కూడా ముప్పుగా మారగలవు.

అమెరికా నిఘా వ్యవస్థలైన అమెరికా నేషనల్ సెక్యూరిటీ ఏజెన్సీ, సిఐఎ...సాంకేతిక ఉత్పత్తులలోకి ఎంత విస్తృతంగా చొచ్చుకొని పోయి ఉన్నాయనేది వికీలీక్స్ 2013 లోనే బట్టబయలు చేసింది. బుల్‌రన్ అనే కోడ్ పేరుతో, ఎన్ఎస్ఏ ఒక ప్రోగ్రాం నడిపింది. సాంకేతిక ఉత్పత్తుల, భద్రతా వ్యవస్థలను ఛేదించడం దీని లక్ష్యం. దీనికోసం ఈ కంపెనీలతో కలసే, 'బ్యాక్ డోర్' అనే పేరుతో ఒక నిఘాను, దాదాపు ప్రతి సాంకేతిక ఉత్పత్తిలో చొప్పిస్తారు. కమ్యూనికేషన్ పరికరాలు, ఎంక్రిప్షన్ సాఫ్ట్‌వేర్‌లు, మైక్రోసాఫ్ట్, యాపిల్, ఆండ్రాయిడ్ లాంటి ఆపరేటింగ్ వ్యవస్థలు, గూగుల్, అమెజాన్, ఫేస్‌బుక్ లాంటి బహుళ ప్రాచుర్యంలో ఉన్న సేవలు...అన్నింటిలోనూ ఈ 'బ్యాక్ డోర్' ప్రవేశ పెట్టబడి ఉంటుంది. అమెరికా నిఘా వ్యవస్థల కోసం ఈ బ్యాక్ డోర్ పని చేస్తూ ఉంటుంది.

ప్రపంచవ్యాప్తంగా సిఐఎ చేస్తున్న హ్యాకింగ్ విస్తృతిని వికీలీక్స్ 2017లో 'వాల్ట్ 7' పత్రంలో వెల్లడి చేసింది. వేల సంఖ్యలో ఉన్న సిఐఎ హ్యాకింగ్ వ్యవస్థలు, ట్రోజన్లు, వైరస్ లతో ఐఫోన్, ఆండ్రాయిడ్ లాంటి స్మార్ట్ ఫోన్లను, ఐపాడ్లను, స్మార్ట్ టీవీలను తమ నియంత్రణలోకి తీసుకొంటున్నాయి. మనం మాట్లాడేవన్నీ రహస్యంగా వినే ఆయుధాలుగా మారుతున్నాయి. కొత్తగా వస్తున్న కార్లు, ట్రక్కులలో ఉండే నియంత్రణా వ్యవస్థలలో కూడా వీటిని చొప్పించవచ్చు. సిఐఎ ఇంకొన్ని కొత్త పద్ధతులను కూడా అభివద్ధి చేసింది. స్మార్ట్ ఫోన్లను హ్యాక్ చేసి...వాట్సాప్, సిగ్నల్, టెలిగ్రామ్ లలో ఉన్నట్టు చెప్పబడుతున్న భద్రతా వ్యవస్థలను కూడా అధిగమించే కొత్త పద్ధతులు ఇవి. విండో ఆపరేటింగ్ సిస్టమ్‌ల మీద, ఇంటర్నెట్ రౌటర్ల పైన కూడా దాడి జరుగుతోంది.

ఈరోజు రష్యాపై అమెరికా విధించినట్టుగా చటుక్కున ఆర్థిక ఆంక్షలు, విధించడమే కాదు. డిజిటల్ వ్యవస్థలను కూడా స్తంభింపజేస్తోంది. తద్వారా దేశాలను లొంగదీసుకుంటున్నది. టెక్నాలజీకున్న కీలక ప్రాధాన్యత రీత్యా దేశాల స్వతంత్రత నిలబడాలంటే దేశీయంగా, స్థానికంగా టెక్నాలజీ వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవడం ఒకటే మార్గం.

('పీపుల్స్ డెమోక్రసీ' నుండి స్వేచ్ఛానుసరణ)

అభిప్రాయం

నరకాలుగా మారుతున్న నగరాలు

ఢిల్లీ నడిబొడ్డున పేరు మోసిన ఒక కోచింగ్ సెంటర్‌లో వరద నీటిలో మునిగి ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. సివిల్ సర్వీసు పరీక్షలకు మంచి కోచింగ్ సెంటర్‌గా ఆ సంస్థకు దశాబ్దాల చరిత్ర ఉంది. రాజధాని నగరంలో ఉన్న ఆ సెంటరు నిబంధనలకు వ్యతిరేకంగా భవనం బేస్‌మెంట్‌లో లైబ్రరీ నిర్వహిస్తోంది. విద్యార్థులు ముగ్గురూ అందులో చిక్కుకుని మరణించిన వారే. ఎన్నో ఆశలతో, ఫీజులకు ఎంతో ధనం వెచ్చించి ఆ సంస్థలో చేరిన విద్యార్థులు...సంస్థ నిర్వాహకుల అత్యాశ, అధికారుల అలసత్వం, అవినీతి, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జీవితాల్ని కోల్పోయారు. బేస్‌మెంట్‌ని పార్కింగు కోసం లేదా స్టోర్‌రూమ్‌గా మాత్రమే వినియోగించాలని ఒక నిబంధన. దాన్ని లైబ్రరీగా మార్చి సొమ్ము చేసుకోవడం ఆ సంస్థ కక్కుర్తి. అలా ప్రాణాపాయం కలిగే అవకాశం ఉన్నా, నిబంధనల్ని అతిక్రమించినా పట్టనట్టు వ్యవహరించడం, లేదా లంచాలు తిని ఉపేక్షించడం నగర పాలక సంస్థ నిర్వాకం. ఆ సెంటరులోకి వరద నీరు ఒక్క ఉదుటున చేరడానికి కారణం యథేచ్ఛగా అక్రమ కట్టడాల్ని అనుమతించడం. డ్రయినేజీ వ్యవస్థ పూడుకునేంత వరకూ వదిలేయడం. అయితే ఈ సమస్య ఆ ఒక్క కోచింగ్ సెంటర్‌కో, ఆ ప్రాంతానికో పరిమితం కాదు. పుట్టగొడుగుల్లా నగరమంతా వ్యాపించిన కోచింగ్ సెంటర్లు, వాణిజ్య సముదాయాలు, అక్రమ కట్టడాలు...ఇలా పట్టణ ప్రణాళికల్ని తుంగలో తొక్కేవి కోకొల్లలు. అలాగే ఢిల్లీ ఒక్కటే ఇలా దయనీయంగా లేదు. దేశంలో ప్రతీ పట్టణమూ ఇలా అఘోరిస్తున్నవే. కొంచెం ఎక్కువ వర్షం పడితే చాలు. డ్రయినేజి పొంగి మునిగిపోయేవే. కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థలు వారు చేయాల్సిన పనులు వారు చేస్తే చాలు. ప్రమాద రహిత పట్టణాలు తయారవుతాయి. పట్టణ ప్రణాళికలు ఎలాంటి పరిస్థితిలోనూ అతిక్రమించ కూడదు. దురదృష్టవశాత్తూ నిబంధనల్ని అతిక్రమించడానికి రాజకీయాలు ప్రాతిపదిక అవుతున్నాయి. వాటి సాకు చెప్పి అధికారులు తప్పించుకోవడమో, సొమ్ము చేసుకుని పరిస్థితిని వాడుకోవడమో జరుగుతూ వస్తోంది. ఈ పరిస్థితి మారనంత వరకూ నగరాలు నరకాలుగానే ఉంటాయి. స్మార్ట్ నగరాలు, ఆధునిక నగరాలు అన్నవి ఆదర్శంలోనే మిగిలి పోతాయి. రాష్ట్రాలకు పెరుగుతున్న ఒత్తిడి మేరకు కేంద్రం నిధులు, మార్గదర్శకాలు ఇవ్వాలి. రాష్ట్రాలు పట్టణాల అభివృద్ధిని దగ్గరగా పర్యవేక్షించాలి. నగర పాలక సంస్థలు సమర్థవంతంగా వ్యవహరించాలి. అయితే అలాంటి రోజులు దగ్గరలో కనబడడం లేదు. ఢిల్లీ విషాదానికి స్పందనగా అక్కడి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం రాజకీయ దాడులు చేసుకుంటున్నాయి. ఒక వ్యక్తిని అరెస్టు చేశారట. ఆయన ఆ కోచింగు సెంటరు ముందు కారు నిలిపి ఉంచడం వల్ల వరద నీరు అటువైపు మళ్లి బేస్‌మెంట్‌లో చేరి ప్రమాదానికి కారణమైనందుకు. సంస్థ నిర్వాహకులైన పెద్ద తలకాయల జోలికి ఎవరూ వెళ్ళలేదు. ఇదీ ప్రస్తుత స్థితి.

- డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం, విజయనగరం.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు

- మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

హంద్రీనీవా కెనాల్ కింద అనంతపురం జిల్లాలో ఎక్కడా ఇబ్బంది లేకుండా చివరి ఆయకట్టు వరకూ నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. బుధవారం అనంతపురం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు, నీటి కేటాయింపులు, పెండింగ్ పనులు, సమస్యలపై హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువకు ఈ ఏడాది శ్రీశైలం జలాశయం నుంచి జిల్లాకు 40 టిఎంసిల నీటిని కేటాయించారన్నారు. నీటిని తీసుకురావడం ఇప్పటికే ఆలస్యం కాగా, త్వరగా జిల్లాకు నీటిని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు పరిధిలో పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏవైనా సమస్యలున్నా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు ప్రిలిమినరి స్టేటస్, పెండింగ్ పనుల స్టేటస్, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హంద్రీ నీవా సిఇ నాగరాజ, ఎస్ఇ దేశే నాయక్, ఇఇలు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

నార్పల : అనంతపురం జిల్లా నార్పల మండలంలోని నల్లపు రెడ్డిపల్లి గ్రామంలో బుధవారం సాయంత్రం విద్యుదాఘాతంతో రైతు రమణారెడ్డి(55) మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... తన పొలంలో ఫీజు వేయడానికి విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసుకొని రమణారెడ్డి ఎక్కారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై తీగలపైనే మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాడిమర్రి పోలీసులు తెలిపారు. సాయంత్రం అయినా రైతు మృతదేహాన్ని కిందకు దింపకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆందోళన అనంతరం రాత్రి ఆరుగంటలకు మృతదేహాన్ని విద్యుత్ అధికారులు కిందకు దించారు.

కందిపప్పు లేనట్టే..!

- పంచదారదీ అదే పరిస్థితి
- ఈనెలలో రూరల్‌లో కేవలం బియ్యమే
- అర్బన్‌లో గోధుమపిండి, రాగులు పంపిణీ



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌లో ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డుదారులకు ఏడాదికి పైగా రాయితీ కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది. రెండు నెలలుగా పంచదార ఇవ్వడం లేదు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం ఆగస్టు నుంచి బియ్యం, కందిపప్పు, పంచదార సరుకులను అందించాలని నిర్ణయించినా టెండర్ల ప్రక్రియలో జాప్యం కావడంతో, ఈసారి అన్ని సరుకులూ అందే పరిస్థితి కనిపించడం లేదు. అర్బన్‌లో బియ్యంతో పాటు రాగులు, గోధుమపిండి ఇవ్వనున్నారు. రూరల్ ప్రాంతాల్లో కేవలం బియ్యం మాత్రమే అందించనున్నారు. సరుకుల పంపిణీపై జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారులకు ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది.

శ్రీకాకుళం జిల్లాలో 1603 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,71,803 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 19,77,698 మంది లబ్ధిదారులు సభ్యులుగా ఉన్నారు. జిల్లాలోని 422 మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండియు) వాహనాల ద్వారా ఈనెలలో సరుకులను అందించనున్నారు. బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార అందిస్తారని అంతా భావించినా జిల్లాకు సరుకులు రాలేదు. పౌర సరఫరాల సంస్థ రాష్ట్ర ఉన్నతాధికారులు సరుకుల కోసం టెండర్లను ఆహ్వానించినా, సకాలంలో పూర్తి కాలేదని తెలుస్తోంది. దీంతో ఎప్పటి మాదిరిగానే కార్డులో ఎంతమంది సభ్యులు ఉంటే అన్ని కేజీల బియ్యం ఇవ్వనున్నారు. అర్బన్ ప్రాంతంలో మాత్రం బియ్యంతో పాటు రాగులు, గోధుమపిండి ఇవ్వనున్నారు. ప్రతి కార్డుపై కేజీ చొప్పున అందించనున్నారు. అదేవిధంగా బియ్యం మూడు కేజీలను తగ్గించి దాని స్థానంలో అంతే మొత్తంలో రాగులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

కందిపప్పు ధరలు పైపైకి

ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పంపిణీ నిలిచిపోవడంతో కందిపప్పు ధరలు క్రమేణా పెరుగుతున్నాయి. ఎండియు వాహనాల ద్వారా గతంలో రాయితీపై ప్రభుత్వం కేజీ రూ.67కే కందిపప్పు అందించేది. ఇప్పుడు పంపిణీ చేయకపోవడంతో మార్కెట్‌లో కందిపప్పు ధర అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుతం కందిపప్పు ధర రూ.180 నుంచి రూ.200కు చేరింది. పంచదార పరిస్థితి అలానే ఉంది. రాయితీపై అరకేజీ పంచదార రూ.17కే పేదలకు దక్కేది. ఇప్పుడు మార్కెట్‌లో రూ.24 వరకు పెరిగింది.

ఎండియుల కొనసాగింపుపై సందిగ్ధత

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేసేందుకు మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎండియు) వ్యవస్థను 2021, ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. రేషన్ డోర్ డెలివరీ కోసం ప్రభుత్వం రూ.5.83 లక్షల విలువైన వాహనాలను అందించింది. వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేసేందుకు జిల్లాలో 422 మంది ఆపరేటర్లను నియమించారు. డోర్ డెలివరీ చేసే ఆపరేటర్‌కు తొలుత ప్రభుత్వం రూ.16 వేలు వేతనంగా నిర్ణయించింది. వాహనాలకు డ్రైవర్లుగా మాత్రమే పనిచేయాల్సి ఉంటుందని చెప్పిన ప్రభుత్వం తర్వాత వారితో తూకం, ఈ-పాస్ మిషన్‌లో వివరాలు నమోదు తదితర పనులు అప్పగించింది. దీంతో తమకు ఇస్తున్న వేతనం చాలదని అప్పట్లో వారు ఆందోళనకు దిగడంతో వేతనాన్ని రూ.21వేలకు పెంచింది. రేషన్ వాహనానికి సమకూర్చిన రుణానికి వాయిదా సొమ్ముగా రూ.మూడు వేలను జమ చేసుకుంటోంది. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో ఈ వ్యవస్థను రద్దు చేసి, పాత పద్ధతిలోనే రేషన్ దుకాణాల ద్వారా సరుకులను అందిస్తారనే ప్రచారం సాగుతోంది. ఇప్పటికిప్పుడే దీన్ని రద్దు చేసే అవకాశం ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఎండియు వ్యవస్థ నిర్వహణకు గతంలోనే బడ్జెట్ కేటాయింపులు చేసిన నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చి వరకు కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.

సహకార సంఘాల్లో మెక్కినదంతా కక్కిస్తాం

- అవినీతి చేసిన సొమ్మును రికవరీ చేస్తాం
- ఒక్కరోజులో రైతుకు రుణం మంజూరు చేసేలా చర్యలు
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా)

గత ప్రభుత్వంలో సహకార సంఘాల పరిధిలో అవినీతి, అక్రమాలతో మెక్కినదంతా కక్కిస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడలో గల మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆప్కాబ్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అనేకచోట్ల నకిలీ ధ్రువపత్రాలతో రుణాలు, రైతుల పేరుతో అదనపు రుణాలు, అధికారులే బినామీ పేర్లతో రుణాలు పొందిన అంశాలు తన దృష్టికి వచ్చాయన్నారు. సహకార వ్యవస్థను ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. రుణం కోసం రైతులు కాళ్లరిగేలా తిరిగే రోజులు పోవాలని, ఒక్క రోజులో రైతుకు రుణం అందించే విధంగా చర్యలు తీసుకునేందుకు కసరత్తు చేసి త్వరలో ఆ దిశగా చర్యలు ప్రారంభించాలని సూచించారు. రైతు ఆధార్ కార్డుతో మీ భూమి, ఇసి, ఈ-క్రాప్ అనుసంధానం చేసి రుణాల కోసం వచ్చే రైతులకు వేగంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన సహకార సంఘాలను ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఆప్కాబ్-డిసిసిబిల నుంచి సహకార సంఘాల ద్వారా ఈ ఏడాది రూ.38.7 వేల కోట్లు అందించేందుకు అంచనా ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. రుణాలు మంజూరు చేసే క్రమంలో జాప్యం లేకుండా చూడాలని, రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ పంట రుణాలతో పాటు రైతులకు దీర్ఘకాలిక రుణాలు, రైతుల పిల్లల చదువు నిమిత్తం విద్యా రుణాలు, విదేశీ విద్యా రుణాలు మంజూరు చేసేందుకు ఆప్కాబ్ మరింత వేగం పెంచాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఆప్కాబ్ బ్రాంచ్‌ల ఏర్పాటుకు కసరత్తు వేగవంతం చేయాలని, అనుమతులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తక్షణమే దరఖాస్తు చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో మహిళా మండలి (ఎస్‌హెచ్‌జి) రుణాలు, ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన రుణాలు, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన రుణాల మంజూరులో ఆప్కాబ్ బ్రాంచ్‌లు, డిసిసిబిలు తమ సేవలు మరింత విస్తృతం చేయాలని సూచనలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రాయితీ రుణాలతో పాటు హామీ లేని రుణాల మంజూరు గురించి ప్రజలకు అవగాహన పెంచి సాధ్యమైనంత ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆప్కాబ్ ఎమ్‌డి శ్రీనాథ్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

ప్రజాశక్తి- ఓజిలి (తిరుపతి)

ఒకటో తరగతి చదువుతున్న గిరిజన బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రవిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓజిలి మండలం పున్నేపల్లి దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థినిపై 50 సంవత్సరాల కామాంధుడు లైంగిక దాడికి పాల్పడటంతో బాలిక భయంతో కేకలు వేసింది. కుటుంబ సభ్యులకు విషయం తెలియజేయడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులుఅదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

ఎంపిడిఒ కేసులో పలు అనుమానాలు!

ప్రజాశక్తి- నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపిడిఒ వెంకట రమణారావు ఆత్మహత్య కేసులో మరో ట్విస్టు తెరపై కొచ్చింది. ఈనెల 15న ఆయన అదృశ్యంపై కృష్ణా జిల్లా పెనుమలూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎనిమిది రోజుల అనంతరం ఎంపిడిఒ ఈనెల 23వ తేదీన ఏలూరు కాల్వలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన మృతదేహం దొరకడంతో నిర్ధారణ అయిన సంగతి తెలిసిందే. న్యూడ్ వీడియో కాల్స్ గ్యాంగ్ బెదిరింపులకు ఎంపిడిఒ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పలు ఉత్తరాది రాష్ట్రాల అకౌంట్లకు ఎంపిడిఒ నగదు బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ దిశగా పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఎంపిడిఒను బ్లాక్ మెయిల్ చేసిన నిందితుడిని ఎపి పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఎంపిడిఒ రమణారావును బ్లాక్ మెయిల్ చేసింది రాజస్థాన్ బర్కత్‌పుర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి మూడు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం అనంతపురం జిల్లా సింగనమల పోలీసులు వేరే కేసులో సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఎంపిడిఒ కేసులో అతని ప్రమేయం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆ సైబర్ నేరగాడిని కస్టడీకి తీసుకుని విచారణ చేపట్టాలని కృష్ణా జిల్లా పోలీసులు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ గ్యాంగ్‌లో 20 నుంచి 25 మంది ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎపి పోలీసుల కదలికలు గుర్తించి వారంతా పరారైనట్లు తెలుస్తోంది. రమణ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి వారి బెదిరింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని ప్రచారం సాగుతోంది.

విమానాశ్రయ నిర్మాణ సంస్థ తీరుతో రాకపోకలకు ఇబ్బందులు

ప్రజాశక్తి- భోగాపురం (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని సవరవల్లి జాతీయ రహదారి నుంచి జమ్మయ్యపేట వెళ్లే రహదారిలో విమానాశ్రయ నిర్మాణ స్థలం నుంచి వస్తున్న వరద నీటితో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. విమానాశ్రయ నిర్మాణ సంస్థ కనీసం పట్టించుకోవడంలేదని వివిధ గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విమానాశ్రయ నిర్మాణంలో పాత తారు రోడ్డును తొలగించి కొత్తగా విమానాశ్రయ ప్రహరీ నుంచి మట్టి రహదారిని నిర్మించారు. దీనిపై తారు రోడ్డు వేయకపోవడంతో వర్షం పడితే బురదతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 20 రోజుల నుండి ఈ పరిస్థితి ఎదుర్కొంటున్నామని, దీనిపై సంబంధిత విమానాశ్రయ నిర్మాణ సంస్థ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు కౌలువాడ గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కోరాడ తాతారావు తెలిపారు. అధికారులు పట్టించుకోకపోతే తమ నాలుగైదు గ్రామాల ప్రజలందరం విమానాశ్రయ నిర్మాణ సంస్థ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.



అధ్వానంగా ఉన్న రోడ్డును చూపిస్తున్న తాతారావు

విఆర్ఎస్ నీరు విడుదల

ప్రజాశక్తి- మక్కువ (పార్వతీపురం మన్యం జిల్లా)

వెంగళరాయసాగర్ జలాశయం నుండి పంటలకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నీటిని విడుదల చేశారు. జలవనరుల శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మక్కువ మండలంలోని జలాశయం వద్ద బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ప్రతి ఎకరాకు నీటి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ప్రభుత్వం సకాలంలో విత్తనాలు, ఎరువులు అందిస్తుందని చెప్పారు. జైకా నిధులతో ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. హెడ్ వర్క్సులో మట్టికట్ట, రక్షణ గోడ, జనరేటర్ రూమ్, గేట్ల మరమ్మతులు, ప్రధాన కాలువ తూముల మరమ్మతులు చేసినట్లు తెలిపారు. కాలువల్లో 38.545 కిలోమీటర్ల లైనింగ్ పనులకు దాదాపు తొమ్మిది కిలోమీటర్ల లైనింగ్ పనులు చేపట్టినట్లు చెప్పారు. దీనివల్ల అనవసర లీకులు లేకుండా వృథా నీటిని అరికట్టి చివరి భూములకు నీరు సమృద్ధిగా అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు బేబినాయన, బోనెల విజయచంద్ర, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీరు వై.రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు

ఇదీ విఆర్ఎస్ పరిస్థితి

విఆర్ఎస్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.683 టిఎంసిలు. 24,700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయాలి. జలాశయం కింద మక్కువ మండలంలో 14,798 ఎకరాలు, బొబ్బిలి మండలంలో 6178 ఎకరాలు, సీతానగరం మండలంలో 3,724 ఎకరాలు ఉన్నాయి. కుడి ప్రధాన కాలువ ద్వారా 16,150 ఎకరాలకు, ఎడమ ప్రధాన కాలువ ద్వారా 8550 ఎకరాలకు నీరు సరఫరా అవుతుంది. ప్రస్తుతం జలాశయంలో 1.25 టిఎంసిల నీరుంది.

ఇళ్లు కట్టారు.. అప్పుల పాలయ్యారు..!

- 2014-19 మధ్యకాలంలో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు ఎదురుదెబ్బ
- బకాయి బిల్లులు ఇవ్వకుండా పక్కన పెట్టిన వైసిపి ప్రభుత్వం
- ఏలూరు జిల్లాలో రూ.46.69 కోట్ల బకాయి పెండింగ్
- 12,980 మంది లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరం
- పశ్చిమగోదావరి జిల్లాలోనూ అదే పరిస్థితి
- పాతబకాయిలు చెల్లిస్తామని సిఎం హామీతో అంతా ఎదురుచూపు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం సాయం చేస్తుందని ఆశ పడ్డారు. ఉన్న ఇల్లు పడగొట్టి కొత్త ఇల్లు కట్టుకునేందుకు సిద్ధమయ్యారు. సొంతింటి కల నెరవేర్చుకోవాలని ఉవ్విళ్లూరారు. తీరా ఇల్లు నిర్మించుకున్న తర్వాత ప్రభుత్వం నుంచి సాయం రాకపోవడంతో అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులంతా ఆర్థికంగా దెబ్బతిన్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన ఇళ్ల నిర్మాణాలకు తర్వాత అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఏర్పడిన పరిస్థితి ఇది. 2019కి ముందు టిడిపి ప్రభుత్వం ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం అమలు చేసింది. సొంత స్థలం, ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకునే లబ్ధిదారులకు రూ.లక్షా 50 వేలు వరకూ ఇచ్చింది. ఎస్‌సిలకు రూ.రెండు లక్షలు చెల్లించేలా ముందుకు సాగారు. దీంతో అప్పట్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పేదలు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. దాదాపు 32 వేల ఇళ్ల నిర్మాణం జరిగింది. అప్పట్లో నిర్మాణం జరిగిన ఇళ్లలో ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 12,980 ఇళ్లకు ప్రభుత్వం ఇస్తామన్న సాయం అందలేదు. అప్పట్లో ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల్లో కాలయాపన చేసింది. ఇంతలో 2019 ఏప్రిల్‌లో ఎన్నికలు వచ్చేశాయి. దీంతో బిల్లులు నిలిచిపోయాయి. ఎన్నికల్లో వైసిపి గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. టిడిపి ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బకాయిలు ఇస్తామని జిల్లాకు చెందిన గృహనిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు అనేకసార్లు తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు మాత్రం జరగలేదు.

అప్పుల ఊబిలో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు

అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులంతా తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయారు. దాదాపు చేతికి రావాల్సిన రూ.లక్షా 50 వేలు రాకుండా పోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో గడిచిన ఐదేళ్లుగా ఇ ళ్ల నిర్మాణం కోసం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే ఉన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో 2019కు ముందు నిర్మించుకున్న ఇళ్లకు బిల్లులు ఇవ్వాలని లబ్ధిదారులంతా కోరుతూ వస్తున్నారు. ఇటీవల సిఎం చంద్రబాబు గృహనిర్మాణ శాఖపై నిర్వహించిన సమావేశంలో 2014-19 మధ్య నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. ఏలూరు జిల్లాలో 12,980 మంది ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు రూ.46.69 కోట్లు రావాల్సి ఉందని జిల్లా అధికారులు లెక్కలు తేల్చి ప్రభుత్వానికి పంపించారు. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదేస్థాయిలో ఇళ్ల బకాయిలు రావాల్సి ఉంది. ఆ సొమ్ములొస్తే అప్పులు కొంతమేర తీరే అవకాశం ఉందని అంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ముందుగా తమ బకాయిలు విడుదల చేసి ఆదుకోవాలని ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు కోరుతున్నారు. అదే సమయంలో వైసిపి ప్రభుత్వంలో ఇళ్లునిర్మించుకున్న లబ్ధిదారులకు చెల్లించాల్సిన బకాయిలపై టిడిపి కూటమి ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందనే చర్చసైతం నడుస్తోంది. ఏలూరు జిల్లాలో 1698 మంది లబ్ధిదారులకు రూ.4.2 కోట్లు వరకూ బకాయిలు రావాల్సి ఉంది. పశ్చిమలోనూ బకాయిలు పెండింగ్ ఉన్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందా.. వైసిపి ప్రభుత్వం మాదిరిగా పక్కన పెడుతుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. తాము అప్పు చేసి ఇళ్ల నిర్మాణం చేశామని, బకాయిలు చెల్లించాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. కొత్తగా ఇళ్ల నిర్మాణం చేసుకునేవారికి రూ.నాలుగు లక్షలు ఇస్తామని ప్రభుత్వం చెప్పడంపైనా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 2019కు ముందు ఇళ్ల నిర్మాణ బకాయిలకు సంబంధించి ఏలూరు జిల్లా హౌసింగ్ పీడీని వివరణ కోరగా త్వరలోనే బకాయిల చెల్లింపులు జరుగుతాయని తెలిపారు.




సహాయ చర్యల పర్యవేక్షణకు వెళుతున్న

కేరళ మంత్రి వీణా జార్జ్‌కి గాయాలు

తిరువనంతపురం : వయనాడ్‌లో సహాయక కార్యక్రమాలను పర్యవేక్షించడానికి వెళ్తుండగా కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణాజార్జ్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో స్వల్పంగా గాయపడిన ఆమె ప్రస్తుతం మంజేరిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతున్నారు. ఆమె ప్రయాణిస్తున్న కారు ముందుగా మంజేరిలో తొలుత ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఆపై ఓ ఎలక్ట్రిక్ పోల్‌ను ఢీకొట్టి ఆగింది. ఈ ఘటనలో ఆమె ముఖం, చేతులకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటనలో గాయపడిన ద్విచక్ర వాహనదారుడికి కూడా చికిత్స అందిస్తున్నారు.

అంచనాలకు మించిన వర్షపాతం

తిరువనంతపురం : వయనాడ్‌లో విషాదానికి అంచనాలకు మించిన నమోదైన వర్షపాతం కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. సోమవారం ఈ ప్రాంతానికి భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ (64 మి.మీ నుంచి 204 మి.మీ) మాత్రమే జారీ చేసింది. అయితే సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకూ 24 గంటల వ్యవధిలో 500 మీమీ వర్షపాతం నమోదయింది. అది ఐఎండి అంచనాల కంటే చాలా ఎక్కువ. అలాగే సోమవారం రాత్రి వర్షం తగ్గుముఖం పట్టినా... మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి వయనాడ్ అతలాకుతలమైంది. అదే సమయంలో కేరళలోని వడక్కనెచెరిలో కూడా 340 మి.మీ వర్షపాతం నమోదైంది. బహుశా నైరుతి రుతుపవనాల సీజన్ ప్రారంభమైన రెండు నెలల్లో కేరళలో కురిసిన అత్యంత భారీ వర్షాల్లో ఈ వర్షపాతం కూడా ఒకటని ఐఎండి తెలిపింది. ఈ అంశంపై తిరువనంతపురం ఐఎండి డైరెక్టర్ నీతా కె.గోపాల్ మీడియాతో మాట్లాడుతూ... 'ఈ ప్రాంతంలో వర్షపాతం ఈ స్థాయిలో నమోదవుతుందని మేము ఊహించలేదు. ఉత్తర కేరళలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ముందే ఊహించాము. కానీ వయనాడ్‌లో ఊహించని రీతిలో వర్షపాతం నమోదైంది. సోమవారం రాత్రి కురిసిన అత్యధిక వర్షపాతమే ఇంతటి విపత్తుకు దారితీసింది. తీరప్రాంత రాష్ట్రాలలోని వివిధ సముద్ర కారకాల ప్రభావం కారణంగా రాత్రి, తెల్లవారుజామున అధిక తీవ్రతతో కూడిన వర్షపాతం సంభవిస్తుంది. కేరళలో కురిసిన వర్షపాతం, ప్రత్యేకించి రాత్రి సమయాల్లో కురిసే వర్షాన్ని అంచనా వేయడానికి, విశ్లేషించడానికి ఇది దోహదపడుతుంది' అని ఆయన అన్నారు.

విపత్తు బాధితుల కోసం 25 ఇళ్ల నిర్మాణం

- డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ప్రకటన

తిరువనంతపురం: కొండ చరియలు విరిగి పడి సర్వస్వం కోల్పోయినవారి కోసం 25 ఇళ్లను నిర్మించి ఇస్తామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) తెలిపింది. ఇందుకు సంబంధించి యువజన కార్యకర్తల నుంచి విరాళాలు సేకరించనుంది.యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి వాసిఫ్, వికె సరోజ్ బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలకు అనుగుణంగానే విరాళాలను సేకరించి గృహ నిర్మాణం చేపడతామన్నారు. కని విని ఎరుగని విపత్తును ఎదుర్కొన్న వయనాడ్‌లో చేపట్టిన సహాయక చర్యల్లో రాష్ట్ర నలుమూలల నుంచి డివైఎఫ్ఐ కార్యకర్తలు వచ్చి పాల్గొంటున్నారు. సైన్యం బెయిలీ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసింది. బాధితుల వివరాలను తెలుసుకోదలచినవారు ఈ దిగువ కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయవచ్చని అధికారులు తెలిపారు. సంప్రదించాల్సిన నెంబర్లు: 9995220557., 9037277026.,9447732827.

గుజరాత్‌లో పెట్రేగిన సైబర్ మోసగాళ్లు

- హ్యాకింగ్‌కు గురైన హోం మంత్రి, సూరత్ సిపి ఫేస్‌బుక్ ఖాతాలు

అహ్మదాబాద్ : ప్రధాని నరేంద్ర మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో సైబర్ నేరాలు పెచ్చుమీరి పోతున్నాయి. ప్రతి గంటకు 13 నేరాలు నమోదవుతున్నాయి. సోమవారం రాత్రి సాక్షాత్తూ రాష్ట్ర హోం మంత్రి హర్ష్ సంఘ్వి, సూరత్ పోలీస్ కమిషనర్ అనుపమ్ గెహ్లాట్ ఫేస్‌బుక్ ఖాతాలు హ్యాకింగ్‌కు గురయ్యాయి. దీనిని బట్టి ఆ రాష్ట్రంలో సైబర్ నేరాలు ఏ స్థాయికి చేరాయో అర్థమవుతుంది. రాష్ట్రంలో గత సంవత్సరం 1,21,701 సైబర్ మోసాల కేసులు నమోదయ్యాయి. ప్రతి రోజూ 333 కేసులు వెలుగు చూస్తున్నాయి. ఈ నేరాల కారణంగా గత సంవత్సరం రాష్ట్రం రూ.650 కోట్ల మేర ఆర్థికంగా నష్టపోయింది. ఇరువురు ప్రముఖుల ఫేస్‌బుక్ ఖాతాలు హ్యాక్ కావడంతో రాష్ట్ర సైబర్ నేరాల విభాగం రంగంలోకి దిగింది. విచారణ ప్రారంభించింది. హోం మంత్రి సంఘ్వి సామాజిక మాధ్యమంలో స్పందిస్తూ 'నా పేరుతో ఓ ఫేస్‌బుక్ ఐడీ చక్కర్లు కొడుతోంది. మోసగాడి నుండి మీకు ఏదైనా సందేశం వచ్చినా లేదా అభ్యర్థన వచ్చినా స్పందించవద్దు. వెంటనే ఫిర్యాదు చేయండి' అని కోరారు. రాష్ట్రంలో గత సంవత్సరం సైబర్ నేరాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల్లో ఇప్పటికీ 49,220 అపరిష్కృతంగానే ఉన్నాయి. దీనికితోడు సైబర్ మోసగాళ్లు గుజరాత్ పౌరులను మోసం చేసి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. కాగా ఫేస్‌బుక్ ఖాతాల హ్యాకింగ్‌పై కాంగ్రెస్ ప్రతినిధి హిరేన్ బంకర్ స్పందిస్తూ గుజరాత్ ప్రభుత్వంపై విమర్శలు సంధించారు. డిజిటల్ బందిపోట్ల దాడి నుండి హోం మంత్రికే రక్షణ లేకపోతే రాష్ట్రంలోని సాధారణ పౌరులకు భద్రత ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

పతంజలి ఉత్పత్తుల రద్దుపై నిర్ణయం తీసుకోండి : సుప్రీం

న్యూఢిల్లీ : బాబా రాందేవ్ పతంజలి లిమిటెడ్‌కు చెందిన 14 హెర్బల్ ఉత్పత్తుల రద్దుపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఉత్తరాఖండ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని తెలిపింది. సదరు ఉత్పత్తులు తిరిగి షాపుల అమ్మకానికి వచ్చాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ) న్యాయవాది చేసిన ఆరోపణల నేపథ్యంలో జస్టిస్ హిమా కోహ్లీ నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అంశాన్ని పరిశీలించేందుకు ఏర్పాటైన కమిటీ సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం జులై 1న సస్పెన్షన్ ఆర్డర్‌ను రద్దు చేసిందని పతంజలి సంస్థ కోర్టు వివరించింది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం జులై 8న పతంజలికి తాజా నోటీసు జారీ చేసింది. ఈ సమస్య అప్పటి నుంచి ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నది. కాగా, మునుపటి విచారణలో.. సస్పెండ్ చేసిన 14 హెర్బల్ మందులను తొలగించాలని దాని ప్రత్యేక, ఫ్రాంచైజీ దుకాణాలను ఆదేశించినట్టు పతంజలి ఆయుర్వేద అభ్యర్థనను కోర్టు రికార్డ్ చేసింది.

కర్నాటక ఎన్‌డిఎలో లుకలుకలు

- బిజెపిపై కుమారస్వామి కస్సుబుస్సు
- పాదయాత్రపై సంప్రదించలేదని మండిపాటు


బెంగళూరు : కర్నాటక ఎన్‌డిఎలో విభేదాలు తలెత్తాయి. కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి బీజేపీపై కస్సుబుస్సు లాడారు. ముడా కుంభకోణం విషయంలో బీజేపీ చేపట్టిన పాదయాత్రకు తమ పార్టీ మద్దతు ఇవ్వబోదని తెగేసి చెప్పారు. పాదయాత్రపై తమను సంప్రదించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)లో స్థలాల పంపిణీలో జరిగిన అవకతవకలపై పాదయాత్ర చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. దీనిపై మండిపడిన కుమారస్వామి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంలో బీజేపీ తమను ఎన్నడూ సంప్రదించలేదని ధ్వజమెత్తారు. 'మమ్మల్ని విశ్వాసంలోకి తీసుకోవడానికి వారు సిద్ధంగా లేనప్పుడు మేము వారికి ఎందుకు మద్దతు ఇవ్వాలి?' అని ప్రశ్నించారు. పాదయాత్రకు నేతృత్వం వహించేందుకు హాస్సన్ జిల్లాకు చెందిన ప్రీతమ్ గౌడను బీజేపీ ఎంపిక చేయడంపై కుమారస్వామి మండిపడ్డారు. పాదయాత్రకు జేడీఎస్ నైతిక మద్దతు ఇస్తోందన్న వార్తలను కుమారస్వామి తోసిపుచ్చారు. ప్రీతమ్ గౌడ బీజేపీకి చెందిన హాస్సన్ మాజీ ఎమ్మెల్యే. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలలకు సంబంధించిన వీడియోల పెన్‌డ్రైవ్‌లను ప్రచారంలో పెట్టింది ప్రీతమ్ గౌడయేనని జేడీఎస్ ఆరోపిస్తోంది. 'నా మనసు గాయపడింది.

ప్రీతమ్ గౌడ ఎవరు? దేవెగౌడ కుటుంబాన్ని నామరూపాలు లేకుండా చేయాలని ఆయన కంకణం కట్టుకున్నాడు. పాదయాత్ర ఏర్పాట్లపై మాట్లాడేందుకు బీజేపీ నేతలు ప్రీతమ్‌తో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన పక్కనే కూర్చోవాలని నన్ను అడిగారు. మా కుటుంబంలో విషం నింపిన వ్యక్తి పక్కన ఎలా కూర్చుంటాను? పెన్‌డ్రైవ్‌ల పంపిణీకి కారకుడెవరు? నా సహనానికి కూడా ఓ హద్దుంటుంది' అని కుమారస్వామి చెప్పారు. అసలు హాస్సన్‌లో ఏం జరుగుతోందో బీజేపీకి తెలుసా అని ప్రశ్నించారు. 'ఇందుకోసం వారు మా మద్దతు కోరుతున్నారా? హాస్సన్‌లో ఏం జరుగుతోందో వారికి తెలవదా? బాధ్యులెవరు?' అని నిలదీశారు. ముడా కుంభకోణంపై ఆగస్ట్ 3 నుండి 10వ తేదీ వరకూ బెంగళూరు నుండి మైసూరుకు పాదయాత్ర చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతి సహా భూములు కోల్పోయిన వారందరికీ స్థలాలు కేటాయించారు. ఈ కుంభకోణానికి బాధ్యత వహించి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది.

భారీ వర్షాల కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే ఈ సమయంలో పాదయాత్ర చేపట్టడం సరికాదని కుమారస్వామి అభిప్రాయపడ్డారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో పాదయాత్రను ఎవరు స్వాగతిస్తారో తనకు తెలియదని వ్యంగ్యంగా అన్నారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ నేతృత్వంలోని జేడీఎస్ గత సంవత్సరం ఎన్డీఏలో చేరిన విషయం తెలిసిందే. ఈ రెండు పార్టీలు కలిసే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశాయి.

పార్లమెంట్‌లో 'కులం' కలకలం

- అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలపై పెను దుమారం
- భగ్గుమన్న ప్రతిపక్షాలు
- లోక్‌సభలో ఆందోళన... సభ వాయిదా
- ప్రధాని మోడీపై ప్రివిలేజ్ నోటీస్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి ఎంపి, మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ మంగళవారం లోక్‌సభలో రాహుల్ గాంధీని ఉద్దేశించి తమది ఏ కులమో కూడా తెలియని వారు కుల గణన కోరుతున్నారని చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేగాయి. దీనిపై బుధవారం ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. లోక్‌సభలో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ సభ్యులు ఆందోళన చేపట్టారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ కులం గురించి చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రశ్నోత్తరాల సమయంలో లోక్‌సభలో ప్రతిపక్ష ఎంపిలు నినాదాలు హోరెత్తించారు. అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలను రికార్డ్ నుంచి తొలగించాలని కాంగ్రెస్ ఎంపిలు డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర మంత్రికి 'సిగ్గు ఉందా' అని ప్రశ్నించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకుంది. సభను స్పీకర్ ఓం బిర్లా వాయిదా వేశారు.

శివసేన (యుబిటి) నేత అనిల్ దేశాయ్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో ముందుకొచ్చిన కులం అంశం రాజ్యాంగబద్ధంగా అభ్యంతరకరమైనదని అన్నారు. అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలపై నిరసనలు సహజమైనవేనని పేర్కొన్నారు. రాజకీయాలతో సంబంధం లేని వారు సైతం ఇలాంటి అంశాలు పార్లమెంట్‌లో ఎందుకు ప్రస్తావనకు వస్తున్నాయని విస్మయం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. లోక్‌సభలో బిజెపి నేతలు కులాల ప్రస్తావన తీసుకురావడంపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే విస్మయం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో కులాల ప్రస్తావన సరైంది కాదని, రాహుల్ గాంధీని అవమానించేందుకే అనురాగ్ ఠాకూర్ మాట్లాడారని, ఇది సరైంది కాదని చెప్పారు. ఎంతోమంది సీనియర్ బిజెపి నేతలు కులాంతర వివాహాలు చేసుకున్నారని, ఈ విషయం వారు గుర్తెరగాలని అన్నారు. అనురాగ్ ఠాకూర్ అపరిపక్వతతో మాట్లాడితే దాన్ని ప్రధాని మోడీ ట్వీట్ చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పలువురు బిజెపి నేతలు కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్నారు, వారు ప్రతిఒక్కరి కులం గురించి అడుగుతారా..? ఇది తప్పని, దీన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ఖర్గే పేర్కొన్నారు. ప్రధాని మోడీ ట్వీట్‌ను కూడా తాను ఖండిస్తున్నానని చెప్పారు. ఎక్కడ మాట్లాడాలి, దేన్ని సమర్థించాలనేది ప్రధాని మోడీ తెలుసుకోవాలని హితవు పలికారు. మనోభావాలను రెచ్చగొట్టేందుకు ప్రధాని మోడీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. "సామాజిక, ఆర్థిక కుల గణన అనేది ఈ దేశంలోని 80 శాతం మంది ప్రజల డిమాండ్. బిజెపి ఎంపి కులం వ్యాఖ్యలు 80 శాతం ప్రజలను అవమానించడమే" అని ప్రియాంక గాంధీ ఎక్స్ లో ఒక పోస్ట్ లో ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 80 శాతం మందిని ఇప్పుడు పార్లమెంటులో అవమానిస్తారా? అని ఆమె ప్రశ్నించారు.

కుల గణన ప్రాతిపదికన "దేశాన్ని విభజించడానికే" : కిరణ్ రిజిజు

కులం గురించి అడగడంలో తప్పు లేదని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు అన్నారు. రాహుల్ గాంధీ కుల గణన ప్రాతిపదికన "దేశాన్ని విభజించడానికి" ప్రయత్నిస్తుందని ఆరోపించారు. దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. ప్రజలను విభజించే ప్రయత్నాల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్‌ను బిజెపి అనుమతించబోదని అన్నారు. 'కులం' వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి జయంత్ చౌదరి మాట్లాడుతూ "నవ భారతదేశం ఒక కొత్త కలను చూసింది. ప్రతిదానిని కులంతో ముడిపెట్టడం సంకుచిత మనస్తత్వం ఉన్న వ్యక్తులు మాత్రమే చేయగలరు" అని అన్నారు.

ప్రధాని మోడీపై ప్రివిలేజ్ నోటీస్

లోక్‌సభలో కులాల గొడవ నేపథ్యంలో కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రసంగానికి ప్రధాని మోడీ మద్దతిచ్చారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రివిలేజ్ మోషన్‌ను ఇచ్చింది. కాంగ్రెస్ ఎంపి చరణ్‌జిత్ సింగ్ లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు ఈ మేరకు బుధవారం ఫిర్యాదు చేశారు. లోక్‌సభలో అనురాగ్ ఠాకూర్ ప్రసంగాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు.

ఈ వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'నా యంగ్, ఎనర్జిటిక్ సహోద్యోగి అనురాగ్ ఠాకూర్ చేసిన ఈ ప్రసంగాన్ని తప్పక వినాలి. వాస్తవాలు, హాస్యంతో కలగలిసిన ఇది 'ఇండియా' ఫోరం డర్టీ రాజకీయాలను బట్టబయలు చేస్తుంది' అని అందులో ప్రధాని మోడీ పేర్కొన్నారు. లోక్‌సభకు సంబంధించిన వివాదస్పద వీడియో క్లిప్‌ను ప్రధాని మోడీ సోషల్ మీడియాలో షేర్ చేయడంపై కాంగ్రెస్ మండిపడింది. ఇది అత్యంత దుర్వినియోగం, రాజ్యాంగ విరుద్ధమని విమర్శించింది. ప్రధాని మోడీ పార్లమెంటరీ ప్రత్యేకాధికారాలను తీవ్రంగా ఉల్లంఘించారని కాంగ్రెస్ ఆరోపించింది. దీంతో మోడీకి వ్యతిరేకంగా ప్రత్యేక అధికార తీర్మానాన్ని తీసుకొచ్చింది. పంజాబ్ మాజీ సిఎం, జలంధర్ ఎంపి చరణ్‌జిత్ సింగ్ చన్నీ ఈ మేరకు ప్రధాని మోడీపై లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు ఫిర్యాదు చేశారు.

కేరళకు సహాయం ప్రకటించకుండా దిగజారుడు రాజకీయాలా?

- కేంద్రం వైఖరిపై ప్రతిపక్షాల విస్మయం
- జాతీయ విపత్తుగా ప్రకటించాలి : జాన్ బ్రిట్టాస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వయనాడ్ విపత్తుతో అల్లాడుతున్న కేరళకు ఎలాంటి సహాయ ప్రకటన చేయకుండా కేంద్ర ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తుండటంపై ప్రతిపక్ష ఎంపిలు విస్మయం వ్యక్తం చేశారు. వయనాడ్ విపత్తుపై బుధవారం పార్లమెంట్ ఉభయ సభల్లో జరిగిన ప్రత్యేక చర్చలో ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించి కేరళకు ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అయితే ఉభయ సభల్లో జరిగిన చర్చపై స్పందించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. ఈ రెండు డిమాండ్లపై మాత్రం స్పందించలేదు. అమిత్ షా తన సమాధానంలో కేరళను ముందుగానే హెచ్చరించామని, రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని తప్పుడు రాజకీయ ప్రకటన చేయడానికి ప్రయత్నించారు. జూలై 23 నుంచి 26 వరకు కేరళను హెచ్చరించినట్లు అమిత్ షా పేర్కొన్నారు. అయితే జులై 27, 28, 29 తేదీల్లో కేరళకు ఎలాంటి వార్నింగ్ ఇచ్చారో వివరించేందుకు హోంమంత్రి పట్టించుకోలేదు. ఉభయ సభల్లో చర్చలో పాల్గొన్న బిజెపి సభ్యులు కేరళకు సంఘీభావం తెలిపే బదులు రాజకీయం చేసేందుకు ప్రయత్నించారు. దీన్ని అమిత్ షా ప్రోత్సహించారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి : జాన్ బ్రిట్టాస్

రాజ్యసభలో జరిగిన చర్చలో సిపిఎం ఉపనేత జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ వయనాడ్ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. "కేరళకు ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అనుమతించేందుకు సిద్ధంగా ఉండండి. కేరళలో ఎక్కువగా కొండచరియలు విరిగిపడ్డాయి. 2018లో వరదలు వచ్చినప్పుడు కేంద్రం అనుసరించిన విధానాన్ని పునరావృతం చేయొద్దు. ఆ రోజు సైనికులు చేసిన సేవకు కేరళ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత బియ్యం తరువాత వసూలు చేశారు" అని బ్రిట్టాస్ తెలిపారు. కొందరు సభ్యులు ఈ అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సిపిఎం ఎంపి వి.శివదాసన్ అన్నారు. కనీసం మానవత్వం లేకుండా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి విధానం శోచనీయమని, వారికి సరైన రాజకీయాలు తెలియవని విమర్శించారు. ప్రత్యేక సహాయానికి కేంద్రం సిద్ధంగా ఉండాలని శివదాసన్ సూచించారు. వాతావరణ హెచ్చరికల కోసం ఆధునిక రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిపిఎం ఏఏ రహీమ్ కోరారు. జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ఆర్థిక సహాయాన్ని అనుమతించాలని రహీమ్ అన్నారు.

బిఎస్‌ఎఫ్‌లో ఖాళీగా ఉన్న 10,145 పోస్టులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిఎస్ఎఫ్‌లో 10,145 పోస్టులు ఖాళీలు ఉన్నాయని కేంద్ర హోం సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. రాజ్యసభలో సిపిఎం ఎంపి ఎఎ రహీం అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. 2024 జూలై 1 నాటికి గ్రూప్ ఏ (గెజిటెడ్ ఆఫీసర్స్) పోస్టులు 387, గ్రూప్ బి (సబార్డినేట్ ఆఫీసర్స్) 1,816, గ్రూప్ సి (ఇతర ర్యాంకులు) 7,942 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

2,944 ఆలిండియా సర్వీసు పోస్టులు ఖాళీలు

దేశంలో 2,944 ఆలిండియా సర్వీసు పోస్టులు ఖాళీలు ఉన్నాయని కేంద్ర జితేంద్ర సింగ్ తెలిపారు. లోక్‌సభలో ఒకప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు.
దేశంలో నాలుగేళ్లలో 72,157 పాఠశాలలు మూసివేత

13,643 ప్రైవేట్ పాఠశాలలు పెరుగుదల

దేశంలో 2017-18నుంచి 2021-22 వరకు మూడేళ్లలో 72,157 పాఠశాలలు మూసివేసినట్లు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో సిపిఎం ఎంపి ఎఎ రహీం అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలు 13,643 పెరిగాయని తెలిపారు.

యుఎపిఎ కేసుల్లో పెరుగుదల

యుఎపిఎ కేసుల్లో పెరుగుదల నమోదు అవుతోంది. ఈ విషయాన్ని రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లెక్కల స్పష్టం చేస్తోన్నాయి. 2020లో 796, 2021లో 814, 2022లో 1,005 యుఎపిఎ కేసులు నమోదు అయ్యాయి. రాజ్యసభలో కేంద్ర హోం సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు.

'జనగణన' ధ్యాస ఉందా?

- మోడీ సర్కార్‌ను ప్రశ్నించిన సోనియాగాంధీ
- పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయి
- అయితే అతి విశ్వాసం పనికి రాదు
- సిపిపి భేటీలో ఎంపిలకు సోనియా దిశ నిర్దేశం



కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సిపిపి) సమావేశంలో నివాళుల్పరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జనగణన నిర్వహించాలనే ధ్యాస ఉందా..? అని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ ప్రక్రియ 2021లో జరగాల్సి ఉండగా, ఇంతవరకూ జనగణనను కేంద్ర ప్రభుత్వం చేపట్టలేదని, అసలు ఆ ఉద్దేశమే ఉన్నట్టు కనిపించడం లేదని విమర్శించారు. జనాభా లెక్కల సేకరణలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యంతో దేశంలో జనాభా ఎంతో తెలియకుండా పోతుందన్నారు. దీనితో పాటు జాతీయ ఆహార భద్రతా చట్టం కింద 12 కోట్ల మంది, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారు ఎలాంటి ప్రయోజనాలకు నోచుకోలేదని పేర్కొన్నారు. బుధవారం నాడిక్కడ పాత పార్లమెంట్ భవన్‌లోని సెంట్రల్ హాల్‌లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సిపిపి) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తో పాటు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలు హాజరయ్యారు. సోనియాగాంధీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతులకు సంతాపం తెలియజేశారు. అంతా లేచి నిలబడి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ నేతలు చర్చించారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ మాట్లాడుతూ వయనాడ్ ఘటన హృదయాలను కలిచి వేస్తున్నదని వ్యాఖ్యానించారు. ఈ క్లిష్ట సమయంలో బాధితులకు అండగా నిలువాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని అన్నారు.

బిజెపి విభజన రాజకీయాలను ప్రజలు తిరస్కరించినా మోడీ ప్రభుత్వంలో ఎలాంటి మార్పు రాలేదని సోనియాగాంధీ విమర్శించారు. ఎన్నికల్లో ఎదురుదెబ్బ తర్వాత మోడీ సర్కార్ పాఠాలు నేర్చుకుంటుందని అనుకున్నామని, కానీ ఇప్పటికీ వారు సమాజాన్ని వర్గాలవారీగా విభజించి భయం, శత్రుత్వ వాతావరణాన్ని వ్యాప్తి చేసే విధానానికి కట్టుబడి ఉన్నారని విమర్శించారు. కొన్ని వారాలుగా ఒక్క జమ్మూ ప్రాంతంలోనే కనీసం 11 ఉగ్రదాడులు జరిగాయన్నారు. ఈ దాడులు జమ్మూ కశ్మీర్‌లో అన్నీ బాగానే ఉన్నాయని మోడీ ప్రభుత్వం చేస్తున్న వాదనలను అపహాస్యం చేస్తున్నాయ న్నారు. మణిపూర్‌లో పరిస్థితులు ఇప్పుడే మెరుగుపడే సూచనలు కనిపించడం లేదన్నారు.

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులు, యువత డిమాండ్లను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. కీలకమైన అనేక రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవని అన్నారు. నిరుద్యోగిత, ద్రవ్యోల్బణంతో కోట్లాది మంది ప్రజానీకం అతలాకుతలమవుతున్నారని, వాటి విషయం బడ్జెట్‌లో పట్టించుకోలేదని విమర్శించారు. అదేవిధంగా కాన్వర్ యాత్రపై సరైన సమయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుందన్నారు. విద్య విషయంలో ఎన్‌డిఎ సర్కారు తీరును ఆమె తప్పుపట్టారు. గడిచిన పదేళ్లుగా ఎన్‌డిఎ సర్కారు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు.

దేశ ప్రజలు కాంగ్రెస్ పట్ల సానుకూలంగా ఉన్నారని అన్నారు. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉన్నప్పటికీ అతి విశ్వాసం పనికిరాదని పార్టీ ఎంపిలకు దిశ నిర్దేశం చేశారు. రానున్న నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించారు. 'రానున్న కొన్ని నెలల్లో నాలుగు రాష్ట్రాల (మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, జమ్మూకాశ్మీర్) అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పరిస్థితులు మనకు అనుకూలంగానే ఉన్నాయి. అయినా, మనం ఆత్మసంతృప్తి చెందకూడదు. అతిగా ఆత్మ విశ్వాసంతో ఉండకూడదు. కష్టపడి పనిచేస్తే ఫలితాలు మనకు అనుకూలంగా వస్తాయి. లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ అదే ఊపును కొనసాగిస్తూ.. మంచి పనితీరును కనబరిచినట్లైతే జాతీయ రాజకీయాల్లో మార్పులు తీసుకురాగలం. నేతలంతా కలసికట్టుగా పనిచేయాలి' అని సూచించారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ వయనాడ్‌కు వెళ్తారని, పరిస్థితిని పరిశీలిస్తారని అన్నారు.

గత బడ్జెట్‌కు ఇది కొనసాగింపే

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గత మధ్యంతర బడ్జెట్‌కు ఇది కొనసాగింపేనని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. బుధవారం రాజ్యసభలో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం ఇచ్చారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు ఈ ఐదేళ్ల కాలం అత్యంత కీలకమని అన్నారు. 2014 నుంచి సబ్ కా సాథ్, సబ్ కా విశ్వాస్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఆ దిశగానే ఈ బడ్జెట్‌ను కూడా రూపొందించామని చెప్పారు. బడ్జెట్‌పై విస్తృత చర్చ జరిగిందని, 83 మంది సభ్యులు బడ్జెట్‌పై జరిగిన చర్చలో పాలుపంచుకున్నారని తెలిపారు. ఈ బడ్జెట్ గతంలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌కు కొనసాగింపేనని చెప్పారు. వృద్ధి, ఉపాధి కల్పన, సంక్షేమం, మూలధన వ్యయం, పెట్టుబడులే ప్రాధాన్యాలుగా బడ్జెట్‌లో ఆయా రంగాలకు పెద్దపీట వేశామని వెల్లడించారు. ఆర్థిక స్థిరీకరణనూ పరిగణనలోకి తీసుకున్నామని తెలిపారు. 2025-26 నాటికి ద్రవ్యలోటును జిడిపిలో 4.5 శాతం దిగువకు తీసుకొస్తామని 2021లో సభలో తాను హామీ ఇచ్చానని ఆ దిశగానే ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఐఎంఎఫ్ గణాంకాల ప్రకారం అంతర్జాతీయ వృద్ధిలో భారత్ వాటా 16 శాతంగా ఉందని, అది మరింత పెరగనుందని ఆమె భరోసా ఇచ్చారు. తయారీ రంగం వృద్ధికి బడ్జెట్‌లో పలు ఊతమిచ్చే చర్యలు చేపట్టామని చెప్పారు. దేశం నుంచి మొబైల్ ఫోన్ల తయారీ భారీగా పెరిగిందని తెలిపారు.

కేజ్రీవాల్, కవిత, సిసోడియా కస్టడీ పొడగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఢిల్లీ మాజీ మంత్రి మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని రౌస్ ఎవెన్యూ (ట్రయల్) కోర్టు మరోసారి పొడగించింది. గతంలో విధించిన కస్టడీ బుధవారంతో ముగిసింది. దీంతో కవితను తీహార్ జైలు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ట్రయల్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరు పరిచారు. ఆమెతో పాటు ఇదే కేసులో తీహార్ జైల్ లో ఉన్న ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియాలను సైతం వర్చువల్ మోడ్ లో కోర్టు ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఇడి, సిబిఐ తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ... కవిత, కేజ్రీవాల్, మనీష్ సిసోడియాల జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కేసు విచారణ కీలక దశలో ఉందని, నిందితులు బయటకు వస్తే సాక్షాలను ప్రభావితం, ఆధారాలను తారుమారు చేసే అవకాశం ఉందని కోర్టుకు నివేదించారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొన్న ధర్మాసనం. సిబిఐ కేసులో ఆగస్టు 9వరకు, ఈడి కేసులో ఆగస్టు 13 వరకు ముగ్గురి జ్యుడీషియల్ కస్టడీ పొడిగిస్తున్నట్టు వెల్లడించారు.

హనియే ఎవరు?



టెహ్రాన్: హనియే 1963లో గాజాలోని ఓ శరణార్థి శిబిరంలో జన్మించారు. 1987లో హమాస్‌లో చేరారు. అందులో అంచెలంచెలుగా ఎదిగి 2017లో అగ్రస్థానానికి చేరారు. హమాస్ వ్యవస్థాపకుడు షేక్ అహ్మద్ యాసిన్‌కు ఆయన అత్యంత సన్నిహితుడు. గాజా నగరంలోని ఇస్లామిక్ యూనివర్సిటీలో హనియా విద్యాభ్యాసం చేశారు. 1980, 1990 దశకాలలో పలు సందర్భాలలో ఇజ్రాయిల్‌లో జైలు జీవితం గడిపారు. 1992లో వందలాది మందితో సహా ఆయనను అరెస్ట్ చేసి గాజా నుండి లెబనాన్‌కు పంపారు. ఆ మరుసటి సంవత్సరమే ఆయన గాజాకు తిరిగి వచ్చారు.

సున్నీ ముస్లిం అయిన హనియే హమాస్‌లో పోరాట శక్తిని పెంచేందుకు తీవ్ర కృషి చేశారు. ఇరాన్‌తో సంబంధాలు నెలకొల్పుకున్నారు. అత్యున్నత స్థాయి ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించి ఇరాన్ వెళ్లి ఖమేనీతో సమావేశమయ్యారు. 2006 ఎన్నికల్లో హమాస్ విజయం సాధించడంతో పాలస్తీనా అథారిటీకి ప్రధాని అయ్యారు. అయితే 2007లో అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ ఆయనను పదవీచ్యుతుడిని చేశారు. ప్రయాణ ఆంక్షల నుంచి తప్పించుకునేందుకు హనియే టర్కీ, ఖతార్ రాజధాని దోహా మధ్య తిరిగేవారు. తన ముగ్గురు కుమారులను ఏప్రిల్ 10న ఇజ్రాయిల్ వైమానిక దాడిలో హతమార్చినప్పుడు పాలస్తీనా పోరాటంలో అసవులుబాసిన యోధుల కన్నా తన కుమారుల మరణం అమితంగా బాధించే విషయం కాదని హనియే అన్నారు.

ఫాసిస్టులకు, ప్రజలకు మధ్య పోరు

- వెనిజులాలో భద్రతా చర్యలు కట్టుదిట్టం
- ఫాసిస్టు శక్తుల ఆగడాలు సాగనివ్వం
- దేశ భద్రతపై సమీక్షా సమావేశంలో మదురో



కారకస్: ఆదివారం నాటి ఎన్నికల్లో ఓడిపోయిన పచ్చి మితవాద శక్తులు, అమెరికా సామ్రాజ్యవాదం అండతో చెలరేగుతున్నాయని, వాటి ఆటలు సాగనివ్వబోమని వెనిజులా అధ్యక్షుడిగా మూడవ సారి ఎన్నికైన నికోలస్ మదురో మంగళవారం నాడు స్పష్టం చేశారు. హింసను ప్రేరేపించేందుకు వారు రకరకాల కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారు. ఇప్పటికే వీరి దురాగతాలకు డజను మందికిపైగా చనిపోయారు. ఇంకా అనేక మంది గాయపడ్డారు. ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లిందని మదురో చెప్పారు. ఇది ఫాసిస్టు శక్తులకు, వెనిజులా ప్రజలకు మధ్య పోరు అని ఆయన ఉద్ఘాటించారు. అంతర్జాతీయ సమాజం మద్దతుతో వెనిజులా ప్రజలు ఈ ఫాసిస్టు శక్తుల ఆగడాలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో శాంతి భద్రతల పరిస్థితిపై మిలిటరీ హై కమాండ్, రక్షణ మండలి, రాష్ట్రాల మండలి ఉన్నతాధికారులు, ప్రతినిధులతో అధ్యక్ష భవనంలో మదురో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశ భద్రత, పౌరుల ప్రాణ రక్షణ కోసం ఆయన ఒక ప్రత్యేక కమిషన్‌ను నియమించారు. బయో సెక్యూరిటీ సిస్టమ్, నేషనల్ ఎలక్టొరల్ కౌన్సిల్, కమ్యూనికేషన్ వ్యవస్థపై ఫాసిస్టుల దాడిని తిప్పికొట్టేందుకు ఒక ప్రత్యేక మెకానిజాన్ని, రష్యా, చైనా అడ్వయిజరీలను ఏర్పాటు చేశారు. ఫాసిస్టు శక్తుల దాడుల్లో చనిపోయిన, గాయపడిన కుటుంబాలను ఆదుకునేందుకు, ఆస్తుల పరిరక్షణకు కోటి డాలర్లను వెచ్చించారు. వెనిజులా ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు, అలాగే ప్రభుత్వానికి వ్యతిరేకంగా మితవాదశక్తులు సాగిస్తున్న అసత్య, విద్వేష ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు పార్లమెంటు స్పీకర్ జోర్గె రొడ్రిగజ్ నేతృత్వంలో ఒక కమిషన్‌ను ఏర్పాటు చేశారు. బొలివేరియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ రెండో విడత ప్రణాళికలో భాగంగా సైన్యంలోని మితవాద అనుకూలవాదులను అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వానికి, అటార్నీ జనరల్ కార్యాలయానికి మధ్య సమన్వయాన్ని పటిష్టపరచాలని సూచించారు. వెనిజులాను తమ గుప్పెట్లో పెట్టుకోడానికి కొలంబియన్ డ్రగ్స్ ట్రాఫికింగ్ ముఠాలతో కలసి కుట్ర పన్నుతున్న ప్రతిపక్ష నాయకులు మేరియా కొరీనో మచాడో , ఎడ్మండ్ గొంజాలెజ్, మీడియా మాగ్నెట్ ఎలాన్ మస్క్ వంటి బాపతు చేస్తున్న దాడులను దీటుగా ఎదుర్కోవాలని మదురో పిలుపునిచ్చారు. కులీనుల కుట్రలను తిప్పికొట్టడం వెనిజులా ప్రజలకు కొత్తేమీ కాదని ఆయన అన్నారు. .



పుట్టిన రోజు వేడుక కోసం పొదుపు చేసిన సొమ్ము సహాయనిధికి

- మూడేళ్ల బాలుడి వితరణ

తిరువనంతపురం: కేరళలో మూడేళ్ల బాలుడు నైతిక్ నితిన్ తన జన్మదిన వేడుకల కోసం పొదుపు చేసిన డబ్బులను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశాడు. అండలూరుకు చెందిన నైతిక్ తండ్రి నితిన్ అప్పర్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుడు. తల్లి దీప్తి ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగి. తన తల్లిదండ్రులతో వచ్చి ఆ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ కు అందజేశారు. నైతిక్ దయా గుణాన్ని మెచ్చిన కలెక్టర్ అరుణ్ విజయన్ ఆ బాలుణ్ణి అభినందిస్తూ మిఠాయి ఇచ్చారు.

పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ మారణహోమానికి వ్యతిరేకంగా

3న దేశవ్యాప్త నిరసన

- సిపిఎం సహా వామపక్ష పార్టీల సంయుక్త ప్రకటన

ఇండియా న్యూస్ నెట్‌వర్క్

న్యూఢిల్లీ : పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ మారణహోమానికి వ్యతిరేకంగా ఈ నెల 3న దేశవ్యాప్తంగా నిరసనకు సిపిఎంతో సహా వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు బుధవారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశాయి. సిపిఎం, సిపిఐ, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ మరియు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్-లెనినిస్ట్)-లిబరేషన్ నాయకులు ఈ ప్రకటన విడుదల చేశారు. ఈ నిరసనకు దేశంలో అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. అలాగే ఈ ప్రకటనలో ఐరాస తీర్మానాలను, ఐసిజె తీర్పులను ఇజ్రాయిల్ ఉల్లంగిస్తూ, అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమం, దురాగతాలకు వ్యతిరేకంగా తమ సంఘీభావాన్ని తెలియజేయాలని దేశ ప్రజానీకానికి పిలుపునిచ్చాయి. తక్షణ కాల్పుల విరమణ, 1967కి ముందు ఉన్న పాలస్తీనా, రాజధానిగా తూర్పు జెరూసలేంను గుర్తించాలని కోరాయి. అలాగే ఇజ్రాయిల్ నుంచి ఆయుధాలు, సైనిక పరికరాల దిగుమతి-ఎగుమతులపై తక్షణ సైనిక నిషేధాన్ని విధించాలని, అన్ని రకాల సైనిక సహకారాన్ని నిలిపివేయాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. అలాగే ఇజ్రాయిల్‌లో పారిశ్రామిక కార్యకలాపాల కోసం భారతీయ కార్మికుల సహకారం, తరలింపుపై వెంటనే ఆంక్షలు విధించాలని కోరాయి. అలాగే, దౌత్యపరమైన, ఆర్థిక ఆంక్షలతో సహా ఇజ్రాయెల్‌పై చట్టపరమైన ఆంక్షలు విధించాలని కోరాయి. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ఐరాస ప్రత్యేక కమిటీని వేయాలని డిమాండ్ చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరాయి. అలాగే ఇజ్రాయెల్‌కు సైనిక ఆయుధాలు, మందుగుండు సామగ్రి సరఫరా కోసం వివిధ భారతీయ కంపెనీలకు ఇచ్చిన అన్ని ఎగుమతి లైసెన్స్‌లు, అనుమతులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. అలాగే ఇజ్రాయిల్ నుంచి అన్ని ఆయుధాల దిగుమతులను నిలిపివేయాలని కోరాయి. స్వాతంత్ర్యానికి ముందు నుంచి మన వారసత్వానికి అనుగుణంగా భారత ప్రభుత్వం నిర్వహించిన దౌత్య విధానాలను కొనసాగించాలని కోరాయి.

కేరళకు నిధుల కోసం ఎఐఎడబ్ల్యుయు విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కొండచరియలు విరిగపడ్డం, ఆకస్మిక వరదలతో అల్లాడుతున్న కేరళ, వయనాడ్ ప్రజలకు అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) సంఘీభావ ప్రకటించింది. ఈ మేరకు ఎఐఎడబ్ల్యుయు అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎ.విజయ రాఘవన్, బి.వెంకట్ ప్రకటన విడుదల చేశారు. ప్రజల శోకంలో తాము పాలుపంచుకుంటున్నామని, ప్రభావిత వ్యక్తులలో ఎక్కువ మంది గ్రామీణ కార్మికులు, చిన్న రైతులు, ముఖ్యంగా చెట్ల పెంపకంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు ఇవ్వాలని పిలుపు ఇచ్చారు. దేశం అంతటా ఆపదలో ఉన్న ప్రజలకు సహాయం అందించిన చరిత్ర కేరళకు ఉందని, ముఖ్యమంత్రి సహాయ నిధికి నిధులను అందించాలని, ప్రజా విరాళాలను సమీకరించాలని ఎఐఎడబ్ల్యుయు దేశంలోని అన్ని కమిటీలకు పిలుపు ఇచ్చింది.

సిడ్కో ప్లాను పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతం, ఎయిర్‌ఫోర్టు నోటిఫైడ్ ప్రాంతంలో పర్యటించారు. అక్కడ రోడ్లనూ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి సిడ్కో అధికారులు వారు అమలు చేస్తున్న ప్లానుకు సంబంధించిన వివరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే గృహ నిర్మాణ ప్లాను, ఆర్థికాభివృద్ధిపైనా బృందం సిడ్కో అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంది. ఆధునిక నగరాన్ని ఎలా నిర్మించాలనే అంశంపై అధికారులతో సంప్రదింపులు జరిపారు. 2019కు ముందున్న ప్లాను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో దాన్ని స్థానికంగా ఎలా అభివృద్ధి చేయాలనే కోణంలో ప్రభుత్వం దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న పట్టణాభివృద్ధి సంస్థలు, అవి అమలు చేస్తున్న ప్లాన్లనూ పరిశీలిస్తోంది. వాటన్నిటినీ పరిశీలించి అమరావతికి అనుకూలమైన పద్ధతులను ఇక్కడ అమలు చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. ఈ పర్యటనలో సిఆర్‌డిఏ అదనపు కమిషనర్లు నవీన్, సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తదితరులు ఉన్నారు.



బాలకృష్ణ 50 వసంతాల ఆహ్వాన పత్రిక



నందమూరి బాలకృష్ణ తొలిసారి నటించిన 'తాతమ్మ కల' సినిమా 1974 ఆగస్టు 30న విడుదలైంది. అంటే బాలకృష్ణ నటుడిగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా పురస్కరించుకుని తెలుగు సినీ పరిశ్రమ ప్రముఖులు ఆయనను ఘనంగా సన్మానించాలని నిర్ణయించారు. తెలుగు చలన చిత్ర వాణిజ్యమండలి కార్యదర్శి కె.ఎల్.దామోదర్ ప్రసాద్, అధ్యక్షుడు సునీల్ నారంగ్, తెలుగు సినీ నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, తెలుగు సినీ కార్మిక సమాఖ్య అధ్యక్షుడు వల్లభనేని అనిల్ ఇటీవల బాలకష్ణని సంప్రదించారు. సెప్టెంబర్ 1న సాయంత్రం హైదరాబాద్‌లో ఈ ఉత్సవం నిర్వహించనున్నారు.

ఈ వేడుకకు దేశ వ్యాప్తంగా సినిమా, ఇతర రంగాల ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలకష్ణ సినీ ప్రస్థానంపై ఓ ఆహ్వాన పత్రికను రూపొందించి విడుదల చేశారు. ఇందులో బాలకష్ణ సినిమాల పరంగా సాధించిన రికార్డులను, రాజకీయ, సామాజిక రంగాల్లో సేవలను పొందుపరిచారు.

'స్టార్ సినిమా అవార్డు'కు దరఖాస్తులకు ఆహ్వానం



ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 'ఎం' స్క్వేర్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా 'స్టార్ సినిమా అవార్డు'లకు దరఖాస్తులు కోరుతున్నామని ఆ సంస్థ గౌరవాధ్యక్షులు కుమార్‌నాయక్ తెలిపారు. ఎంపికైన వారికి ఈనెల 10న విశాఖపట్టణం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అవార్డులు అతిథుల చేతులమీదుగా అందజేస్తామని పేర్కొన్నారు. ఉత్తమ హీరో, హీరోయిన్, ప్రొడ్యూసర్, డైరెక్టర్, స్టోరీ రైటర్, స్క్రీన్‌ప్లే, డిఒపి (సినిమాటోగ్రాఫర్), ఎడిటర్, సింగర్ (మేల్, ఫిమేల్-బెస్ట్‌మూవీ), లిరిక్ రైటర్, ఆర్ట్ డైరెక్టర్, కొరియోగ్రాఫర్ (మేల్, ఫిమేల్), స్టంట్ డైరెక్టర్, మేకప్ ఆర్టిస్ట్ (మేల్, ఫిమేల్), కాస్ట్యూమ్స్ డిజైనర్, విజువల్ ఎఫెక్ట్స్, డిజిటల్ ఇంటర్‌ఫేస్ (డిఐ),ప్రొడక్షన్ మేనేజర్, పోస్టర్ డిజైనర్‌లతోపాటుగా క్యారెక్టర్ ఆర్టిస్ట్, విలన్, చైల్డ్ ఆర్టిస్ట్, డబ్బింగ్ ఆర్టిస్ట్, జూనియర్ ఆర్టిస్ట్, జూనియర్ ఆర్టిస్ట్-ఏజెంట్, క్యాస్టింగ్ డైరెక్టర్ విభాగాల్లో మేల్, ఫిమేల్ నుంచి దరఖాస్తులు కోరుతున్నామని పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీ సాయంత్రంలోగా తమ పత్రాలను starcineawards@gmail.com కు పంపించాలని కోరారు. మిగతా వివరాలకు సెల్ : 81060,9949399443 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తిచేశారు.

నా గుండె పగిలిపోతోంది

వయనాడ్ విషాదంపై కమల్‌హాసన్

చెన్నై: వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనపై ప్రముఖ సినీ నటుడు కమల్ హాసన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విపత్తు ప్రభావాన్ని అర్థం చేసుకుని అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సహాయక చర్యలు చేపడుతున్న ఆర్మీకి, రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. 'వయనాడ్‌లో కొండ చరియలు విరిగిపడి సృష్టించిన విలయాన్ని చూస్తే నా గుండె పగిలిపోతోంది 'అని కమల్ హాసన్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టారు. ఈ విపత్తులో చనిపోయినవారికి ప్రగాఢ సంతాపం ప్రకటిస్తూ, బాధితుల కుటుంబాలకు తన సానుభూతి తెలిపారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రకృతి వైపరీత్యాలు నిత్యకృత్యంగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు.



'గేమ్ ఛేంజర్' జాబిలమ్మ

రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రానున్న 'గేమ్ ఛేంజర్" చిత్రం నుండి కొత్త పోస్టర్ విడుదలైంది. బుధవారం ఈ చిత్ర కథానాయిక కియారా అద్వాని పుట్టినరోజు కావడంతో తన పోస్టర్‌ని చిత్రబృందం విడుదల చేసింది. 'జాబిలమ్మకి జన్మదిన శుభాకాంక్షలు' అంటూ మేకర్స్ ఈ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. పాన్ ఇండియాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మూడేళ్లుగా షూట్ చేస్తూనే ఉన్నారు. భారతీయుడు-2 చిత్రం కారణంగా ఆలస్యమవుతున్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలుకానుంది. రామ్ చరణ్‌కు సంబంధించి 10 రోజులు షూటింగ్ బ్యాలెన్స్ పూర్తి చేసి సెకండ్ సింగిల్‌ను కూడా వీలైనంత త్వరగా రిలీజ్ చేస్తారని సమాచారం. డిసెంబర్ 25న ఈ సినిమాని విడుదల చేస్తామని నిర్మాత దిల్ రాజు ఇటీవల ప్రకటించారు.



'రఘు తాతా' ట్రైలర్ విడుదల

కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ 'రఘు తాతా'. సుమన్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి చిత్రబృందం ట్రైలర్‌ను లాంచ్ చేసింది. హిందీ రాని తమిళ అమ్మాయి ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొందనే నేపథ్యంలో ఆసక్తికరంగా ఈ ట్రైలర్‌లో చూపించారు. ఈ మూవీని కేజీఎఫ్, సలార్ లాంటి బ్లాక్ బస్టర్ ప్రాంచైజీలను తెరకెక్కించిన హొంబలే ఫిల్మ్స్ తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో ఎంఎస్ భాస్కర్, రవీంద్ర విజయ్, దేవదర్శిని, రాజీవ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి షాన్ రోల్డన్ సంగీతం అందిస్తున్నారు.

పతకాలకు చేరువలో లౌవ్లీనా, స్వప్నిల్

- ప్రి క్వార్టర్స్‌కు లక్ష్యసేన్, సింధు
- పారిస్ ఒలింపిక్



పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో ఐదోరోజు భారత్‌కు ఒక్క పతకం దక్కకున్నా.. మెరుగైన ఫలితాలు సాధించారు. షూటింగ్‌లో స్వప్నిల్ కుశాలే, మహిళల బాక్సింగ్‌లో లౌవ్లీనా బోర్గోహైన్ పతకాలకు చేరువయ్యారు. 50మీ. రైఫిల్ 3 ఈవెంట్‌లో స్వప్నిల్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో 7వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకోగా... బాక్సర్ లౌవ్లీనా బోర్గోహైన్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరింది. ఫైనల్లో సత్తా చాటితే షూటర్ స్వప్నిల్‌కు పతకం దక్కనుండగా.. క్వార్టర్స్‌లో నెగ్గితే బోర్గోహైన్‌కు కనీసం కాంస్య పతకం ఖాయం కానుంది. మహిళల టేబుల్ టెన్నిస్‌లో శ్రీజ ఆకుల ముందంజ వేయగా.. మనికా బత్రా ఓటమిపాలైంది. ఇక బ్యాడ్మింటన్ విభాగంలో లక్ష్యసేన్ ఏకంగా 3వ ర్యాంక్ ఆటగాడు జొనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా)పై సంచలన విజయం సాధించాడు. అలాగే పివి సింధు కూడా ప్రి క్వార్టర్స్‌కు చేరి పతకం రేసులో నిలిచింది.

షూటింగ్ ఫైనల్‌కు స్వప్నిల్

50మీ. రైఫిల్ 3 పొజిషన్స్ ఈవెంట్‌లో స్వప్నిల్ కుసాలే అదరగొట్టాడు. ఫైనల్‌కు చేరి విశ్వ క్రీడల షూటింగ్‌లో ఫైనల్ చేరిన ఐదో భారత షూటర్‌గా స్వప్నిల్ గుర్తింపు సాధించాడు. బుధవారం జరిగిన పురుషుల పోటీల్లో స్వప్నిల్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. నిలకడైన గురితో నీలింగ్ రౌండ్‌లో 198 పాయింట్లు, ప్రొన్ రౌండ్‌లో 197 పాయింట్లు సాధించి 7వ స్థానంలో నిలిచాడు. దాంతో, ఫైనల్‌కు దూసుకెళ్లి పతకంపై ఆశలు రేపాడు. నేడు ఫైనల్ రౌండ్ జరగనుంది. ఇదే విభాగంలో ఐశ్వర్య ప్రతాప్ సింగ్ నిరాశపరిచింది. 11వ స్థానంలో నిలిచాడు. టాప్-8 షూటర్స్ ఫైనల్లో పతకాలకు పోటీపడనున్న సంగతి తెలిసిందే.

లౌవ్లీనాపైనే ఆశలు..

టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన మహిళా బాక్సర్ లౌవ్లీనా బోర్గోహైన్ పారిస్ ఒలింపిక్స్‌లోనూ సత్తా చాటింది. బుధవారం జరిగిన మహిళల 75 కిలోల విభాగం బౌట్‌లో లొవ్లీనా నార్వేకు చెందిన సున్నివా హెఫ్‌స్తాద్‌ను చిత్తుగా ఓడించింది. ఏకపక్షంగా సాగిన ఈ పోరులో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన లౌవ్లీనా తొలి రౌండ్ నుంచి ప్రత్యర్థిపై విరుచుకుపడింది. ఆమె ధాటికి సున్నివా కోలుకోలేకపోయింది. దాంతో 5-0 పాయింట్లతో లౌవ్లీనాను అంపైర్లు విజేతగా ప్రకటించారు. దీంతో లౌవ్లీనా పతకానికి ఒక్క అడుగు దూరంలో నిలిచింది. క్వార్టర్‌ఫైనల్లో లీ కియాన్ (చైనా)తో తలపడనుంది. సెమీస్ చేరితే లౌవ్లీనాకు పతకం ఖాయం కానుంది. 54కిలోల విభాగం ప్రి క్వార్టర్స్‌లో ప్రీతి పవార్ ఓటమి పాలైంది. కొలంబియా ప్రత్యర్థి యేని మార్సిలా ఏరియస్ చేతిలో 2-3 పాయింట్ల తేడాతో ప్రీతి పరాజయం చవిచూసింది. పాన్ అమెరికా గేమ్స్ చాంపియన్, ప్రపంచ రజత పతక విజేత యేని బలమైన పంచ్‌లు విసిరింది. తొలి రౌండ్‌లో ప్రీతి 1-4 తేడాతో ఓటమి పాలైంది. కానీ ఆ తర్వాత మెరుగ్గా రాణించింది. ఆ తర్వాత కొలంబియా క్రీడాకారిణి పంచ్‌ల నుంచి తప్పించుకున్న ప్రీతి స్వల్ప తేడాతో బాక్సింగ్ మ్యాచ్‌ను చేజార్చుకుంది.

బ్యాడ్మింటన్‌లోనూ గెలుపే..

బ్యాడ్మింటన్ ఆటగాళ్లు లక్ష్యసేన్, పివి సింధు ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లారు. బుధవారం జరిగిన గ్రూప్ చివరి లీగ్ మ్యాచ్‌లో.. ప్రపంచ 3వ ర్యాంక్ ప్లేయర్ జొనాథన్ క్రిస్టీపై 21-18, 21-12తో విజయం సాధించాడు. తొలి గేమ్‌లో 2-8 తేడాతో వెనుకబడ్డా సేన్.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకొన్నాడు. ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చి ఆ గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్ స్టార్టింగ్‌లో ఇద్దరి మధ్య నువ్వా-నేనా అన్నట్లుగా సాగింది. ఇండోనేషియాకు చెందిన జొనాథన్ ఆధిక్యం కోసం ప్రయత్నించినా.. సేన్ దూకుడుగా ఆడాడు. ప్రి క్వార్టర్స్‌లో భారత్‌కే చెందిన హెచ్.ఎస్. ప్రణయ్‌తో తలపడే అవకాశముంది. ఇక మహిళల సింగిల్స్‌లో పివి సింధు వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో సింధు 21-5, 21-10తో ఎస్టోనియాకు చెందిన కుబ్బాపై విజయం సాధించింది.

ప్రి క్వార్టర్స్‌లో ఓడిన మనిక

టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి మనిక బత్రా ప్రి క్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. బుధవారం జరిగిన ప్రి క్వార్టర్స్ పోటీలో మనిక 6-11, 9-11, 14-12, 8-11, 6-11తో జపాన్ క్రీడాకారిణి చేతిలో ఓటమిపాలైంది. శ్రీజ ఆకుల 9-11, 12-10, 11-4, 11-5, 10-12, 12-10తో సింగపూర్‌కు చెందిన జియాన్ జెంగ్‌ను ప్రత్యర్థిని మట్టికరిపించింది. పురుషుల విభాగంలో సీనియర్ ఆటగాడు అచంత శరత్ కమల్ తొలి రౌండ్‌లోనే ఓటమి పాలయ్యాడు.

పతకాల పట్టిక(టాప్-10)

దేశం	స్వ	ర	కా	మొ
1. చైనా	8	6	2	16
2. ఆస్ట్రేలియా	7	4	3	14
3. జపాన్	7	3	4	14
4. ఫ్రాన్స్	6	9	7	22
5. బ్రిటన్	6	6	5	17
6. ద.కొరియా	5	3	3	11
7. అమెరికా	4	12	12	27
8. ఇటలీ	3	6	4	13
9. కెనడా	2	2	2	6
10. జర్మనీ	2	2	1	5
37. ఇండియా	0	0	2	2

గమనిక: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం

అన్షుమన్ గైక్వాడ్ కన్నుమూత



వడోధర: భారత దిగ్గజ క్రికెటర్, మాజీ కోచ్ అన్షుమన్ గైక్వాడ్(71) కన్నుమూశారు. బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న గైక్వాడ్ బుధవారం రాత్రి మృతిచెందిన విషయాన్ని బిసిసిఐ ధ్రువీకరించింది. కేన్సర్‌కు చికిత్స నిమిత్తం తొలుత లండన్‌కు వెళ్లిన గైక్వాడ్ ఆ తర్వాత తిరిగి వచ్చి నెలరోజులుగా బరోడాలోనే ఉంటున్నారు. భారతజట్టు సెలెక్షన్ కమిటీ సభ్యునిగా కూడా పనిచేసిన గైక్వాడ్.. 40టెస్టులు, 15వన్డేల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. రెండు ఫార్మాట్‌లలో కలిపి 2,254పరుగులు చేసిన గైక్వాడ్.. అజారుద్దీన్, సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ కెప్టెన్లుగా ఉన్న సమయంలో కోచ్‌గా కూడా పనిచేశారు. బరోడా తరఫున 250 దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లనూ ఆడారు. వెస్టిండీస్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేసిన గైక్వాడ్.. 1987లో ఈడెన్ గార్డెన్స్‌లో కెరీర్ ఆఖరి టెస్ట్ మ్యాచ్ ఆడారు. గైక్వాడ్ మృతికి ప్రధాని నరేంద్ర మోడీతోపాటు బిసిసిఐ సెక్రటరీ జై షా, దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్ తదితరులు ఎక్స్(ట్విటర్)లో సంతాపం ప్రకటించారు.





ఎగిరే పిట్టకు మసాలా నూరడం

చాలా కాలం క్రితం చంద్రగిరిలో చిట్టిబాబు, అతడి భార్య చిన్నమ్మలు నివసించేవారు. చిట్టిబాబు వ్యవసాయానికి కావల్సిన నాగలి, కాడి, మేడి, బండి, కొడవళ్ళు, గునపాలు, బొరిగెలు, నాగళ్ళు చేసేవాడు. కొడవళ్ళకు కక్కు కొట్టేవాడు. చిన్నమ్మలు తెలివైనది. భర్తకు చేదోడు వాదోడుగా ఉండేది. తొలకరి రానే వచ్చింది. వ్యవసాయదారులు పనిముట్లు కోసం వస్తారని భావించిన చిట్టిబాబు భార్యను పిలిచి 'నేను పట్నం వెళ్లి పనిముట్లు చేయడానికి అవసరమైన ఇనుము కొనుక్కుని వస్తాను' అన్నాడు.

'మన దగ్గరున్న కొద్దిపాటి సొమ్ము ఖర్చు పెట్టేస్తే ఎలా? పనిముట్లు చెయ్యమని నీ దగ్గరికి ఎవ్వరూ రాలేదు. రాబడి లేకుండా ఉన్నది ఖర్చు చేస్తానంటున్నావు. 'ఎగిరే పిట్టకు మసాలా నూరినట్లు ఉంది నీ పని' అంది భార్య.


'అంటే నీ ఉద్దేశ్యం?' అన్నాడు చిట్టిబాబు.

'పూర్వం చిత్రకూట పర్వతం ప్రాంతంలో జంగయ్య అనే బోయవాడు నివసించేవాడు. అతడు ప్రతిరోజూ పిట్టలను వేటాడి జీవనం స... అడవికి పోతూ 'నేను పి... నువ్వు మసాలా నూరి ఉంచు' అని భార్యకు చెప్పి అడవికి వెళ్ళాడు. నిత్యం భర్త చేసే పని వేటాడటమే కాబట్టి ఉన్న కొద్దిపాటి మసాలా దినుసులను నూరి వంటకు సిద్ధం చేసి ఉంచింది భార్య. సాయంత్రం చీకటి పడే సమయానికి వట్టి చేతులతో వచ్చాడు జంగయ్య. భర్తని చూసి 'కూర చెయ్యడానికి పిట్టలేదు, కూరగాయలూ లేవు. సిద్ధం చేసి ఉంచిన మసాలా రేపటికి పాడైపోతుంది. ఎగిరే పిట్ట దొరుకుతుందో దొరకదో తెలియదు దానికోసం మసాలా నూరి ఉంచమన్నావు. ఈరోజుకి కూర లేదు, రేపటి కూరలోకి మసాలా లేదు' అని బాధపడింది. ఇదీ కథ. ఇప్పుడు నీ వాలకం కూడా అలాగే ఉంది' అంది చిట్టిబాబు భార్య. భార్య మాటల్లో వాస్తవాన్ని గ్రహించిన చిట్టిబాబు పట్టణం వెళ్ళడం మానుకున్నాడు. ఏదో సాధిస్తామని, ఎంతో సంపాదిస్తామని ఊహిస్తూ, ఊహల్లో తేలుతూ చేతిలో ఉన్న డబ్బులు ఖర్చు పెట్టి ఇబ్బంది పడే వారి విషయంలో వాడే సామెత ఇది. 'మబ్బుల్లో నీళ్ళు చూసి ముంత ఒలకబోసుకోవడం' అని కూడా అంటారు.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న అంకెల పక్కన ఉన్న చుక్కలను వరుసగా కలిపితే అందమైన కుక్క పిల్ల బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.



నేను తయారు చేసిన బొమ్మ





రాయచోటి హేమ శ్రీజ,
1వ తరగతి, పవన్ స్కూలు,
కొత్త పేట, రాయచోటి,అన్నమయ్య జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



మీకోసం

వడలిపోయిన టమాటాలను రాత్రంతా ఉప్పనీటిలో ఉంచితే తాజాగా మారతాయి.

జీవన సౌరభం

దృఢ సంకల్పం, తరగని ఆత్మవిశ్వాసం, బలమైన కోరిక ఉన్న చోట విజయం తప్పక వచ్చి తీరుతుంది.

JEEVANA
జీవన the family

స్వావలంబన కోసం సామాజిక సేవ

'ప్రార్థించే పెదవులకన్నా.. సాయం చేసే చేతులు మిన్న.. సహాయం చేయటానికి ఉండాల్సింది డబ్బు కాదు... సాయం చేసే మనస్సు' అన్న సేవామూర్తి మదర్ థెరిస్సా సూక్తులను స్ఫూర్తిగా తీసుకున్నారు కోయ సుధాశ్రీనివాస్. తన చుట్టూ సమాజంలో పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, మహిళలపై హింస-వేధింపులు వంటి సమస్యలు తాండవిస్తున్న క్రమంలో తన వంతుగా సమాజానికి ఎంతోకొంత చేయాలనే తపనతో ఆమె ముందుకు సాగుతున్నారు. గత 30 ఏళ్లుగా ఆమె ఎందరో మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. తన భర్త శ్రీనివాస్, తోబుట్టువు సహకారంతో ముందుకు వెళ్తున్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం మండలం చంద్రాల గ్రామంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన దావులూరి వెంకటేశ్వరరావు, కనకదుర్గ దంపతులకు సుధ జన్మించారు. ప్రాథమిక విద్య చంద్రాల, వెల్వడంలోనూ, ఇంటర్‌ను మైలవరంలోనూ, డిగ్రీ ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా పూర్తిచేశారు. అనంతరం మైలవరానికి చెందిన శ్రీనివాస్‌తో వివాహమైంది. 22 సంవత్సరాలపాటు ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఆర్థికంగా వెనుకబడిన గిరిజన విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు చెప్పేవారు. చదువు మధ్యలోనే ఆపేసిన పిల్లల తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాలలు, కళాశాలలకు తిరిగి పంపించేలా ప్రోత్సహించారు. వికలాంగులను ఆదరించి వారికి ఆర్థికంగా సహాయపడుతూ చదువులో మరింతగా ప్రోత్సహించారు. ఆ తర్వాత తన భర్త సహకారంతో సామాజిక సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించటానికి పూనుకున్నారు.



చిన్నప్పటి నుంచి సేవాభావం

హైస్కూలు విద్యలోనే తోటి విద్యార్థినుల ఆర్థిక ఇబ్బందులను తెలుసుకుని తల్లిదండ్రులను ఒప్పించి కొంత సహాయం చేయించారు. ఎస్‌పిఎల్‌గా, విద్యార్థి సంఘం లీడర్‌గా అన్ని విషయాల్లో ముందుండేవారు. వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు రాష్ట్రప్రభుత్వం అప్పట్లో నిర్వహించిన వయోజన విద్య ప్రాజెక్టు (అక్షరకృష్ణ)లో ఇంటర్ పూర్తయిన తర్వాత వాలంటీర్‌గా పనిచేసి పరిసర ప్రాంతాల్లోని నిరక్షరాస్యులు, వృద్ధులకు చదువు నేర్పారు.

మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ...

ఆపదలో ఉన్న వారికి ఏదో ఒక రూపంలో సాయాన్ని అందించాలనే లక్ష్యంతో 'మదర్‌థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్'ను 2018లో ప్రారంభించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లోని గ్రామాలకు తమ సేవా కార్యక్రమాలను విస్తరించారు. తమ ట్రస్ట్ ద్వారా మహిళల స్వయం ఉపాధి నిమిత్తం టైలరింగ్, మగ్గం, జ్యూట్ బ్యాగుల తయారీ, ఫ్యాషన్ డిజైన్, బ్యూటీ కేర్, పచ్చళ్ళ, కారంపొడులు, పిండివంటల తయారీ, కంప్యూటర్ వంటి శిక్షణలు పెద్దఎత్తున ఏర్పాటుచేశారు. ఇప్పటివరకూ సుమారు 20 వేల మంది వరకూ ఈ శిక్షణను పొంది ఆర్థికంగా తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. శిక్షణ పొందిన వారిని క్లస్టర్‌గా ఏర్పాటు చేసి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం వచ్చేలా కృషిచేస్తున్నారు. 'రుచి' ఫుడ్ కేంద్రాన్ని ఏర్పాటుచేసిన మహిళా యూనిట్లతో ఇతర ప్రాంతాలకు పంపిస్తూ వారికి ఆదాయం సమకూరేలా కృషిచేశారు.



ఆపన్నులకు అండగా...

రైతులకు పాడిపరిశ్రమలు, సేంద్రియ వ్యవసాయ సాగు పద్ధతులపై పలు అవగాహనా సదస్సులు నిర్వహించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన మదర్‌థెరిస్సా హోం ద్వారా అనాథలు, వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులకు అన్నదానం చేశారు. నిత్యావసర వస్తువులు, బియ్యం, సరుకులు, దుస్తులు, చలికాలంలో దుప్పట్లు వంటివి పంపిణీచేస్తున్నారు. ఎయిడ్స్, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మందులు, ఆహారం పంపిణీచేస్తూ ఆసరాగా నిలుస్తున్నారు. వికలాంగులకు మూడు చక్రాల వాహనాలు అందజేశారు. వికలాంగుల కోసం ప్రత్యేక విద్య, ఫిజియోథెరపీ కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలందించారు. కొంతమంది పేద విద్యార్థులకు ఫీజులు సైతం చెల్లిస్తున్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో పేదలు, వలస కార్మికులు, యాచకులు, అనాథలకు ఫుడ్ ప్యాకెట్లు, మాస్కులు, సరుకులు, కూరగాయాలను ట్రస్ట్ ద్వారా పంపిణీచేశారు. తుపాన్లు, వరదల సమయాల్లో దాతల సహకారంతో వస్తు, ధన రూపేణా సేకరించి బాధితులకు పంపిణీచేశారు.

కౌన్సిలింగ్‌లతో ...

చిన్న తగాదాలతో విడిపోవాలనుకున్న దంపతులకు కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి సంసారం చేసుకునే ప్రోత్సహిస్తున్నారు. వందలాది జంటలను ఆ విధంగా నిలిపేందుకు తనవంతుగా పాత్రను పోషించారు. హ్యూమన్‌రైట్స్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు.

యువతీ యువకులకు ఆరోగ్య అవగాహన, మెడికల్ క్యాంపులు, రక్తదాన శిబిరాలు నిర్వహించటంతోపాటుగా 'కెరీర్‌గైడెన్స్' ఇవ్వటం ద్వారా వారి జీవితంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా తనవంతుగా కృషిచేస్తున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా పోటీపరీక్షలకు కోచింగ్‌లు ఏర్పాటుచేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంలో ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, సంస్థల ప్రాంగణాల్లో మొక్కలు నాటించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మొక్కలు-వాటి ప్రాధాన్యత, పెంపకం, రక్షణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా అవగాహనా సదస్సులు, ర్యాలీలు వంటివి చేయించారు.

–యడవల్లి శ్రీనివాసరావు

తోటి వారికి సహాయంలో సంతృప్తి



మాకున్న దాంట్లో కొంత సమాజ సేవ కోసం వెచ్చించాలనే సదాశయంతో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం. తద్వారానే ఎంతో సంతృప్తి పొందుతున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టుల్లో భాగస్వామం కూడా లభించటంతో తద్వారా కూడా ఎంతో కొంత సేవ చేయటానికి అవకాశం ఏర్పడింది. ప్రతిఒక్కరూ ఎంతోకొంత సమాజానికి సేవచేస్తే అభాగ్యులు, అన్నార్తులకు మేలు జరుగుతుంది. మా సేవలను గుర్తించి కొందరు దాతలు సహకరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కూడా ప్రోత్సాహం లభిస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి ఎఫ్‌సిఆర్‌ఎ గుర్తింపు వచ్చింది.

– కోయ సుధాశ్రీనివాస్
మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68